www.velthuru.com RNI TEL TEL/ 2019 / 78609 ఆదివారం

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి। 24, నవంబర్ 2024

సంపుటి: 6 సంచిక: 175, పేజీలు: 12, వెల: రూ.5/-



## కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదు..

# ఇండస్ట్రియల్ కారిడార్

- సీఎంను కలిసిన వామ పక్షాల నేతలు
- కొడంగల్ అభివృద్ధి బాధ్యత నాదే
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు : సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:** కొడంగల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలో యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ఇండస్ట్రియల్ కారిడార్‌ను ప్రతిపాదించినట్టు చెప్పారు. కొడంగల్ నియోజకవర్గం

మిగతా..2లో

## రెండు రాష్ట్రాల్లోనూ

# అధికారం యధాతథం



- మహారాష్ట్రలో మహాయతి కూటమిదే అధికారం
- జార్ఖండ్‌లో మళ్లీ సత్తా చాటిని హేమంత్ సోరెన్
- జార్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తారుమారు

**హైదరాబాద్, (వెలుతురు):** మహారాష్ట్ర, ఝార్ఖండ్ శాసనసభల ఎన్నికల ఫలితాలు శనివారం వెల్లడయ్యాయి. మహారాష్ట్రలో అధికార మహాయుతి కూటమి అఖండ విజయం సాధించింది. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ కూటమి కనీస పోటీ ఇవ్వలేకపోయింది. అటు ఝార్ఖండ్‌లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా జేఎంఎం కూటమి జోరు ప్రదర్శించింది. ఈ క్రమంలో ఈ రెండు పార్టీలు మరోమారు ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం ఖాయమైంది. మహారాష్ట్రలోని నాగ్‌పూర్

మిగతా..2లో

# తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోంది

## కాంగ్రెస్ సర్కార్‌పై బీజేపీ యుద్ధం ప్రకటించబోతోంది

- మహారాష్ట్రలో పట్టిన గతే తెలంగాణలో కాంగ్రెస్‌కు పట్టబోతోంది
- కాంగ్రెస్ ఐరన్ లెగ్ పార్టీ. ఆ పార్టీ జతకడితే మునుగుడు ఖాయం
- మహారాష్ట్రలో కాంగ్రెస్ అబద్ధాలను జనం ఛీకొట్టారు
- మోదీ అభివృద్ధి మంత్రం పనిచేసింది
- గతం కంటే ఎక్కువ మెజారిటీతో ఆశీర్వదించారు
- కులగణన పెద్ద బోగస్...
- పెన్సిల్ ఫారాలు నింపి పెన్నుతో సంతకం తీసుకోవడమేంది?
- కాంగ్రెస్‌కు నచ్చినట్లుగా రాసుకోవడానికే పెన్సిల్‌ను ఉపయోగిస్తున్నారా?
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



**కరీంనగర్ వెలుతురు నవంబర్ 23:** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ యుద్ధం ప్రకటించబోతోందన్నారు. మహారాష్ట్రలో ఎన్ని అబద్ధాలు ప్రచారం చేసినా కాంగ్రెస్ కూటమిని నమ్మలేదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభివృద్ధి మంత్రమే పనిచేసిందని, గతంలో కంటే ఎక్కువ మెజారిటీ సీట్లు బీజేపీ కూటమికి కట్టబెట్టడమే ఇందుకు నిదర్శనమ్నారు. కాంగ్రెస్ ఐరన్ లెగ్ పార్టీ అని, ఆ పార్టీతో జతకట్టిన పార్టీలన్నీ మునిగిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ కూటమి ముక్కలు కావడం ఖాయమన్నారు. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీలో లుకలుకలు మొదలుకాబోతున్నాయని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొట్టే అవకాశం, అవసరం బీజేపీకి లేదని చెప్పిన బండి సంజయ్. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ పార్టీ ఎమ్మెల్యేలు కూల్చుకుంటారని చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో కరీంనగర్ లోని మహాశక్తి ఆలయ ఆవరణలో బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. ఏమన్నారంటే.

మహారాష్ట్ర ఎన్నికల్లో బీజేపీ కూటమి విజయ దుందుబి మోగించింది. తెలంగాణలోని సర్వే సంస్థ "పీపుల్స్ పల్స్" చెప్పినట్లుగా ఎన్డీఏ కూటమికి అద్భుతమైన మెజారిటీ లభించింది. మ్యాజిక్ ఫిగర్ దాటి 220పైగా సీట్లలో ఎన్డీఏ కూటమి విజయం సాధించబోతోంది. బీజేపీ గతంలో 105 స్థానాలు గెలిస్తే

మిగతా..2లో

## రూ.23 కోట్ల కేంద్ర నిధులతో గంభీరావుపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

- లింగన్నపేట నుండి కోరుట్లపేట వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్
- గంభీరావు పేట నుండి మల్లారెడ్డిపేట వరకు రూ.8.30 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభం
- కాంగ్రెస్ సైతం బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందన్న బండి సంజయ్
- తెలంగాణ సొమ్మును ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలకు ఖర్చు చేస్తున్నారని మండిపాటు
- హామీల అమలులో మొండి చేయి చూపుతున్నారని ధ్వజం

**గంభీరావుపేట, వెలుతురు నవంబర్ 23:** కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం రోజున సిరిసిల్ల జిల్లాలోనిగంభీరావుపేట మండలంలో రూ.23 కోట్ల కేంద్ర నిధులతో అభివృద్ధి పనులను శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా లింగన్నపేట నుండి కోరుట్లపేట వరకు నిర్మించిన రోడ్డును బండి సంజయ్ ప్రారంభించారు. అట్లాగే గంభీరావుపేట నుండి మల్లారెడ్డిపేటకు వెళ్లే దారిలో రూ.8.30 కోట్ల కేంద్ర నిధులతో నూతనంగా నిర్మించిన బ్రిడ్జిని సైతం కేంద్ర మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గంభీరావుపేట లోని ఎల్లమ్మ దేవాలయం వద్ద బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఏమన్నారంటే...

గతంలో గంభీరావుపేట ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు లింగన్నపేట

మిగతా..2లో





## భద్రాచల రామాలయం

# అభివృద్ధికి 68 కోట్లు

- మంత్రి శ్రీనివాస్ రెడ్డి
- ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అభివృద్ధి పనులు
- మాడ వీధుల నిర్మాణానికి ల్యాండ్ అసిక్విజిషన్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:** ఆగమ శాస్త్రం ప్రకరాం భద్రాచల పుణ్యక్షేత్రం అభివృద్ధి చేసే భాగంగా, మాడ విధుల నిర్మాణం కోసం చేయవలసిన ల్యాండ్ ఆసీక్విజిషన్ మరియు ఇతర కార్యక్రమాల పై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నాడు స్వామీ దర్శనం అనంతరం ఉన్నత అధికారులతో భేటీ అయ్యారు, అలాగే 68 కోట్లు ఇప్పటికే భద్రాచల పుణ్యక్షేత్రానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు, అలాగే జిల్లాకు సంబందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల

మిగతా..2లో



## మహారాష్ట్రలో గెలుపు

# తెలంగాణలో సంబరాలు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు నవంబర్ 23:** మహారాష్ట్రలో మహాయుతి కూటమి ఘనవిజయం సాధించడంతో రంగారెడ్డి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బొడిగె రమాదేవి రవీందర్ గౌడ్ వారి నివాసంలో బానసంచ కాల్చి స్వీట్లు పంచి సంబరాలు నిర్వహించారు.





# మహబూబ్ నగర్‌లో 30న రైతు సదస్సు: సీఎం రేవంత్ రెడ్డి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:** ప్రజా ప్రభుత్వ ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 30 న మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతుల కార్యక్రమాన్ని బహిరంగ సభలా కాకుండా వారికి అవగాహన కల్పించే రైతు సదస్సుగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆధునిక సాగు పద్ధతులు, మెళకువలపై రైతులకు అవగాహన కల్పించే లక్ష్యంగా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లను ఏర్పాటు చేయాలని చెప్పారు.

వ్యవసాయ శాఖ, ఈ నెల 30 వ తేదీన మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రైతు సదస్సు వంటి అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారుల సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలు,

మిగతా..2లో

## టీజీఎస్ఆర్టీసీ పనితీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

-సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఆర్టీసీ ఉన్నతాధికారులు

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:** హైదరాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) పనితీరుపై రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు.



ఈ సమావేశంలో మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, కొత్త బస్సుల కొనుగోలు, లాజిస్టిక్స్, ఆర్థిక పరమైన అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మంత్రికి ఆర్టీసీ ఉన్నతాధికారులు వివరించారు.

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి-మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని ఆర్టీసీ సమర్థవంతంగా అమలు చేస్తోందని, సంస్థలోని

మిగతా..2లో

## రూ.3.58 కోట్ల వ్యయంతో

# జైనథ్‌లో మినీ స్టేడియం

## - ఎమ్మెల్యే పాయల శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 23:** క్రీడల అభివృద్ధి కోసం మండల కేంద్రంలో ఎన్నో ఏళ్ల నుంచి ప్రతిపాదనలో ఉన్న మినీ స్టేడియం నిర్మాణానికి రూపాయలు 3.58 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు శనివారం స్టేడియం నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు యువత విద్యార్థులు ఎక్కువగా ఆసక్తి చూపే వాలీబాల్ క్రికెట్ తో పాటు అథ్లెటిక్ ట్రాక్ షాపింగ్ కాంప్లెక్స్ తదితర నిర్మాణాలు స్టేడియంలో చేపడతారని ఆయన తెలిపారు క్రీడల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కే లో ఇండియా పథకం కింద ఆదిలాబాద్ స్టేడియం లో సౌకర్యాలు కల్పించేందుకు ప్రతిపాదనలు పంపించినట్లు ఆయన తెలిపారు యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని క్రీడల్లో నైపుణ్యత సాధించాలని ఆయన కోరారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా క్రీడల అభివృద్ధికి కృషి చేస్తున్నాయని ఆయన తెలిపారు అధికారులు సైతం రెండు రోజుల్లో పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేసి క్రీడాకారులకు అందించాలని ఆయన కోరారు.



ఈ కార్యక్రమంలో నాయకులు రాందాస్ రాకేష్ రెడ్డి సత్యనారాయణ ప్రతాప్ రమేష్ విశాల్ పోతరాజు రమేష్ సాయి. అశోక్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్ నగర్‌లో 30న
# రైతు సదస్సు: సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి..

పరిశోధనా సంస్థలు అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ ఫామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడే విధంగా ఇటీవలి కాలంలో వివిధ కంపెనీల వినూత్న ఉత్పాదనలన్నీ స్టాళ్లలో ఉంచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆధునిక పరికరాల వినియోగం, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్ల వాడకం వంటి సాంకేతిక పరికరాలన్నింటినీ సదస్సు నిర్వహించే చోట ప్రయోగాత్మకంగా ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలన్నారు. ఈ సదస్సులో రాష్ట్రంలోని రైతులు పెద్ద ఎత్తున పాల్గొనేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

రైతుల్లో అవగాహన పెంచడానికి వీలుగా సదస్సును ఒకరోజు కాకుండా 28 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేలా స్టాళ్లను ఏర్పాటు చేసి అందుబాటులో ఉంచాలని సీఎం అధికారులకు సూచించారు.తద్వారా రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా ఈ సదస్సు ఉపయోగపడాలన్నారు. రుణమాఫీ అంశం చర్చకు వచ్చినప్పుడు, రాష్ట్రంలో రూ.2 లక్షల వరకు 23 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు,

కొన్నిచోట్ల ఆధార్ నెంబర్ల తప్పులు, బ్యాంకు ఖాతాల్లో నమోదైన పేర్లలో తప్పులు, కుటుంబాల నిర్ధారణ వంటి కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదని వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ సందర్భంగా సీఎం కు నివేదికను అందించారు.సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి .ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి .ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మ్ సిటీ కాదు..
# ఇండస్ట్రియల్ కారిడార్

మొదటిపేజీ తరువాయి..
లగచర్ల ఘటనపై సీపీఐ, సీపీఎం, ఎంసీ పీఐ(యు), ఆర్ఎస్పీ, సీపీఐ (ఎంఎల్ – లిబరేషన్) తదితర పార్టీల నాయకుల ప్రతినిధి బృందం సీఎం రేవంత్ రెడ్డి ని సచివాలయంలో కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, కొడంగల్ నియోజకవర్గం అభివృద్ధికి చేపడుతున్న ప్రణాళికలను సమగ్రంగా వివరించారు. కొడంగల్‌లో ఏర్పాటు చేయబోయేది ఫార్మా సిటీ కాదన్న విషయాన్ని గుర్తుచేశారు. కొడంగల్ ఎమ్మెల్యేగా నియోజకవర్గ అభివృద్ధి తన బాధ్యత అని, సొంత నియోజకవర్గ ప్రజలకు మేలు చేయాలన్నదే తన సంకల్పమని చెప్పారు.సొంత నియోజకవర్గ ప్రజలకు ప్రయోజనం చేయడమే తప్ప ఎవరికీ నష్టం కలిగించడం లేదని చెప్పారు. ఉపాధికి అవకాశాలు పెంచే దిశగా ఇండస్ట్రియల్ కారిడార్‌లో కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్నారు.భూ సేకరణ విషయంలో పరిహారం పెంచాలన్న అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

సీపీఐ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు,సీపీఎం రాష్ట్ర నాయకులు తమ్మినేని వీరభద్రం ,జూలకంటి రంగారెడ్డి తో పాటు ఇతర నాయకులు సీఎం రేవంత్ రెడ్డి ని కలిసిన వారిలో ఉన్నారు.

## భద్రాచల రామాలయం
# అభివృద్ధికి 68 కోట్లు

మొదటిపేజీ తరువాయి..
నాగేశ్వర్ రావులతో కలిసి రామాలయం అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా



సాగుతున్నాయని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో ఉందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ఏ రాష్ట్రంలోనూ రాని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం అభినందనీయమని మంత్రి తెలిపారు. బిజినెస్ ఎకో సిస్టమ్ లో టాప్ ప్లేస్ లో హైదరాబాద్ ఉందని శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## హైదరాబాద్ ప్రజల తాగు నీటి కోసం
# 20 టీఎంసీల గోదావరి జలాలు

### డిసెంబర్ 1 వరకు టెండర్ల ప్రక్రియకు కార్యచారణ

### కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు : సీఎం రేవంత్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23, (వెలుతురు):
తెలంగాణ కోర్ అర్బన్ రీజన్ హైదరాబాద్ ప్రజల తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలించడానికి సంబంధించి సమగ్రమైన నివేదిక తయారు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి డిసెంబర్ నెల 1 వ తేదీ వరకు టెండర్ల ప్రక్రియకు



కార్యాచరణను రూపొందించాలని సీఎం చెప్పారు.జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 20 టీఎంసీల గోదావరి జలాలను తరలింపు అంశంపై జూబ్లీహిల్స్ నివాసంలో శని వారం ముఖ్యమంత్రి నీటి పారుదల శాఖ, జలమండలి అధికారుల సమావేశంలో సమీక్షించారు.

హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి తరలింపు ప్రణాళికలపై నివేదిక తయారు చేయాలని సూచించారు. నీటి లభ్యత, ఏ ప్రాజెక్టు నుంచి ఎంతమేరకు నీటిని తరలించాలి, ఎంత ఖర్చవుతుందన్న విషయాలపై పూర్తి అధ్యయనం జరగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

ఈ విషయంలో మిషన్ భగీరథ అధికారులతో కూడా సమన్వయం చేసుకోవాలని సీఎం సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.






# గంభీరావుపేటలో అభివృద్ధి పనులు ప్రారంభం

మొదటిపేజీ తరువాయి..

నుండి కోరుట్లపేట వరకు రూ.15 కోట్ల వ్యయంతో రోడ్డును నిర్మించాం. అట్లాగే గంభీరావు పేట నుండి మల్లారెడ్డిపేట వరకు రూ.8.30 కోట్ల వ్యయంతో నూతనంగా బ్రిడ్జిని నిర్మించాం. ఈరోజు వాటిని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉంది.



గతంలోనూ కేంద్ర ప్రభుత్వం సిరిసిల్ల నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నో నిధులిచ్చింది. అయితే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం తమ సొమ్ముగా ప్రచారం చేసుకున్నాయి. రాజకీయ వైషమ్యాలతో గత ప్రభుత్వం కుట్రలు చేసింది.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బీఆర్ఎస్ తోవలో



నడుస్తోంది. రాజకీయ వైషమ్యాలు సృష్టించి అభివృద్ధి జరగకుండా చేస్తోంది. కేంద్రంతో వైరం పెట్టుకుంటోంది. పేరు ప్రఖ్యాతుల కోసం మొండి పట్టుకు పోయి షో పొలిటిక్స్ చేస్తోంది. ఇది మంచి పద్దతి కాదు. మితిమీరి విమర్శలు చేసి తెలంగాణ ప్రజలకు అన్యాయం చేయొద్దని కోరుతున్నా.

తెలంగాణ సొమ్మును ఇతర రాష్ట్రాల ఎన్నికల కోసం ఖర్చు పెట్టడం ఏ మాత్రం మంచి పద్దతి కాదు. గతంలో కేసీఆర్ తెలంగాణ డబ్బును పంజాబ్, కర్నాటక రాష్ట్రాల్లో ఖర్చు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం సైతం తెలంగాణ సొమ్మును మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేసింది. ఇక్కడ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మొండి చేయి చూపింది.

మహారాష్ట్ర ప్రజలు వాస్తవాలు గమనించారు. కాంగ్రెస్ ను ఓడించి బీజేపీకి పట్టం కట్టారు. అక్కడ వార్ వన్ సైడ్ అయ్యింది. జార్ఖండ్ లో టఫ్ ఫైట్ నడుస్తోంది. ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ బీజేపీ మెజారిటీ సీట్లు సాధించింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆమోదం తెలిపారు. ప్రతి ఒక్క పార్టీ రాజకీయ వైషమ్యాలను పక్కనపెట్టి తెలంగాణ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నా..

# తెలంగాణలో ప్రజా తిరుగుబాటు రాబోతోంది

మొదటిపేజీ తరువాయి..

### ఈసారి 120 దాటబోతున్నయ్.

కాంగ్రెస్ పార్టీకి గతం కంటే తక్కువ సీట్లు వచ్చినయ్. కాంగ్రెస్ కూటమి అడ్రస్ గల్లంతైంది. ఎన్ని అబద్దపు ప్రచారాలు చేసినా జనం నమ్మలేదు. నరేంద్రమోదీ అభివృద్ధి మంత్రం పనిచేసింది. ఒకసారి అధికారంలోకి వచ్చాక రెండోసారి మళ్లీ రావాలంటే మెజారిటీ తగ్గడం చూశాం. కానీ మహారాష్ట్రలో గతంకంటే ఎక్కువ మెజారిటీ సీట్లు ఎన్డీఏ కూటమికి వచ్చాయి. కాంగ్రెస్ పార్టీ ఓట్లను చీల్చేందుకు ఎన్ని కుట్రలు చేసినా జనం నమ్మలేదు. మహారాష్ట్ర ప్రజలు ఐక్యత ప్రదర్శించారు. హిందుత్వవైపు నిలబడ్డారు.

తెలంగాణ నుండి కాంగ్రెస్ పార్టీ డబ్బు సంచులు తీసుకెళ్లి మహారాష్ట్ర ఎన్నికల్లో ఖర్చు చేశారు. అబద్దాలు, డబ్బుతో గెలవాలని చూశారు. కానీ అవేమీ పని చేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ, కర్నాటక ప్రభుత్వాల వైఫల్యాలే మహారాష్ట్రలో కాంగ్రెస్ కూటమి ఓటమికి ప్రధాన కారణం. ఆయా రాష్ట్రాల్లో ఒక్క హామీని అమలు చేయకుండానే అన్నీ చేసినట్లుగా కోట్లాది రూపాయల యాడ్స్ ఇచ్చి అబద్దపు ప్రచారం చేయాలని చూసినా జనం నమ్మలేదు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు మహారాష్ట్రలో తిష్టవేసి పోలింగ్ బూత్ ల వారీగా ప్రచారం చేసినా పట్టించుకోలేదు. వాస్తవాలు గ్రహించి కాంగ్రెస్ కూటమిని చావు దెబ్బ కొట్టారు.

### మహారాష్ట్ర ప్రజలకు హ్యాట్సాఫ్...

కాంగ్రెస్ ఐరన్ లెగ్ పార్టీ. ఆ పార్టీతో జతకట్టిన పార్టీలన్నీ నిండా మునిగిపోతున్నయ్. కాంగ్రెస్ కూటమి చీలడం ఖాయం. కూలిపోవడం తథ్యం. ఎందుకంటే ఐరన్ లెగ్ పార్టీతో ఎవరూ ఉండే అవకాశం లేదు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా మహారాష్ట్రలో పట్టిన గతే పడుతుంది. ఎందుకంటే ఒక్క హామీలను అమలు చేయలేదు.

ఇప్పటికైనా ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలే. మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500 లు ఎప్పుడు ఇస్తారో సమాధానం చెప్పాలి. రైతులకు ఇచ్చిన హామీలను ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలే. లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడం తథ్యం. ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పడం ఖాయం..

తెలంగాణ ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడానికి పైసల్లేవని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ ఇక్కడ సొమ్మును తీసుకుపోయి మహారాష్ట్రలో ఖర్చు చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్దం ప్రకటించబోతున్నాం. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజా తిరుగుబాటు రాబోతోంది. హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రజలు ఇప్పటికే ఎమ్మెల్యేలను నిలదీస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రస్తుతం గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఒక్క పని కావడం లేదని ఎమ్మెల్యేలు కూడా అసంతృప్తితో ఉన్నారు. అందుకే ఆ పార్టీలో లుకలుకలు రాబోతున్నాయ్. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మేం కూల్చబోం. మాకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆ అవకాశం కూడా ఇవ్వరు. ఆ అవసరం కూడా మాకు లేదు.

### కాంగ్రెస్ ఎమ్మెల్యేలే వాళ్ల ప్రభుత్వాన్ని కూల్చేస్తారు.

కులగణన పెద్ద బోగస్. కులగణన ఫారంలపై పెన్సిల్ తో రాస్తున్నారు. పెన్నుతో సంతకం తీసుకుంటున్నారు. ఎందుకంటే పెన్సల్ తో రాస్తే... తరువాత కాంగ్రెస్ పార్టీ తనకు అనుగుణంగా మార్పు చేసుకోవాలనుకుంటోంది. అందుకే ప్రజలు సహకరించడం లేదు. చాలాచోట్ల నిలదీస్తున్నారు.

నేనడుగుతున్న కేసీఆర్ సర్కార్ సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించింది కదా. ఆ రిపోర్ట్ బయటపెట్టాలి. ఆ రిపోర్ట్ లేకపోతే.. దానికైన సొమ్మంతా కేసీఆర్ నుండి రికవరీ చేయాలి. ఈవీఎంలపై ఆరోపణలు చేయడం సిగ్గు చేటు. ఈవీఎంలు మా చేతుల్లో ఉంటే జార్ఖండ్ లో బీజేపీ గెలిచేది కదా... గతంలో తెలంగాణ, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఎట్లా గెలిచింది? ఇలాంటి ఆరోపణలను జనం నమ్మరు. వాటిని పట్టించుకోవాల్సిన అవసరం కూడా లేదు.

## టీజీఎస్ఆర్టీసీ పనితీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి..
ప్రతి ఒక్క సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఈ పథకంలో భాగంగా ఈ నెల 20 వరకు 111 కోట్ల జీరో టికెట్లకు సంస్థ జారీ చేసిందని, ఫలితంగా రూ.3747 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని ఆయన తెలిపారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన టికెట్ల రీయింబర్స్‌మెంట్‌ను ఆర్టీసీకి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని వివరించారు.

మహాలక్ష్మి పథకం వల్ల గతంలో నష్టాల్లో ఉన్న ఆర్టీసీ లాభాల్లోకి వెళ్లిందని, రాష్ట్ర ప్రజా రవాణా వ్యవస్థకు ఇది శుభసూచకమని అన్నారు. ఈ పథకం అమలుకు ముందు 69 శాతంగా ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) ప్రస్తుతం 94 శాతానికి పెరిగిందని గుర్తు చేశారు. మొత్తం ప్రయాణికుల్లో 65.56 శాతం మహిళలే ఉంటున్నారని వివరించారు. ఈ పథకాన్ని వినియోగించుకుంటోన్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోందని, రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు ప్రణాళికను రూపొందించుకోవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 1389 కొత్త బస్సులను ఆర్టీసీ కొనుగోలు చేసిందని మంత్రి ప్రభాకర్ తెలిపారు. మొదటి విడతలో మహబూబ్‌నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మహిళా స్వయం సహాయక బృందాలకు అద్దె బస్సులను అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మండల సమాఖ్యకు ఒక్కటి చొప్పున అద్దె బస్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని బస్ స్టేషన్లను ఆధునీకరించాలని సూచించారు. ఇటీవల ప్రారంభించిన కార్గో హెూం డెలివరీని సదుపాయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు .

మరణించిన, మెడికల్ అన్‌ఫిట్ అయిన సిబ్బంది జీవిత భాగస్వాములకు, పిల్లలకు ఇచ్చే కారుణ్య ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్పతో పాటు హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

# రెండు రాష్ట్రాల్లోనూ అధికారం యధాతథం

మొదటిపేజీ తరువాయి..
సౌత్ వెస్ట్‌లో భాజపా అభ్యర్థి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఆధిక్యంలో ఉన్నారు. బారామతిలో ఎన్సీపీ అభ్యర్థి అజిత్ పవార్ ముందంజలో కొనసాగుతున్నారు. వర్లీలో శివసేన (యూబీటీ) అభ్యర్థి ఆదిత్య ఠాక్రే ఆధిక్యంలో ఉన్నారు. కోప్రిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే ముందంజలో కొనసాగుతున్నారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల సరళి ప్రకారం.. మహారాష్ట్రలో మహాయుతి కూటమి ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లను దక్కించుకుని భారీ మెజార్టీ దిశగా సాగుతోంది. ప్రస్తుతం ఈ కూటమి 153 స్థానాల్లో గెలిచి, మరో 75 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. అటు ప్రతిపక్ష మహావికాస్ అఘాడీ కూటమి 30 స్థానాల్లో విజయం సాధించి, 24 స్థానాల్లో ముందంజలో ఉంది. మహారాష్ట్రలో మొత్తం 288 శాసనసభ స్థానాలుండగా.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు 145 ఎమ్మెల్యేలు అవసరం. ఝార్ఖండ్‌లో జేఎంఎం కూటమి 32 స్థానాల్లో విజయం సాధించి మరో 24 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతోంది. అటు భాజపా నేతృత్వంలోని కూటమి 16 స్థానాల్లో గెలిచి, 8 స్థానాల్లో ముందంజలో ఉంది. ఈ రాష్ట్రంలో మొత్తం 81 అసెంబ్లీ స్థానాలుండగా.. మ్యాజిక్ ఫిగర్ 41.బర్‌హైత్‌లో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ ఆధిక్యంలో కొనసాగుతున్నారు. గండేలో ఆయన భార్య కల్పనా సోరెన్ ముందంజలో ఉన్నారు. జార్ఖండ్ ఎన్నికల తుది ఫలితాలు రాత్రికి తర్వాత వెల్లడి కానున్నాయి. అయితే ఎన్నికల కమిషన్ ట్రెండ్స్ ప్రకారం జార్ఖండ్‌లో భారత కూటమి మెజారిటీ సాధిస్తుందని తెలుస్తోంది. ట్రెండ్స్ ప్రకారం జార్ఖండ్‌లో మరోసారి హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఏర్పాటు కానుంది. తాజా సమాచారం ప్రకారం జార్ఖండ్‌లో ఇండియా అలయన్స్ 50 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. ఎన్డీయే 29 స్థానాల్లో ఆధిక్యంలో ఉంది. మిగిలిన 2 స్థానాల్లో ఇతరులు ఆధిక్యంలో ఉన్నారు. ఇప్పుడు పరిస్థితి చూస్తే ఈసారి కూడా జార్ఖండ్‌లో మరోసారి హేమంత్ సోరెన్ గెలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు ఓట్ల లెక్కింపు జరుగుతోంది. తొలుత పోస్టల్ బ్యాలెట్‌ను లెక్కించి, కొంత సమయం తర్వాత ఈవీఎం యంత్రాల ఓట్ల లెక్కింపు పక్రియ చేపట్టారు. మొదటి పోకడలు ఇప్పుడే ఉద్భవించడం ప్రారంభించాయి. క్రమంగా ఫలితాలపై స్పష్టత వస్తుంది. జార్ఖండ్‌లో 13 నుంచి 27 రౌండ్ల వరకు ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈసారి ఇద్దరు ముఖ్యమంత్రులు, మాజీ ఉపముఖ్యమంత్రులు ఎన్నికల పోరులో ఉన్నారు. ఒకవైపు భారత కూటమి, మరోవైపు ఎన్డీయే ఉంది. జార్ఖండ్‌లో 24 ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయానికి బ్రేక్‌పడింది. హేమంత్ సోరెన్ ట్రెండ్స్‌లో పునరాగమనం చేస్తున్నాడు. నిజానికి 24 ఏళ్ల జార్ఖండ్ చరిత్రలో ఏ పార్టీ కూడా వరుసగా రెండోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఎప్పుడూ జరగలేదు. అయితే ఈసారి మాత్రం ఆ ట్రెండ్ మారే విధంగా అనిపిస్తోంది.

కాగా ఎన్డీయే తరఫున బీజేపీ 81 స్థానాలకు గాను 68 స్థానాల్లో, ఏజేఎస్‌యూ 10 స్థానాల్లో తమ అభ్యర్థులను నిలబెట్టాయి. జేడీయూకు రెండు సీట్లు, చిరాగ్ పాశ్వాన్‌కు చెందిన ఎల్‌జేపీ-రామ్‌విలాస్‌కు ఒక సీటు ఇచ్చారు. 2019 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగా పోటీ చేసి 79 మంది అభ్యర్థులను నిలబెట్టగా, ఏజేఎస్‌యూ 53 మంది అభ్యర్థులను ప్రకటించింది.

## ప్రజలంతా ప్రధాని మోడీ వెంటే

### సిఎం ఎవరన్నది కూటమి నిర్ణయిస్తుంది

### ఫలితాలపై మాజీ సిఎం ఫడ్నవీస్ స్పందన

ముంబై,నవంబర్23(వెలుతురు):
మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అధికార 'మహాయుతి'కూటమి అద్భుత విజయం సాధించింది. ఎగ్జిట్ పోల్స్ అంచనాలను సైతం అందని రీతిలో సీట్లు సాధించి సునామీ సృష్టించింది. ఈ అఖండ విజయంపై భాజపా సీనియర్ నేత, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. ప్రజలంతా నరేంద్ర మోదీ వెంటే నిలిచారనడానికి ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. ఇలాంటి భారీ విజయం సాధించడంలో సహకరించిన మహిళలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనేక తప్పుడు ఆరోపణలు, బూటకపు కథనాలను ప్రచారం చేయడం, మతం ఆధారంగా ఓటర్లను వేరు చేయడం వంటి విపక్ష పార్టీల ప్రయత్నాలను జనం విఫలం చేశారన్నారు. తమ కూటమి విజయంపై ముంబయిలో విలేకర్లతో మాట్లాడారు. మహారాష్ట్ర ఓటర్లు, పార్టీ శ్రేణులు, నేతల మద్దతు వల్లే విపక్షాల 'చక్రవ్యూహం'ను విచ్ఛిన్నం చేయడంలో తాను విజయవంతమయ్యానన్నారు. ముఖ్యమంత్రి పదవి విషయంలో ఎలాంటి వివాదం లేదని.. తదుపరి సీఎం ఎవరనే విషయంపై 'మహాయుతి' నేతలు నిర్ణయిస్తారని ఫడణవీస్ స్పష్టం చేశారు. సీఎం ఏక్‌నాథ్ శిందే సారథ్యంలోని పార్టీనే బాలాసాహెబ్ ఠాక్రే నిజమైన శివసేన అని ప్రజలే చూపించారన్నారు. ఇది భాజపా విజయమన్న ఫడణవీస్.. ఇందులో తన పాత్ర చాలా చిన్నదేనని వ్యాఖ్యానించారు.





## జైల్లో పట్నం నరేందర్ రెడ్డిని పరామర్శించిన కేటీఆర్

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:**
చర్లపల్లి జైల్లో ఉన్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. ఆయన వెంట పలువురు బీఆర్ఎస్ నేతలు కూడా ములాఖత్లో ఉన్నారు. అలాగే జైల్లో ఉన్న లగచర్ల రైతులను కూడా ఆయన పరామర్శించారు.
కేటిఆర్ తో పాటు నరేందర్రెడ్డి భార్య, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, మహమూద్ అలీ,లక్ష్మారెడ్డిఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మల్కాజ్ గిరి పార్లమెంట్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ రాగిడి లక్ష్మారెడ్డి కూడా ఉన్నారు.

## చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను పరామర్శించిన ఎంఎల్ సి కవిత

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:**
వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో కలుషితాహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్లో చికిత్స పొందుతున్న విద్యార్థిని శైలజను శని వారం నాడు పరామర్శించిన



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత. విద్యార్థిని శైలజ ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్న కవిత అనంతరం మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు. విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## సమగ్ర కుటుంబ సర్వే వివరాలను అందించిన సీఎస్ శాంతి కుమారి

(రాపర్తి భాస్కర్ గౌడ్)

**వెలుతురు, హైదరాబాద్ బ్యూరో, నవంబర్ 23:**
సమగ్ర కుటుంబ సర్వే లో భాగంగా శనివారం నాడు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతి కుమారి తన కుటుంబ సభ్యులతో కూడిన పూర్తి వివరాలను సర్వే



అధికారులకు అందించారు.బంజారాహిల్స్ లోని సీఎస్ శాంతి కుమారి నివాసంలో సర్వే అధికారులు ఏన్యూమరేటర్ నీరజ ఆధ్వర్యంలో సర్వే ప్రక్రియ నిర్వహించగా కార్యక్రమంలో సర్కిల్ నోడల్ అధికారి సాయి శ్రీనివాస్ .జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



## టిజి ఆర్టిసి ద్వారా రూ.500కే 7పుణ్య క్షేత్రాల దర్శనం

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 23:**
చేర్యాల లక్ష్మీనరసింహ స్వామి, రత్నాలయం శ్రీ వేంకటేశ్వర స్వామి, భద్రినాథ్, విద్యా సరస్వతి శనీశ్వర ఆలయం, కొమురెల్లి మల్లికార్జున స్వామి, కొండ పోచమ్మ మరియు కీసర రామలింగేశ్వర పుణ్య క్షేత్ర దర్శనం







## రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 23:**
ఆదిలాబాద్ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలనిఆలోచనతో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యతీస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు రూపాయల 90 లక్షల వ్యయంతో జైనథ్ మండలం ఆకుర్ల గ్రామానికి మంజూరైన బీటీ రోడ్డుకు శనివారం భూమి పూజ చేశారు.
అనంతర ఆయన మాట్లాడుతూ గ్రామానికి వెళ్లే రోడ్డు ఎంత ప్రాధాన్యత ఉంటుందో ప్రతిరోజు వ్యవసాయ పనుల కోసం చేనులకు వెళ్లే రోడ్లకు కూడా అంతే ప్రాధాన్యత ఉంటుందని



ఆయన అన్నారు నియోజకవర్గంలోని వ్యవసాయ భూములకు వెళ్లేందుకు వీలుగా రూపాయలు 75 కోట్ల వ్యయంతో ప్రతిపాదన రూపొందించామని ఆయన తెలిపారు రైతులు స్వచ్ఛందంగా రోడ్ల నిర్మాణం కోసం భూములను కొంతమేరకు ఇస్తే పనులు వేగంగా పూర్తయ్య అవకాశము ఉందని ఆయన అన్నారు.
ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాందాస్. విజయ్ బోయర్. అశోక్ రెడ్డి. శంకర్. బింగి వెంకన్న ముకుందరావు. సుభాష్. దత్త. వేణు. భగవాన్లు రాజు విశాల్ రమేష్. లోలాబ్ శివ. తదితరులు పాల్గొన్నారు.

## నరేంద్ర మోడీపై నమ్మకంతో మహారాష్ట్ర ప్రజలు బిజెపికి పట్టం కట్టారు

### ఆదిలాబాద్ జిల్లా తరపున మహారాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు : ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

**ఆదిలాబాద్ వెలుతురు నవంబర్ 23:**
దేశ ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంపై, పార్టీపై నమ్మకంతో మహారాష్ట్ర ప్రజలు నేడు బిజెపి, మా కూటమి అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహా రాష్ట్రలో బిజెపి పార్టీ గెలుపు సంబరాలను ఘనంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా ఒకరికి ఒకరు మిఠాయిలు పంచు కున్నారు. సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ... తెలంగాణ ముఖ్యమంత్రి, మంత్రులు నాయకులు మహారాష్ట్ర ఎన్నికల సందర్భంగా పాల్గొన్న ప్రచార కార్యక్రమాల్లో ఆరు గ్యారెం టీలను అమలు ఇక్కడ కూడా అమలు చేస్తామని చెప్పినప్పటికీ మహారాష్ట్ర ప్రజలు నమ్మలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచార సభల్లోనే నాయకులు మాట్లాడుతున్నప్పుడే అక్కడి ప్రజలు మీరు తెలంగాణ రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు చేయలేదని ఇక్కడే అమలు చేస్తారని నిలదీసిన సందర్భాలు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ, శివసేన పార్టీ, ఎంఐఎం పార్టీ మద్దతిస్తుందని సమయం పార్టీతోనే మేము అధికారులకు వస్తామని మహారాష్ట్ర కాంగ్రెస్ పార్టీ గొప్ప కలలు కన్నారని గుర్తు చేశారు. మహారాష్ట్ర ప్రజలందరూ నరేంద్ర మోడీ నాయకత్వంలోని మనమందరం రక్షణగా ఉంటామని తెలుసుకున్నారు అన్నారు. తెలంగాణలో మోసం చేసినట్టే.. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ మోసం చేసే ప్రయత్నం నీ ప్రజలు తిప్పి కొట్టారన్నారు. తెలంగాణ బార్డర్కు



అనుకుని ఉన్న అన్ని స్థానాల్లో బిజెపి పార్టీ అభ్యర్థులే గెలుపొందారున్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీని అక్కడి ప్రజలు భూస్థాపితం చేశారని తెలిపారు. మహారాష్ట్రలో ఏ విధంగా అయితే ఫలితాలు వచ్చాయో అదే రీతిలో తెలంగాణలో సైతం ఫలితాలు వస్తాయని ధీమావిక్తం చేశారు. ప్రజలకు ఎప్పుడు అబద్ధాలతో, మభ్య పెట్టె మాయ మాటలతో రాజకీయాలు చేయొచ్చని అటువంటి పార్టీలను మహారాష్ట్ర ఎన్నికలు నిదర్శనం అన్నారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం భారతీయ జనతా పార్టీ



దే అన్నారు. ఇతర రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందని నమ్ముతున్నారు అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో సైతం ప్రజలు భారతీయ జనతా పార్టీని కోరుకుంటున్నాని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బ్రహ్మానంద్ . లాలమున్న దినేష్ మాటోలియ . ఆకుల ప్రవీణ్. జోగు రవి. కృష్ణ యాదవ్ రాజేష్ శ్రీనివాస్ రఘుపతి సుభాష్ అశోక్ రెడ్డి స్వామి రెడ్డి సుభాష్ భరత్ రవి నరేష్. తదితరులు పాల్గొన్నారు.







## చిన్న పత్రికలకు అన్యాయం చేయొద్దు

### దిన, మాస పత్రిక లకు ఏంప్యానల్ మెంట్ చేయాలి

### అక్రిడిటేషన్లను పెంచాలి

### చిన్న పత్రికల సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ బాబా

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 23:** దిన, మాస పత్రిక లకు ఏంప్యానల్ మెంట్ చేయాలి, చిన్న పత్రికలకు అక్రిడిటేషన్లు గతంలో ఉన్న మాదిరిగానే ఐ అండ్ పిఆర్ నుంచి ఖచ్చితంగా ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర చిన్న మధ్య తరహా అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ అధ్యక్షులు యూసుఫ్ బాబు డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం బషీర్ బాగ్ లోని దేశోద్ధారక భవన్ లో జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన యూసుఫ్ బాబు మాట్లాడుతూ చిన్న పత్రికల మనుగడను ప్రశ్నార్థకం చేసేలా కొందరు అధికారులు కుట్రలు పన్నుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలు తిప్పికొట్టేందుకు అందరూ సమైక్యంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేశారు. అక్రిడిటేషన్ లను అమ్ము తున్నామన్న ప్రచారం అవాస్తవం అన్నారు. అలాంటి వాళ్ళను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో రానున్న అక్రిడిటేషన్ల నూతన జీవోపై ఇప్పటినుంచి అప్రమత్తంగా ఉండా ల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే ఐ అండ్ పి ఆర్ కమిషనర్, మీడియా అకాడమీ చైర్మన్లను కలిసి అక్రిడేషన్ల, దిన, మాస పత్రిక లకు ఏంప్యానల్ మెంట్ విషయమై చర్చించాలని తెలిపారు. పాత జీవోలో ఉన్న గ్రేడింగ్ల విధానం కాకుండా నూతనంగా చిన్న పత్రికలకు న్యాయం చేసే విధంగా రావాలని ఆకాంక్షించారు. ఎందుకు అవసరమైతే పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను చేసినట్లు సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ తెలిపారు. సోమవారం సంఘం సభ్యులు పెద్ద ఎత్తున తరలివచ్చి సమస్యలపై ఐ అండ్ పి ఆర్ కమిషనర్, అధికారులను కలిసి వినతిపత్రం అందజేయాలని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, హైదరాబాద్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్నగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్ , నిజామాబాద్,కొమరం భీం తదితర జిల్లాల నుండి పత్రికల సంపాదకులు పాల్గొన్నారు.

## ప్రియాంకగాంధీ విజయం పట్ల హర్షం : బొడ్డు బిక్షపతి గౌడ్

**వెలుతురు, రంగారెడ్డి జిల్లా, నవంబర్ 23:**
రంగా రెడ్డి జిల్లా కోర్టులో రంగా రెడ్డి జిల్లా లీగల్ సెల్ న్యాయ వాదులు సమావేశం శనివారం జరిగినది. ఈ సందర్భంగా వయనాడ్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రియాంక గాంధీ భారీ మెజారిటీ తో విజయం సాధించిన నేపథ్యంలో న్యాయవాదులు సంబరాలు జరుపుకున్నారు. అలాగే ఆదివారం గాంధీ భవన్ లో వ్యాసరచన పోటీ ల విజేతలకు బహుమతి ప్రధానోత్సవం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ లీగల్ సెల్ అధ్యక్షులు పొన్నం అశోక్ గౌడ్, గారాల



చేతుల మీద జరుగుతుందని రంగారెడ్డి జిల్లా లీగల్ సెల్ ప్రెసిడెంట్ బొడ్డు భిక్షపతి గౌడ్ తెలిపారు,
ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో లీగల్ సెల్ న్యాయవాదులు హాజరు కావాలని ఆయన కోరారు,ఈ సమావేశము లో రంగా రెడ్డి జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ లు ఈసారపు సైదులు, ఎడ్ల భారత్ రెడ్డి, పగుడాల సిద్దేశ్వర్, అదనపు కన్వీనర్లు పనిదాపు ఉమాదేవి, పాలకుర్ల సుధా, కళారు అశోక్, అవనిగంటి నాగిరెడ్డి, గొరిగే పవన్ కుమార్ గౌడ్, అందూరి శ్రీనివాస్ యాదవ్, పటేటి వెంకట్రాములు, సైదిరెడ్డి, విగ్నేశ్వర్ మొదలుగు లీగల్ సెల్ న్యాయవాదులు పాలుగోన్నారు.

# సంపాదకీయం

## మూడవ ప్రపంచ యుద్ధం మొదలైందా!

ఉక్రెయిన్ యుద్ధంలో రష్యా రెడ్ లైన్‌ని అమెరికా దాటింది. రష్యా భూభాగంలోకి దీర్ఘ శ్రేణి క్షిపణి ప్రయోగించేలా ఉక్రెయిన్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. పంచాయితీని పరాకాష్టకు చేర్చింది. ఉక్రెయిన్ ఇప్పటికే ఈ తరహా క్షిపణులను రష్యా భూభాగంలోకి ప్రయోగిస్తోంది. దీనికి రష్యా స్పందన ఎలా ఉండబోతోందనేదే ఇప్పుడు ప్రశ్న. తాజా పరిణామాలతో సంక్షోభం మరింత ముదిరి యావత్ ప్రపంచాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అమెరికా.. దాని పశ్చిమ మిత్రులు తాను గీసిన గీత దాటితే అణ్వస్త్ర ప్రయోగానికి కూడా వెనకాడనని రష్యా అధినేత పుతిన్ హెచ్చరిస్తూ వస్తున్నారు. అయితే, పశ్చిమ దేశాలు ఈ హెచ్చరికలను పెడచెవిన పెడుతూ వచ్చాయి. శాంతి స్థాపనకు చిత్తశుద్ధితో ప్రయత్నించక పోగా ...ఉక్రెయిన్‌కు విచ్చలవిడిగా మిలటరీ సాయం అందిస్తూ ఉక్రెయిన్ ప్రజలను మరింతగా నిప్పుల కొలిమిలోకి తోస్తున్నాయి.

బైడెన్ సర్కారు తాజా నిర్ణయానికి స్పందనగా పుతిన్ అణ్వస్త్ర ప్రయోగానికి మార్గం సుగమం చేసేలా ఓ దస్త్రంపై సంతకం చేశారు. అణ్వాయుధాలు కలిగిన దేశం సాయంతో ఏ దేశమైనా తమపై దాడి చేస్తే.. దాన్ని సంయుక్త దాడిగానే పరిగణిస్తామని అందులో పేర్కొన్నారు. అదే సమయంలో కీవ్ దళాలు రష్యా ప్రధాన భూభాగంపై క్షిపణులతో దాడులు చేశాయి. దీనికి ప్రతీకారంగా మాస్కో దాడి చేయవచ్చనే భయంతో కీవ్‌లోని అమెరికా దౌత్య కార్యాలయాన్ని ఖాళీ చేసింది. ఈనేపథ్యంలోనే రష్యా గురువారం ఉక్రెయిన్‌పై సరికొత్త క్షిపణితో దాడి చేసింది. ఈ కొత్త బాలిస్టిక్ క్షిపణిని ఒరేష్నిక్ అని పిలుస్తున్నారు. ఇది హైపర్‌సోనిక్ మీడియం-రేంజ్ బాలిస్టిక్ మిసైల్. ధ్వని వేగం కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో ఇది ప్రయాణిస్తుంది..దీనిని అడ్డుకోవటం



దాదాపు అసాధ్యం. దీని రేంజ్ 5,000 కి.మీ. ఇది యూరప్ తో పాటు అమెరికా పశ్చిమ తీరాన్ని తాకగలదు. యునైటెడ్ స్టేట్స్, బ్రిటన్ తమ క్షిపణులతో రష్యా ప్రధాన భూభాగంపై దాడి చేయడానికి ఉక్రెయిన్‌ను అనుమతించటం ద్వారా ఈ యుద్ధం ప్రపంచ సంక్షోభానికి దారితీస్తోందన్నారు పుతిన్. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో రష్యా పొరుగునున్న యూరప్ దేశాలు అప్రమత్తమయ్యాయి. చిన్న పిల్లల ఆహార పదార్థాలు, ఔషధాలు, తాగునీటిని నిల్వ చేసుకోవాలని కొన్ని నాటో దేశాలు తమ ప్రజలకు సూచించాయి. అయితే, అమెరికా కొత్త అధ్యక్షుడు కొలువుదీరటానికి కేవలం కొన్ని వారాల ముందు బైడెన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అనుమానాలకు తావిస్తోంది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తరువాత ఉక్రెయిన్ పట్ల అమెరికా ప్రాధాన్యత తగ్గుతుంది. ఈలోగా, యుద్ధ తీవ్రతను మరింత పెంచి రష్యాపై ఒత్తిడి తేవాలనేది బైడెన్ ప్రభుత్వం ప్లాన్‌లా అనిపిస్తోంది.

అయితే ప్రస్తుత పరిణామాలు యుద్ధాన్ని ఎటువైపు తీసుకువెళతాయో ఎవరూ చెప్పలేరు. కొందరైతే, ఇప్పటికే మూడవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైందని అంటున్నారు. ప్రపంచం వాస్తవానికి మూడవ ప్రపంచ యుద్ధంలోకి అడుగుపెట్టిందని ఉక్రెయిన్ మిలటరీ మాజీ చీఫ్, బ్రిటన్ రాయబారి వలేరీ జులుజ్నీ ప్రకటించారు. రష్యా ఉత్తర కొరియా దళాలను, ఇరాన్ ఆయుధాల వినియోగాన్ని జులుజ్ని ప్రత్యేకంగా ప్రస్తావించారాయన. ఉక్రెయిన్ యుద్ధం దాని ప్రాంతీయ సరిహద్దులను దాటిందని చెప్పారు. ఇక తన భద్రతకు నాటో నుంచి ముప్పు ఏర్పడినపుడు రష్యా అణ్వాయుధాను ఆశ్రయించటం అనివార్యం అవుతుంది. అమెరికా, పశ్చిమ దేశాలు పుతిన్ ను ఆ దిశగా నడిపిస్తున్నాయి. ఇప్పటికే రష్యా అణుదాడులకు సంసిద్ధమవుతోంది. అయితే ఇప్పటికిప్పుడు పుతిన్ అణు మీట నొక్కుతాడని అనుకోలేము. రాబోవు రోజులలో ఉక్రెయిన్ దాడుల తీవ్రత, జరిగే నష్టంపై రష్యా స్పందన ఆధారపడి ఉంటుంది. ఏదేమైనా... ఈ యుద్ధంలో ఉక్రెయిన్‌కు తీవ్ర నష్టం మాత్రం తప్పదు. అమెరికాతో శతృత్వం ప్రమాదకరం... కానీ అమెరికాతో స్నేహం ప్రాణాంతకం.. అని అమెరికా మాజీ విదేశాంగ మంత్రి హెన్రీ కిస్సింజర్ అన్న మాటలు ఈ సందర్భంగా గుర్తుకువస్తున్నాయి!!

## కర్నూలులో హైకోర్ట్ బెంచ్..

### రాయలసీమకు ఏమిటి ప్రయోజనం ఏమిటి?

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు పక్రియ మొదలైంది. ఈ బెంచ్ ఏర్పాటుకు కేంద్రానికి సిఫారసు చేస్తూ నవంబర్ 20న ఏపీ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సీఎం కార్యాలయం నుంచి హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌కు న్యాయశాఖ కార్యదర్శి వి. సునీత లేఖ రాశారు. రాయల సీమలోని కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు ఉమ్మడి జిల్లాల నుంచి హైకోర్టులో దాఖలైన కేసులు వివరాలు ఇవ్వాలని న్యాయశాఖ కార్యదర్శి ఆ లేఖలో కోరారు.

హైకోర్టు భారతదేశంలోని ఆయా రాష్ట్రాలకు సంబంధించిన అత్యున్నత న్యాయస్థానం. ప్రతి రాష్ట్రానికీ, కేంద్ర పాలిత ప్రాంతానికీ హైకోర్టు ఉంటుంది. రెండు లేక అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు కూడా ఒకే హైకోర్టు ఉండేలా పార్లమెంటులో చట్టం చేయవచ్చు. రాజ్యాంగంలోని 6వ భాగం, 5వ అధ్యాయం, 214వ నిబంధనను అనుసరించి హైకోర్టులను ఏర్పాటుచేశారు. మొత్తం భారతదేశంలో 25 హైకోర్టులు ఉన్నాయి. ఇక, హైకోర్టు బెంచ్ అంటే మెరుగైన న్యాయ నిర్వహణ కోసం విస్తరించిన శాఖ అని చెప్పుకోవచ్చు. హైకోర్టుకు మరొక ప్రాంతంలో ఏర్పాటు చేసిన విభాగం లేదా శాఖనే ఆ హైకోర్టుకి సంబంధించిన 'బెంచ్' అని పిలుస్తారు. ఒక హైకోర్టు బెంచ్‌ను స్థాపించాలంటే ఆ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, రాష్ట్ర గవర్నర్ సమ్మతితో బెంచ్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తుంది. ఈ ప్రతిపాదన తప్పనిసరిగా జస్వంత్ సింగ్ కమిషన్ సిఫార్సు చేసిన విస్తృత మార్గదర్శకాలు, ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. అప్పుడు భారత ప్రభుత్వం ఆ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకుంటుంది. దానికి రాష్ట్ర ప్రభుత్వమే అవసరమైన మౌలిక సదుపాయాలను అందించడంతో పాటు హైకోర్టు బెంచ్ ఏర్పాటు ఖర్చులను భరించాలి. హైకోర్టు బెంచ్ పరిపాలన బాధ్యతను ఆ హైకోర్ట్ ప్రధాన న్యాయమూర్తే వహిస్తారు. హైకోర్టు ప్రధాన కార్యలయం నుంచి న్యాయమూర్తులను నియమించవచ్చు.

కర్నూలును న్యాయరాజధానిగా చేస్తామని నాటి వైసీపీ ప్రభుత్వం ప్రకటించింది. హైకోర్టుని కర్నూలుకి తరలిస్తామని చెప్పింది. అయితే ఐదేళ్లలో ఆ హామీని నెరవేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన హామీ మేరకు కర్నూలులో హైకోర్టు బెంచ్ ను ఏర్పాటు చేసేందుకు అడుగులు వేస్తోంది. అసలు హైకోర్టు బెంచ్ వలన కలిగే ప్రయోజనాలు ఏమిటి అంటే...1) న్యాయ సేవలను పొందేందుకు ప్రయాణించాల్సిన దూరం తగ్గుతుంది. హైకోర్టు బెంచ్ స్థానికంగా ఉండటం వలన, ప్రజలు తమ న్యాయసమస్యలను పరిష్కరించుకోవడం కోసం రాజధాని వరకు ప్రయాణించాల్సిన అవసరం ఉండదు. ఇది న్యాయ సౌకర్యాలను అందుబాటులోకి తెస్తుంది. ఉదాహరణకు అనంతపురంలోని ఒక వ్యక్తి కేసు నిమిత్తం అమరావతిలోని హైకోర్టుకి రావాలంటే 450 కిలోమీటర్ల మేర ప్రయాణించాల్సి ఉంటుంది. దీనికి చాలా సమయం, డబ్బు ఖర్చవుతుంది. అదే కర్నూలు బెంచ్ కి వెళ్లాలంటే 150 కిలోమీటర్ల ప్రయాణంతో సరిపోతుంది.

2) స్థానిక చట్ట పరిరక్షణ మెరుగవుతుంది. స్థానికంగా హైకోర్టు బెంచ్ ఉండటం వలన చట్టపరమైన సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయి. ఆర్థిక, వాణిజ్య అవకాశాలు పెరుగుతాయి. హైకోర్టు బెంచ్ ఆ ప్రాంతంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, మరియు ఇతర సహాయక సిబ్బందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తుంది. ఇది స్థానికంగా ఆర్థిక వృద్ధికి తోడ్పడుతుంది.

3) దీని ద్వారా మౌలిక సదుపాయాలు మెరుగవుతాయి. హైకోర్టు బెంచ్ ఒక ప్రాంతంలో ఏర్పాటవ్వడం వలన కొత్త కార్యాలయాలు, మౌలిక సదుపాయాలు, రోడ్లు, ఇతర వసతులు అభివృద్ధి చెందుతాయి.

ఒకసారి గతంలోకి వెళితే.. 1953, అక్టోబరు1 నుండి 1956,అక్టోబర్ 31 వరకు ఆంధ్ర రాష్ట్ర రాజధాని కర్నూలు. మళ్లీ వైసీపీ ప్రభుత్వ విధానమైన మూడు రాజధానుల్లో భాగంగా 2019లో కర్నూలుని న్యాయ రాజధానిగా ప్రకటించారు. ఇప్పుడు ఇక్కడ హైకోర్ట్ బెంచ్ ఏర్పాటు చేస్తోంది ప్రస్తుత ప్రభుత్వం. 1953 నుంచి 1956 వరకు గుంటూరులో హైకోర్టు ఉండేది. ఆంధ్ర, తెలంగాణలు కలవడంతో 1956లో హైకోర్టు హైదరాబాద్‌కు తరలించారు. రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి హైకోర్టు విభజన జరిగి అమరావతి కేంద్రంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు 2019జనవరి 1 నుంచి 14 మంది న్యాయమూర్తులతో పనిచేయడం ప్రారంభించింది. 1956 నుంచి 2014 మధ్యలో తమ ప్రాంతంలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలంటూ రాయలసీమ, ఉత్తరాంధ్ర, గుంటూరుల్లో డిమాండ్లు వినిపించేవి. కానీ అవి ఎప్పటికప్పుడు బలహీనపడుతూనే ఉండేవి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం ఆంధప్రదేశ్‌లో మూడు రాజధానులు ఏర్పాటు చేయాలని 2019 డిసెంబరులో నిర్ణయం తీసుకుంది.. కర్నూలును న్యాయ రాజధానిగా ఏర్పాటు చేస్తామని చట్టం చేసింది. దానికి అనుగుణంగా కర్నూలులో ఏపీ హైకోర్టుతో పాటుగా వివిధ న్యాయ సంబంధిత కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపింది.

కానీ, ఇప్పుడు రాయలసీమ ప్రాంతానికి హైకోర్టు బెంచ్ ను ఏర్పాటు చేస్తామని చెప్పిన టీడీపీ ప్రభుత్వం దానికి సంబంధించిన పనుల పక్రియను ప్రారంభించింది. అందులో భాగంగా ఏపీ న్యాయశాఖ...హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్‌కు లేఖ రాసింది.

## బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో అభివృద్ధిపై శ్వేత పత్రం విడుదల చేయగలరా..

### బర్రెలు, గొర్రెలు, పందుల సంక్షేమం ఎట్లా అభివృద్ధి అయితది.....?

భారతదేశమును సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యాంగంగా నిర్మిం చుకోవడానికి ఈ పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక రాజకీయ న్యాయాన్ని, ఆలోచన, భావప్రకటన, విశ్వాసం, ధర్మం ఆరాధనలలో స్వాతంత్ర్యాన్ని అంతస్తుల్లోను, అవకాశాల్లోను సమానత్వాన్ని చేకూర్చుటకు వారందరిలో వ్యక్తి గౌరవాన్ని జాతీ య సమైకృతను సంరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించటానికి 1949 నవంబర్ 20వ తేదిన మన రాజ్యాంగ పరిషత్లో ఎంపిక చేసుకొని శాసనంగా రూపొందించుకున్న ఈ రాజ్యాం గాన్ని మాకు మేమే ఇచ్చుకున్నాం అని మన రాజ్యాంగ పీఠికలో చెప్పుకున్నాము. 1949నవంబర్ 26వ తేదిన రాజ్యాంగాన్ని భారత. పార్లమెంట్ ఆమోదిస్తే, 1950 జనవరి 26న మన రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. ప్రజలు పాల కులు రాజ్యాంగానికి లోబడే నడుచుకోవాల్సి ఉంటుందని తీర్మా నించింది. మరి ఎంతమంది ఎమ్మెల్యేలు, ఎంపీలు మంత్రులు ఈ పీఠిక గురించి తెలుసుకొని పాలిస్తున్నారు. ఎన్నికల ముందు పార్టీల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను నెరవేర్చలేదు. ఇచ్చిన వాగ్దానాలు కూడా నెరవేర్చలేదు.

నా..... అతి గతి లేదు.

ఇక అసలు విషయానికి వద్దాం:

ప్రత్యేకంగా తెలంగాణ రాష్ట్రం విషయాలను చూసుకుంటే కొత్త రాష్ట్రం వస్తే సబ్బండవర్గాల బతుకులు ఏమో బాగుపడతాయి అనుకుంటే సామాజిక న్యాయం జరుగు తుందని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ సమయంలో చెప్తుండేవారు. తెలంగాణ వచ్చి పదేండ్లయింది. గత పాలకులు కేసీఆర్ కుటుంబం తప్ప ఎవ్వరూ బాగుపడలేదు. బడుగుల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదు అనేది నగ్నసత్యం.

ప్రత్యేక రాష్ట్ర తెలంగాణ కోసం నిరంతరం పోరాటం చేస్తున్న తెలంగాణలో బడుగు బలహీన వర్గాల కోసమే అంటూ కేసిఆర్. అనేక సందర్భాలలో మాట్లాడారు కానీ ఆయన గారి సుపుత్రుడు కేటీఆర్ గత మూడు నెలలుగా బీసీల పట్ల తమ పార్టీ ఎంతోఅభివృద్ధిలోతీసుకుపోయామంటూ బీసీల పట్ల ముసలి కన్నీరు కారుస్తున్నారు. ఇక తెలంగాణ రాష్ట్రం బి ఆర్ ఎస్ పార్టీ. ఏలిన 10. సం. లో మ్యానిఫెస్టో ప్రకారం ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయలు మేనిఫెస్టోలో కేటాయిస్తానని శుద్ధ ప్రవచనాలు పలికి నా గత టిఆర్ఎస్




పాలనలో ఇచ్చిన బడ్జెట్ ప్రకారం దాదాపు 50 వేల కోట్ల రూపాయలు ఇవ్వాల్సిం ఉంటే వీరిచ్చిన బడ్జెట్ శేష పత్రం విడుదల చేయగలరా గత వారం రోజులుగా బీసీల పట్ల రోజు ముసలికన్నీరుకారుస్తావున్నారు."తెలంగాణలో 91 శాతం మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు ఉన్నారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే తెలంగాణను బడుగుల రాష్ట్రంగా ప్రకటించి, ఈ కులాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం" అని ఉద్యమం టైమ్లో సీఎం కేసీఆర్ ప్రతి బహిరంగ సభలో చెప్పే వారు. కానీ రాష్ట్రం ఏర్పడి, టీఆర్ఎస్ సర్కారు పవర్లోకి వచ్చి10 సంవత్సరాలు ఏలి బీసీ కులాల అభివృద్ధికి ఎలాంటి కొత్త స్కీములు పెట్టలేదు.

ఉన్న స్కీములను సక్కగ అమలు చేయట్లేదు.అడుగడుగునా ఈ కులాలను కుట్ర పూరితంగా దెబ్బతీశారు. విద్య, ఉద్యోగ, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ఈ కులాల్ని అడుగడుగునా అనిచివేశారన్నది నగ్నసత్యం. ఒక ప్రక్కన పంచాయతీరాజ్ సంస్థలోబీసీరిజర్వేషన్లు 34 నుంచి 22 శాతం తగ్గించి బీసీలనా యకత్వాన్ని ఎదగకుండా దెబ్బ తీశారు. నిజానికి బిఆర్ఎస్ సర్కార్ సుప్రీంకోర్టులో బీసీల కేసు వాదించ కుండా వాపస్ తీస్కొని బీసీలకు అన్యాయం చేసింది. సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపి బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 శాతానికి తగ్గించింది. అదీగాక ఇంకేవేవో తప్పుడు లెక్కలు చూపి కేవలం 18 శాతం రిజర్వేషన్లు అమలు చేశారు. మొత్తం గ్రామపంచాయ తీలు 12751 కాగా 56శాతం జనాభా ఉన్న బీసీలకు 6822 గ్రామ పంచాయతీలు దక్కాలి. గతంలో లెక్క 34 శాతం రిజర్వేషన్లు ఇస్తే 4300 పంచాయతీలో బీసీలకు దక్కాలి. కానీ 2332 మాత్రమే కేటాయించింద్రు . అంటే 18 శాతం మాత్రమే దక్కాయి. దీంతో రెండు వేల గ్రామ సర్పంచులు. 23వేల వార్డు మెంబర్లు బీసీలకు దక్కాల్సినవి దక్కకుండా పోయాయి. అట్లనే జడ్పీటీసీ, ఎంపీటీసీ, జిల్లా పరిషత్ చైర్మన్, మండల్ పరిషత్ చైర్మన్ పదవుల్ల కూడా బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 22 తగ్గించి బీసీల నాయకత్వాన్ని ఉద్దేశపూర్వకంగా అణచివేశారు.

### చదువుకుంటే చైతన్యమొస్తదని..

ఇక ఎంబీబీఎస్ అడ్మిషన్లలో కూడా 20 ఏండ్లుగా పాటిస్తున్నజీవో 550 ప్రకారం ఎస్సీ,ఎస్టీ. బీసీ రిజర్వే షన్లు అమలు చేయకుండా ఈ కులాలకు అన్యాయం చేస్తోంది. ఉమ్మడి ఏపీలో బీసీల సంక్షేమానికి ఏటా 3.5% బడ్జెట్ కేటాయించేవారు. టీఆర్ఎస్ సర్కారు దాన్ని 1.8శాతానికి తగ్గించింది. బీసీ స్టడీ సర్కిల్ బడ్జె టన్ను రూ.50కోట్లనుంచి రూ.10కోట్లకు తగ్గించింది. ఇంజినీరింగ్ మెడిసిన్, ఫార్మసీ, పీజీ కోర్సులు చదివే బీసీ స్టూడెంట్లకు ఫీజు రీయింబర్స్మెంట్ స్కీమ్ను సక్కగ అమలు చేస్తలేదు. ఎస్సీ, ఎస్టీలకు ఫుల్ ఫీజులు కేంద్ర ప్రభుత్వం ఇస్తోంది. మైనారిటీలకు పూర్తి ఫీజును రాష్ట్ర ప్రభుత్వం ఇస్తోంది. మైనార్టీలకు ఇచ్చి బీసీలకు ఇవ్వకపోవడం అన్యాయం కాదా! బీసీల్లో అత్యంత వెనకబడిన కులాలు, సంచార జాతులు, భిక్షాటన చేసే కులాలు ఉన్నవి. ఈ కులాల స్టూడెంట్లు ఫీజులు కట్టే ఆర్థిక స్తోమత లేక చదువు మానుకుంటు న్నారు. ఓటుబ్యాంకు రాజకీయాలతో కొన్నివర్గాలకు ఇచ్చి... కొన్ని కులాలకు ఇవ్వడం లేదు. కిందటేడాది ఫీజుల బకాయిలను 800కోట్ల రూపాయలు చెల్లిస్తలేదు. ఈ ఏడాది రూ.2200కోట్లు విడుదల చేయలేదు. దీంతో కాలేజీలు పిల్లల్ని క్లాసులకు రానిస్తలేవు. సర్టిఫి కెట్లు ఇస్తలేవు. అట్లనే బీసీల విద్య, ఉద్యోగ, రిజర్వేషన్ల పై శ్రీమిలేయర్ విధించొద్దని బీసీ కులాలు ఎంత మొ త్తుకున్నా. గత టీఆర్ఎస్ సర్కారు బీసీలపై కసిదీరా క్రిమిలేయర్ విధించి అన్యాయం చేసింది. ఉన్నత చదువులు చదువుకుంటే పేద కులాల్లో చైతన్యం వచ్చి రాజ్యాధికారం కోసం పోరాడుతారని మొన్నటి ఈ దొర ప్రభుత్వం కుట్ర చేసింది.

### 210 తీర్మానాలు ఎటు పోయినయో..

బీసీల అభివృద్ధికి ప్రత్యేక పాలసీ తీసుకురావడానికి సీఎం కేసీఆర్ బీసీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో 2017 డిసెంబర్లో 3 రోజులు చర్చించి 210 తీర్మానాలు ఆమోదించిన్రు. బీసీల



బ్రతుకులలో విప్లవాత్మకమైన అభివృద్ధి కోసం ఈ మీటింగ్ చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని వీటిని ఉన్నదున్నట్లు అమలు చేస్తామని ప్రకటించారు. 10. సం. లో పాలనలో కేసీఆర్ ఆ తీర్మానాల ఊసే ఎత్తలేదు ఇప్పుడెందుకు ముసలి కన్నీరు బీసీల పట్ల ఇక మీ పాలలో చెత్తబుట్టలో 8.7లక్షల బీసీ లోన్ దరఖాస్తులు.

బీసీల సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ కోసం 1974 లోనే బీసీ కార్పొరేషన్, 2007-2008లో 12 బీసీ కులాల ఫెడ రేషన్ ఏర్పాటు చేశారు. వీటి ద్వారా ఇప్పటి దాక ఉన్న ప్రభుత్వాలు 40లక్షల మందికి సబ్సిడీ లోన్లు, మార్జిన్ మనీ లోన్లు ఇచ్చాయి. తెలంగాణ ఏర్పడ్డ నుంచి ఈ సంస్థ ద్వారా రెండే రెండు సార్లు బీసీల నుంచి దరఖాస్తులు తీసుకును. 2015లో 2 లక్షల 93 వేల మంది, 2017-18లో 5 లక్షల 77 వేల మంది దరఖాస్తు పెట్టుకున్రు. వీళ్ల లోన్ల కోసం రూ. 10 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తమని అప్పటి బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రకటించారు. కానీ ఎలక్షన్లు కాంగనే ఈ దరఖాస్తులన్ని చెత్తబుట్టలో పడేసిను ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు కేటాయించి ఖర్చుపెట్టకుండా మిగిలిపోయిన పీడీ అకౌంట్లోని రూ.400 కోట్లు వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన్రు. టీఆర్ఎస్ సర్కారు అధికారంలోకి రాగానే బీసీల ఖర్చుపెట్టాల్సిన ఆ డబ్బును మిషన్ భగీరథ కాంట్రాక్టర్లకు ధారాదత్తం చేసింది.

గత పది సంవత్సరాలుగా బిఆర్ఎస్ పాలల్లో స్వీయ చరిత్ర.

### వెనుకబడిన' సంక్షేమం

గతప్రభుత్వంలో రాజకీయంగా పదవులను అనుభవించిన పెద్దలారా బీసీలు బిచ్చగాళ్ళు అన్న మాటలు అనాల్సిన సందర్భం సమయం ఏర్పడింది. అంటే, బీసీల పరస్థితి మన రాష్ట్రంలో అర్థం చేసుకోవచ్చు. 76 సంవత్సరాల స్వతంత్ర భారతదేశం అభివృద్ధి పథంలో ప్రయాణిస్తున్నదని త్వరలోనే అభివృద్ధి చెందిన దేశంగా మారనుందంటూ అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్రం గొప్ప అభివృద్ధి సాధించిందని కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకుంటున్నాయి. కానీ ఈ మధ్య రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు చెప్పినట్లు 2029 నాటికి ప్రపంచంలో భారతదేశం ఐదు ట్రిలియన్ డాలర్లతో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినప్పటికీ సంబర పడవలసిన అవసరం లేదు. ఎందుకంటే మన దేశం ఇంకా పేద దేశంగానే మిగలవచ్చు అని అభిప్రాయపడ్డారు. ఇది దేశవ్యాప్తంగా ఉన్న అంశం. ప్రత్యేకంగా తెలంగాణ విషయాలను చూసుకుంటే కొత్త రాష్ట్రం వస్తే సబ్బండవర్గాల బతుకులు ఏమో బాగుపడతాయి అనుకుంటే సామాజిక న్యాయం జరుగుతుందని తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఉద్యమ సమయంలో చెప్తుండేవారు. తెలంగాణ వచ్చి పదేండ్లయింది. గత పాలకులు కేసీఆర్ కుటుంబం తప్ప ఎవ్వరూ బాగుపడలేదు. బడుగుల జీవితాల్లో ఎటువంటి మార్పు రాలేదు. బి అది పడుకుందామా ఆర్ఎస్ ప్రభుత్వం కొంతమంది రాజకీయ నాయకులు కుల సంఘాల నాయకులని ఆయన భయానా ఇచ్చి బానిసగా మార్చుకోవడంలో ముందంజలో ఉన్నారు అనేది నగ్నసత్యం.

గత 10 సంవత్సరాలలో రాజకీయాలు రోజు రోజుకూ అప్రజాస్వామికంగా తయారయ్యింది. అందుకే ఇటీవల జరిగిన ఎన్నికల్లో బీఆర్?ఎస్? పార్టీని రాజకీయంగా బీసీలు బొంద పెట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం జనాభాలో 56 శాతానికిపైగా ఉన్నబీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అణచివేస్తున్న పరిస్థితి నెలకొంది. వారు బీసీల సంక్షేమానికి బడ్జెట్లో కేటాయిస్తున్న నిధులే నామమాత్రం కాగా, ఆ కేటాయించే నిధుల్లోనూ 10 శాతం కూడా ఖర్చు పెట్టడం లేదు. ఇది సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) తీసుకున్న వివరాలను నేను పంపిన దరఖాస్తులకు అధికారికంగా వచ్చిన సమాధానం వెల్లడించిన నిజం. ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ మాదిరిగా బీసీ సబ్ ప్లాన్ పకడ్బందీగా చట్టపద్ధతిలో తెస్తారా అని ప్రతిపక్ష శాసన సభ్యులు గతంలో అడిగినప్పుడు తరువాతి ఫైనాన్షియల్ ఇయర్లో వందశాతం తెస్తామరని చెప్పారు అప్పుడు. మన రాష్ట్రమే వీకర్ సెక్షన్ రాష్ట్రం. ఎవరికి శషబిషలు ఉండాల్సిన అవసరం లేదు. తరువాతి ఫైనాన్షియల్ ఇయర్ లో బీసీ సప్లైప్లాన్ తెస్తమన్నారు. చట్టం కూడా ఇదే సభలో పాస్ చేస్తమన్నారు. ఇదీ 2017 మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో గత ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటన. ఆయన పది సంవత్సరాలు పాలన చేసిన బీసీలకు చేసింది ఏమీ లేదు. 2017లో ఏర్పాటు చేసిన ఎంబీసీ కార్పొరేషన్ అలంకారప్రాయంగా మారింది. ప్రతీ బడ్జెట్లో రూ.1,000కోట్లు కేటాయించి ఖర్చు చేయనున్నట్లు డబ్బా కొట్టుకున్న ప్రభుత్వం 2017-18 నుండి 2021-22 వరకు ఎంబీసీ కార్పొరేషన్కు కేటాయించిన బడ్జెటు, జరిగిన ఖర్చుకు పొంతనే లేదని ఆర్టీఐ సమాచారం ద్వారా స్పష్టమౌతోంది. గత నాలుగు బడ్జెట్లలో రూ.3,000 కోట్లు కేటాయించినట్లు కాగితాల్లో కనిపిస్తున్నా ఫైనాన్స్ విభాగం ఆమోదం పొందింది రూ.350 కోట్లు మాత్రమే. దానిలో ఖర్చు చేసింది మాత్రం శూన్యమే.

తెలంగాణాలో బీసీలకు అభివృద్ధి ఫలాలు అందకుండా చేస్తూ గత ముఖ్యమంత్రి కేసీఆర్ 'బీసీ ద్రోహి' అవతారమెత్తిన్రు. 10దేండ్లలో 5.70 లక్షల మంది బీసీలు స్వయం ఉపాధి లోన్లకు దరఖాస్తు చేసుకుంటే, కేవలం 50 వేల మందికే లోన్లు ఇచ్చి చేతులు దులుపుకున్నరు. మిగిలిన 5.20 లక్షల మంది నేటికీ ఋణాల కోసం కళ్లు కాయలు కాసేల ఎదురు చూస్తున్నరు. ఆర్టీఐ ద్వారా అందిన లెక్కల ప్రకారం ఎంబీసీ లోన్ల కోసం 13,360 మంది దరఖాస్తు చేసుకుంటే, 1,419 మంది మాత్రమే ఋణాలు పొందారు. ఎనిమిదేండ్లలో ఎంబీసీ కార్పొరేషన్కి కేటాయించిన బడ్జెట్ రూ.3,305 కోట్లు కాగా, ఖర్చు చేసింది కేవలం రూ.77.46రోట్లు. నాయీ బ్రాహ్మణులకు( మంగలి) మోడ్రన్ సెలూన్లు కట్టి స్తమని, సబ్సిడీపై పరికరాలు ఇప్పిస్తమని చెప్పింద్రు . దేవాలయంలోని కళ్యాణకట్టలో పని చేసే క్షురకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తమన్నరు. తీరా చూస్తే ఆ హామీలన్నిటికీ కేసీఆర్ కత్తెరేసిన్రు. ఆర్టీఐ ద్వారా నాయీ బ్రాహ్మణ సహకార సంఘం ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఎనిమిదేండ్లలో ప్రభుత్వంవారి కోసం కేటాయించిన బడ్జెట్ రూ.660 కోట్లు, అందులో రూ.186 కోట్లు విడుదల చెయ్యగా, ఖర్చు చేసింది కేవలం రూ.60 కోట్లు, రాష్ట్ర వ్యాప్తంగా 35,651మంది నాయీ బ్రాహ్మణులు లోన్లకు దరఖాస్తు చేసుకుంటే, అందులో 7,375 మందికే లోన్లు ఇచ్చిన్రు. గొల్ల కురుమలను కోటీశ్వరులను చేస్తమని కేసీఆర్ పచ్చి అబద్ధాలమాటలు చెప్పిన్రు. కానీ, గొర్రెల పంపిణీ పథకం మూలకుపడి మూడేండ్లయింది. యూనిట్ల కోసం రూ.31,250 చొప్పున డీడీలు కట్టిన మూడున్నర లక్షల మందికి ఎదురు చూపులే మిగిలినయ్. గొర్రెల పంపిణీకి పోయిన బడ్జెట్టులో వెయ్యి కోట్లు, ఈ బడ్జెట్టులో వెయ్యి కోట్లు కేటాయించినా నయా పైసా విడుదల చెయ్యలే. రాష్ట్రంలో ఉన్న జలాశయాల్లో, చెరువుల్లో ప్రభుత్వమే ఉచితంగా చేపలు పోసి మత్స్యకారులకు ఉపాధి కల్పిస్తమని 2018 మేనిఫెస్టోలో చెప్పిన బీఆర్ఎస్, వాటిని కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టి మోసం చేసింది. ఫలితంగా ముదిరాజు, గంగపుత్ర సోదరులు సరైన ఉపాధి లేక ఆర్థికంగా చితికిపోతున్నరు. కల్లుగీత కార్మికులకు టెక్నాలజీ సాయం అందించి మరణాలను ఆపడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమయ్యింది. ఈ ఎని మిదేండ్లలో 600 మంది గీత కార్మికులు తాటి చెట్ల మీద నుంచి పడి చనిపోయారు. 4 వేల మంది వికలాంగులయిను. ప్రతి గ్రామంలో 5 ఎకరాలు తాటి, ఈత వనాలకు కేటాయిస్తమని చెప్పిన 560 జీవో అమలుకే నోచుకోలే. 50 ఏండ్లు దాటిన గీత కార్మికుల పెన్షన్ దర ఖాస్తులు నాలుగేండ్లుగా పెండింగులోనే పెట్టిన్రు గౌడన్నలం దరూ ప్రభుత్వం ఇస్తనన్న మోటరు సైకిండ్ల కోసం దరఖాస్తు పెట్టుకోగా అవి కాగితాలకే పరిమితమైనయ్.ఇక

ఎనిమిదేండ్లలో సాగర ఉప్పర కార్పొరేషన్ 29.84 కోట్లు కేటాయిస్తే, అందులో ఖర్చు చేసింది 4.43 కోట్లు మాత్రమే. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఆ సామాజిక వర్గానికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. టీఆర్ఎస్ నిర్వాకం వల్ల ఆ సామాజిక వర్గం బుక్కెడు బువ్వ కోసం కాంట్రాక్టర్ల కింద కూలీలుగా నలిగిపోతూ ఉన్నారు. ఇక 2014 నుంచి ఇప్పటి వరకు వాల్మీకి బోయ కార్పొరేషన్కి రూ.30.46 కోట్లు కేటాయించగా, ఖర్చు చేసింది రూ.5.08 కోట్లు మాత్రమే. రజక సహకార సంఘాల సమాఖ్యకు ఈ ఎనిమిదేళ్లలో 56,850 మంది ఋణాల కోసం దరఖాస్తు చేసుకుంటే, కేవలం 5,720 మందికి చాలీచాలని ఋణాలు ఇచ్చారు. ఈ ఎనిమిదేం డ్లలో రజకుల కోసం మొత్తం రూ.551 కోట్లు కేటాయిస్తే, ఖర్చుపెట్టింది అక్షరాల అరవై కోట్లే, నేతన్నలకు 50శాతం సబ్సిడీపై నూలు, 5లక్షల బీమా, హెల్త్ కార్డులిస్తమని చెప్పినా, ఏవీ అమలు కాలేదు. ఇన్నాళ్లు తిప్పలు పెట్టి, తీరా ఇయ్యాళ గత ఎన్నికల ముందు బీమా ఇస్తమని మొసలి కన్నీరు కార్చింద్రు. బీఆర్ఎస్ అసమర్థ పాలన వల్ల తెలంగాణ వచ్చినప్పుడు 470 సహకార సంఘాలు ఉంటే, అవిప్పుడు 230కి తగ్గినయ్. విశ్వబ్రాహ్మిణ్ కార్పొరేషన్ ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఎనిమిదేండ్లలో వారికి కేటాయించిన బడ్జెట్ రూ.86 కోట్లు కాగా, ఖర్చు చేసింది కేవలం రూ.28,94కోట్లు, ఇక, గత మూడు బడ్జెట్లలో విశ్వబ్రాహ్మణులకు శూన్య హస్తమే చూపించారు. కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ ఇచ్చిన సమాచారం ప్రకారం గత ఎనిమిదేండ్లలో వారికి కేటాయించిన బడ్జెట్ రూ.55 కోట్లయితే, ఖర్చు చేసింది రూ.12 కోట్లు, భట్రాజ కార్పొరేషన్ పంపించిన సమాచారం ప్రకారం గత ఎనిమిదేండ్లలో భట్రాజ సామాజిక వర్గానికి కేటాయించిన బడ్జెట్ రూ.13.30కోట్లు కాగా, అందులో రూ.95 లక్షలు ఖర్చు చేయడం సిగ్గుచేటు.

### 10 సం.లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిన వివరాలు:

(శాఖల వారీగా కేటాయింపులు, ఖర్చులు (రూ.కోట్లలో)

బీసీసంక్షేమం.సంవత్సరం.కేటాయింపులు.ఖర్చు.2014-15.కేటాయింపులు.2,020.ఖర్చు1,090.2015-16.కేటాయింపులు.2,172.ఖర్చు.1,074.2016-17.కేటాయింపులు.2,537.ఖర్చు.2,832.2017-18.కేటాయింపులు.5,070.ఖర్చు.2,856.2018-19.కేటాయింపులు.5,960.ఖర్చు.3,863.2019-20.కేటాయింపులు.4,528.ఖర్చు.3,221.2020-21.కేటాయింపులు.4,356.ఖర్చు3,023.2021-22.కేటాయింపులు.5,522.ఖర్చు3,178.2022-23.కేటాయింపులు.5,697.ఖర్చు3,350మొత్తం.

కేటాయింపులు.37,862.ఖర్చు.24,487బిఆర్ఎస్ ప్రభుత్వం 2014లో తన మేనిఫెస్టోలో ప్రతి సంవత్సరం 5000 కోట్ల రూపాయలు బీసీలలో కేటాయిస్తామని తన మేనిఫెస్టోలో చెప్పింది. వాస్తవానికి పది సంవత్సరాల బడ్జెట్లో 50, 000 కోట్ల రూపాయలు బీసీ కు రావాల్సిన బడ్జెట్ కానీ గత బిఆర్ఎస్ ప్రభుత్వం బడ్జెట్లో ఖర్చు చేసింది24,487 ఇంతే....! ఇది బీసీల సంక్షేమం ఎట్లా అయితది.....!

గత పది సంవత్సరాలుగా బి ఆర్ఎస్ పాలల్లో స్వీయ చరిత్ర. మొన్న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం బీసీలను మేము అభివృద్ధి చేశాం అంటూ గొప్పలు చెప్పుకొచ్చారు ఇక కొంతమంది కుహనా మేధావులు రాస్తున్న రాతలు చూస్తుంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. స్వామి భక్తి ఉండాలి గాని ఇంతగా ఉండకూడదు అందుకే తెలంగాణ సమాజం బీసీలంతా ఏకమై కర్రు కాల్చి వాత పెట్టినారు. బీసీల పట్ల ముసలి కన్నీరు కారుస్తున్న కేసీఆర్ కు స్థానిక సంస్థలలో ఎందుకు ఓట్లు వెయ్యాలి. ఒక పక్కన ఆగమేఘాలమీద అసెంబ్లీలో ఆర్డినెన్స్ బీసీ రిజర్వేషన్స్ ఉన్న 33 శాతాన్ని తీసివేసి 18 శాతాన్ని కుదించిన ఘనత కేసీఆర్ కే దక్కుతుంది. బీసీలకు స్థానిక సంస్థల్లో పదవులు రాకుండా చేసిన ఘనత కేసీఆర్ కి దక్కింది. కుహనా ఆహా నా మేధావులకు ప్రజలు వేస్తున్న ఒక ప్రశ్న:

బీసీల పట్ల 76 సంవత్సరాలుగా పాలకులు ఇంకా మోసం చేస్తూ ఉన్న పాలకులను ఎండగట్టాల్సింది పోయి చెక్కభజన చేస్తూ గత తెలంగాణ ప్రభుత్వంలో సాహెూ ఓహెూ అంటూ కెసిఆర్ పై స్వామి భక్తి చూపిస్తున్నారు. బి ఆర్ఎస్ పాలనలో బీసీ ప్రజలను మోసం చేయలేదా ...! ఇది నగ్న సత్యం కాదా! బిఆర్ఎస్ ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే అని హడావుడి చేసి ఆ నివేదికను బయట ఎందుకు బయట పెట్టలేదు. ఇక కొత్తగాప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ బలహీన వర్గాలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ తమ మేనిఫెస్టోలో పెట్టిన వాగ్దానాలు నెరవేరుస్తాదని ఆశిద్దాం.



- మన్నారం నాగరాజు
తెలంగాణ లోక్సత్తా పార్టీ
రాష్ట్ర అధ్యక్షులు
95508 44433



## మైత్రి విహార్ కాలనీలో డ్రైనేజ్ వ్యవస్థను పరిశీలించిన కార్పొరేటర్

**వెలుతురు, హయత్ నగర్, నవంబర్ 23:**
జలమండలి అధికారులతో కలసి మైత్రి విహార్‌లోని భూగర్భ డ్రైనేజ్ పరిశీలించిన హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి హయత్ నగర్ డివిజన్ లో శని వారం కార్పొరేటర్ మార్నింగ్ వాక్ లో భాగంగా డివిజన్ లోని మైత్రి విహార్ కాలనిలో జలమండలి అధికారులతో కలసి భూగర్భ డ్రైనేజ్ పైప్ లైన్ పరిశీలించారు,కాలనీలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు వెంకట రామ్ రెడ్డి , సంక్షేమ సంఘం సభ్యులు శ్రీనివాస్ రెడ్డి , ఏఎస్ మూర్తి,జలమండలి మేనేజర్ రాజు గారు,సూపెర్వైసోర్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మహా పడిపూజలో పాల్గొన్న ఆదిభట్ల చైర్మన్ నిరంజన్ రెడ్డి

**ఇబ్రహీంపట్నం, నవంబర్ 23, (వెలుతురు):**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల శనివారం అయ్యప్ప మహాపడి పూజ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పాల్గొన్నాడు.అనంతరం వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని, స్వామి దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో,



పాడిపంటలతో, అష్టైశ్వర్యాలతో, సుభిక్షంగా ఉండాలని అన్నారు. జమ్మ వెంకటేష్ గురుస్వామి ఆదిభట్ల నుండి శబరిమలై కు పాదయాత్రగా నాలుగు సార్లు దిగ్విజయంగా పూర్తి చేసుకొని విచ్చేసిన సందర్భంగా ఆదిభట్ల అయ్యప్ప సేవా సమితి సన్నిధానం గురు స్వాములతో కలిసి వారికి ఘనంగా సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదిభట్ల అయ్యప్ప సేవా సమితి సన్నిధానం గురు స్వాములు శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, సమ్ రెడ్డి మహిపాల్ రెడ్డి, తిరుమలరెడ్డి, శ్రీనివాస్ చారి, ప్రకాష్ గౌడ్ మరియు అయ్యప్ప భక్తులు గ్రామస్తులు,బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 30 నాటికి సర్వే పూర్తి : కేఎల్ఆర్

**వెలుతురు, ఎల్.బి.నగర్, నవంబర్ 23:**
సమగ్ర కుటుంబ సర్వేతో జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు వస్తాయని మహేశ్వరం నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీఇంచార్జ్కేఎల్ఆర్అన్నారు, కులగణనతో పేదలకు అధిక సంక్షేమ పథకాలు అమలు చేస్తామని పేర్కొంటూ నవంబర్ 30 నాటికి సర్వే పూర్తి



చేయాలని సీఎం సూచించినట్లు కేఎల్ ఆర్ తెలిపారు. ఆయన మహేశ్వరం లో శని వారం మీడియా తో మాట్లాడారు.రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 6 నుంచి కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే - కులగణన పూర్తి కావొచ్చిందని లక్ష్మారెడ్డి అన్నారు. ఇవాల్టికి మహేశ్వరం నియోజకవర్గంలో దాదాపు 90% మేర ఇంటింటి సర్వే పూర్తి చేశారని కేఎల్ఆర్ తెలిపారు. అధికార యంత్రాంగం సెలవు దినాల్లోనూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చేందుకు కృషి చేస్తోందని కిచ్చెన్న కితాబు ఇచ్చారు.

సీఎం రేవంత్ రెడ్డి సూచన మేరకు నవంబర్ 30 నాటికి సమగ్ర సర్వే పూర్తి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఓటు హక్కు మన బాధ్యత

**- మేడిపల్లి తహసీల్దారు షేక్ హసీనా**

**మేడిపల్లి, వెలుతురు:**
18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు అందరూ తప్పకుండా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని మేడిపల్లి తహసీల్దారు షేక్ హసీనా తెలిపారు.శనివారం నాడు మేడిపల్లి మండల తహసీల్దారు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ జనవరి 1,2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి,యువకులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు.ఓటు హక్కు నమోదు కోరకు తమ తమ డివిజన్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు సెంటర్ లో బి.ఎల్.ఓ వద్ద తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు.ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు నడుస్తాయని తెలిపారు.



## వాయనాడ్‌లో ప్రియాంకగాంధీ విజయం ప్రజల విశ్వాసాన్ని చాటింది

**- ఎ.బ్లాక్ ఉపాధ్యక్షుడు ఎం. యుగంధర్ రెడ్డి**

**కూకట్‌పల్లి, నవంబర్ 23: వెలుతురు:**
చారిత్రాత్మక ఎన్నికల విజయంలో ప్రియాంక గాంధీ వాద్రా వయనాడ్ నియోజకవర్గం నుండి పార్లమెంటు సభ్యురాలుగా ఎన్నికయ్యారని, ఇది ఆమె రాజకీయ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎ. బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రియాంక గాంధీ విజయం, సాంస్కృతిక వారసత్వం, విభిన్న సమాజానికి ప్రసిద్ధి చెందిన వాయనాడ్ ప్రజలు ఆమెపై ఉంచిన విశ్వాసాన్ని సూచిస్తుందని గుర్తు చేశారు. భారీ మెజారిటీతో ఈ కీలకమైన ఎన్నికల పోటీలో ప్రియాంక గాంధీ సాధించిన విజయం, ఆమె నాయకత్వంలోని ప్రతిధ్వనిని, కేరళ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ఆమె నిబద్ధతను హైలైట్ చేస్తుందని తెలిపారు. ఆమె విజయం ప్రతి పౌరుడి సంక్షేమంపై దృష్టి సారించే ప్రగతిశీల, సమ్మిళిత రాజకీయాలకు పెద్ద మద్దతును ప్రతిబింబిస్తుందని, ముఖ్యంగా విద్య, ఆరోగ్య సంరక్షణ, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ స్థిరత్వం వంటి రంగాలలో తన ప్రచారంలో ప్రియాంక గాంధీ యువత సాధికారత, ఉద్యోగ కల్పన సామాజిక న్యాయం ప్రాముఖ్యతను నొక్కి చెప్పారని గుర్తు చేశారు. వయనాడ్ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందడానికి, జాతీయ పురోగతి నుండి స్థానిక సమాజాలు ప్రయోజనం పొందేలా వ్యవసాయ రంగాన్ని బలోపేతం



చేయడానికి, మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ఆమె వాదించారని తెలిపారు.

మహిళలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తానని, పార్లమెంటులో వారి వాణిని వినిపించేలా చూస్తానని ఆమె ప్రతిజ్ఞ చేసినట్లు తెలిపారు. తన విజయం తర్వాత ప్రియాంక గాంధీ మాట్లాడుతూ, వయనాడ్ ప్రజలు తమకు అఖండమైన మద్దతు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అంకితభావం, పారదర్శకత, అభిరుచితో వారికి సేవ చేయాలనే తన నిబద్ధతను ఆమె పునరుద్ఘాటించారని తెలిపారు. విజయం తనది మాత్రమే కాదని, మార్పు, పురోగతి, సమానత్వంపై నమ్మకం ఉన్న ప్రతి వ్యక్తికి ఇది విజయం, వాయనాడ్ ప్రజల అభివృద్ధి, సాధికారత కోసం ఆమె పోరాడుతూనే ఉంటదని ఆమె అన్నట్లు తెలిపారు.

వయనాడ్‌లో ప్రియాంక గాంధీ విజయం కేరళలో కాంగ్రెస్ పార్టీ బలమైన ఉనికిని బలోపేతం చేయడం, భారతదేశంలోని దక్షిణ ప్రాంతంలో పార్టీ పెరుగుతున్న ప్రాబల్యానికి సంకేతమని తెలిపారు. ఇది రాష్ట్ర రాజకీయ దృశ్యంలో ఒక ముఖ్యమైన అధ్యాయాన్ని కూడా సూచిస్తుందని, భారత రాజకీయాల భవిష్యత్తును రూపొందించడంలో ప్రియాంక గాంధీ కీలక పాత్ర పోషిస్తారని భావిస్తున్నట్లు తెలిపారు.

వాయనాడ్ ప్రజలు ఈ విజయాన్ని జరుపుకుంటున్న సమయంలో ప్రియాంక గాంధీ ఇప్పుడు పార్లమెంటులో తన కొత్త పాత్రను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారని, ఇక్కడ ఆమె తన నియోజకవర్గాల ఆందోళనలను సమర్థవంతంగా పరిష్కరించేలా చూసుకుంటూనే దేశాభివృద్ధికి అర్థవంతంగా దోహదపడాలని లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు.

## శివయ్య నుదుట సిందూరం..

### శివలింగాన్ని తాకిన సూర్యకిణాలు

### శివనామ స్మరణలతో మారు మ్రోగిన ఆలయం

### అరసవల్లి దేవాలయాన్ని చూసినంత ఆనందంలో భక్తులు

### పూజలు చేసిన అయ్యప్ప భక్తులు



**యూసుఫ్‌గూడ, వెలుతురు:**
హైదరాబాద్ జూబ్లీహిల్స్ సమీపంలోని వెంకటగిరిలో గల శ్రీవీరాంజనేయ స్వామి వారి సన్నిదిలో గల శివలింగం నుదుటిపై సూర్యకిరణాలు సింధూరమై మెరిశాయి.. శనివారం శివునికి అభిషేకం చేస్తున్న సమయంలో సూర్యకిరణాలు నేరుగా శివలింగం నుదుటిపై పడటంతో భక్తులు ఆసక్తిగా చూశారు.. మొక్కులు మొక్కుకొని కోరికలు కోరుకున్నారు.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి దేవాలయంలో శ్రీ సూర్యనారాయణ స్వామి మూలవిరాట్‌ను ఎలా అయితే సూర్యకిరణాలు తాకుతాయో అలాగే సూర్య కిరణాలు శివయ్య పాదాలను తాకాయంటూ భక్తుల మురిసిపోయారు.. దీంతో ఆలయమంత శివనామ స్మరణలతో మారు మోగింది.. లేలేత కిరణాలు నేరుగా శివున్ని తాకిన దృశ్యాలను చూసి వీరాంజనేయ స్వామి సన్నిదానంలోని అయ్యప్ప భక్తులు పులకించిపోయారు. ఆలయంలో భజనలు, నిత్య పూజలతో స్వామి వారిని కొలుసుకోవడం ఎంతో సంతోషంగా ఉన్నదని శివయ్యకు మొక్కలు పెట్టుకున్నారు రామాంజి గురుస్వామి.. ఉదయం 6.35 గంటలకు కొన్ని నిమిషాలపాటు ఆవిష్కృతమైన ఈ అద్భుతాన్ని భక్తులు భక్తి శ్రద్దలతో వీక్షించారు.

శివలింగంపై సూర్యకిరణాలు ఆవిష్కృతం అయ్యిన సమయంలో శివున్ని దర్శనం చేసుకున్న వారిలో సంతోష్ శర్మ గురుస్వామి, సందీప్ స్వామి, వేణు గురుస్వామి, శ్రీనివాస్ గురుస్వామి, శ్రీశైలం స్వామి, సురేంద్ర యాదవ్ స్వామి, గణేష్ స్వామి, విజయ్ గురుస్వామి, గంగాధర్ స్వామి, శ్రీహరి స్వామి, యశ్వంత్ స్వామి, శివయ్య భక్తులు తదితర భక్తులు ఉన్నారు.





## వనస్థలిపురం జోన్ నారాయణలో ఘనంగా జోనల్ స్పోర్ట్స్ మీట్ వేడుకలు

**వనస్థలిపురం వెలుతురు నవంబర్ 23:**
వనస్థలిపురం జోన్ నారాయణ స్కూల్స్ జోనల్ స్పోర్ట్స్ మీట్ ను నారాయణ ప్రీమియర్ లీగ్ అనే పేరుతో సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఘనంగా వేడుకలు ప్రారంభించారు. ముఖ్యఅతిథి గా విచ్చేసిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుకా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ నారాయణ విద్యా సంస్థలు విద్యార్థులకు అత్యున్నతమైన అకడమిక్ కరిక్యులంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపయోగపడే విధంగా ఆటలు, పాటలు, వ్యాయామాలు, కో-కరిక్యులర్ యాక్టివిటీస్ కి కూడా ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గౌరవ అతిధిగా వచ్చిన విద్యాసంస్థల జనరల్ మేనేజర్ గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నారాయణ యాజమాన్యం తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు, విద్యార్థుల అభివృద్ధి కోసం నిరంతరం వినూత్నంగా ఆలోచిస్తూనే ఉంటుందని హర్షం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే విద్యార్థులను శారీరకంగా, మానసికంగా ఆరోగ్యవంతులను చేయటం కోసం ఈ జోనల్ స్పోర్ట్స్ మీట్ ను ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు.వనస్థలిపురం జోన్ ఏ.జి.ఎం. రవీంద్రబాబు మాట్లాడుతూ ఈ స్పోర్ట్స్ మీట్ కు విద్యార్థులను ప్రోత్సహించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పీఈటీలకు, వైస్- ప్రిన్సిపల్స్ కు, ప్రిన్సిపల్స్ అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు, అభినందనలు తెలియజేశారు.

ఎంతో వేడుకగా జరిగిన ఈ స్పోర్ట్స్ మీట్ లో ప్రిన్సిపల్స్ అనూ సింగ్, రవి కుమార్, బాబ్జీ, నౌషీన్ ఫాతిమా, మాధవి, లావణ్య రెడ్డి,రీసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ విభాగ అధ్యక్షులు ,అకడమిక్ డీన్స్, కో-ఆర్డినేటర్స్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్స్ మరియు అధ్యక్షులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్,టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ స్టాఫ్ మెంబర్స్ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## జంపాల రాజేష్‌కి డాక్టరేట్

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 23:**
తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుడు జంపాల రాజేష్ కి ఓబిసి రిజర్వేషన్లు, క్రిమిలేయర్ అంశంపైన జరిపిన పరిశోధనలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ లా కాలేజీలో శనివారం డాక్టరేట్ ప్రధానోత్సవం జరిగింది ఈ పరిశోధన ప్రొఫెసర్ రామారావు గైడెన్స్ లో పూర్తి చేసినట్లు తెలిపారు. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమాన్ని నడిపిన వ్యక్తిగా అందరికీ సుపరిచితుడే. దళిత బహుజన ఉద్యమాల వైపు విద్యార్థులను చైతన్యవంతం చేస్తూ సమాజంలో అణగారిన వర్గాలకు అండగా ఉంటూ ముందుకు సాగుతున్న వ్యక్తి రాజేష్, విద్యార్థుల సమస్యల పైన తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నిరంతరం విద్యార్థి లోకానికి అండు బాటులో ఉండి పోరాటం చేస్తున్న వ్యక్తి రాజేష్ అని ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు జి.బి.రెడ్డి, రాంప్రసాద్, నక్క వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి, రాధిక యాదవ్, ఐ జే యు జాతీయ కార్యవర్గ సభ్యులు అవ్వారి భాస్కర్, రాజేష్, జంపాల రాంబాబు, కొమరబోయిన సైదులు యాదవ్, భూషణ్, సోమశేఖర్, శివ,వెంకట్,ముత్యం తదితరులు పాల్గొన్నారు.



## పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ అమర్ సింగ్‌కు గౌరవ డాక్టరేట్

**మేడిపల్లి, వెలుతురు:**
సమాజిక సేవా కార్యక్రమాల్లో విశేష సేవలను గుర్తించి ఫీల్ జాతి కూడా మున్సిపల్ మేయర్ అమర్ సింగ్ కు హెచ్ఎస్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను ప్రకటించింది.. నీ మేరకు శనివారం ఆయనకు ప్రశంసా పత్రం అందించి సన్మానించారు.. చిన్న వయస్సులోనే రాజకీయాల్లో రంగప్రవేశం చేసిన అమర్ సింగ్.. తనవంతు సామాజిక బాధ్యతగా పేద ప్రజలకు సేవ చేస్తూ వచ్చారు.. కార్పొరేటర్ గా ఉన్న ఆయన అనతి కాలంలోనే పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ గా బాధ్యతలు చేపట్టారు.. ఇలా పలు రంగాల్లో సేవా కార్యక్రమాలు చేస్తూ.. అద్భుత ధైర్య సాహసాలను కనబర్చారు.. మేయర్ గా బాధ్యతలను చేపట్టిన అనంతరం వేగంగా అభివృద్ధి కార్యమాలను చేపట్టారు%ౌ% గత పాలనకు స్వస్తి పలికి ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న అమర్ సింగ్ సేవలను గుర్తించిన యూనివర్సిటీ గౌరవ డాక్టర్ చెప్పిన ప్రకటించడం జరిగింది.. ఈ సందర్భంగా సికింద్రాబాద్ లోని హెచ్ ఎస్ సీ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను అందించారు.. ఈ కార్యక్రమం లో డైరెక్టర్ బిషప్ ఆనంద్ కుమార్, సలహాదారు డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు..

# డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి

## - కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..

**కూకట్‌పల్లి నవంబర్ 23 వెలుతురు:** డివిజన్లోని సమస్యల పరిష్కారానికి దశలవారీగా కృషి చేస్తానని ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పేర్కొన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ 2వ ఫేస్ లోని జి.ఎస్.ఆర్ నగర్ లో సీసీ రోడ్ల కొరకు నిధులు మంజూరై నిర్మాణ పనులు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్న రోడ్లను ఆయన శనివారం జి.ఎచ్.ఎం.సి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో జి.ఎస్.ఆర్ నగర్ కాలనీకి రోడ్లు, డ్రైనేజీలు, త్రాగు నీరు, వీధి దీపాలు వంటి అన్ని మౌలిక సదుపాయాలు అందించామని గుర్తుచేశారు. ఇప్పుడు నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు కూడా అతిత్వరలో మొదలు పెడతారని అన్నారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకుఅందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. రోడ్డును మంచిగా లెవెలింగ్ చేసి వర్షపు నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో నిర్మాణ పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగేష్ గౌడ్, సాయి ప్రభాకర్, సాదిక్, రవీందర్, శ్రీధర్, నవీన్, ఏ.ఇ రాజీవ్, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.







# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాణిక్ రావు

**జహీరాబాద్ వెలుతురు నవంబర్ 23:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జహీరాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 10 మంది లబ్ధిదారులకు గాను ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా 3 లక్షల 90 వేల విలువ కలిగిన చెక్కులను స్థానిక శాసనసభ్యులు కొణింటి మాణిక్ రావు, సీడీసీ చైర్మన్ శివకుమార్, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, పాక్స్ చైర్మన్ మచ్చేందర్ లతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. సీఎం సహాయ నిధి ద్వారా చెక్కులు అందుకొన్న వారిలో తుంకుంట గ్రామానికి చెందిన ప్రేమల, 60 వేల రూపాయలు, మల్చెల్మ గ్రామానికి చెందిన ఇస్మాయిల్ 24 వేల రూపాయలు, బుర్దిపాడ్ గ్రామానికి చెందిన అశోక్,18 వేల రూపాయలు, కాశింపూర్ గ్రామానికి చెందిన సువర్ణ, 25 వేల 5 వందల రూపాయలు, దిడిగి గ్రామానికి చెందిన రాజ రత్నం 60 వేల రూపాయలు, హెూతి బి గ్రామానికి చెందిన పద్మమ్మ, 60 వేల రూపాయలు, సత్వార్ గ్రామానికి చెందిన అస్మా బేగం 13 వేల రూపాయలు, ఆనేగుంట గ్రామానికి చెందిన ఎర్ర గొల్ల తుల్జమ్మ, 39 వేల రూపాయలు, ఆనేగుంట గ్రామానికి చెందిన పిట్టల మన్నెమ్మ, 13 వేల రూపాయలు మరియు సత్వార్ గ్రామానికి చెందిన మొహమ్మద్ అలీ, 23 వేల 5 వంద రూపాయలు మొత్తం 10 మంది లబ్ధిదారులు యున్నారు. చెక్కులు అందుకొన్న లబ్ధిదారులు ఎమ్మెల్యే మాణిక్ రావు కు, మండల అధ్యక్షులు తట్టు నారాయణ కు, సీడీసీ చైర్మన్ శివకుమార్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షులు యాకూబ్, బిసి సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హిరు రాథోడ్, సోషల్ మీడియా కన్వీనర్ విజయ్ రాథోడ్, మాజీ సర్పంచ్ అబ్రహం మాజీ ఎంపిటీసీ ప్రేమ్, గ్రామ పార్టీ అధ్యక్షులు జగన్నాథం, సయాద్, పెంటారెడ్డి సీనియర్ నాయకులు సత్యం, ముదిరాజ్, కిష్టయ్య, స్వామిదాస్, మోహన్, దత్తు, నవీన్, రాజు తదితరులు యున్నారు.

# రాజీ మార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారం అయ్యేలా చూడాలి

### లోక్ అదాలత్‌పై విస్తృత ప్రచారం చేయండి...

### న్యాయవాదులకు, పోలీసులకు సూచించిన సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.సూరి కృష్ణ..

**జహీరాబాద్, వెలుతురు నవంబర్ 23:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ ను పునస్కరించుకొని సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కె.సూరి కృష్ణ న్యాయవాదులతో, పోలీస్ ఉన్నతాధికారులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలను బాధితులకు, కక్షిదారులకు తెలియజెప్పి రాజిమార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారం చేసుకునేలా చూడాలని తెలిపారు. లోక్ అదాలత్ పై విస్తృత ప్రచారం చేయాలని న్యాయవాదులకు, పోలీసులకు సూచించారు. రాజీ మార్గం ద్వారా కేసులు సత్వర పరిష్కారం అయ్యేలా చూడాలని అన్నారు. కక్షి దారులకు, బాధితులకు క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, లోక్ అదాలత్ పై ఎవరికైనా న్యాయ పరమైన ఏ సందేహాలున్న మండల లీగల్ సర్వీసెస్ కమిటీ, జహీరాబాద్ కార్యాలయంనుగాని, న్యాయ వాదులకు గాని సంప్రదించవచ్చని సూచించారు.




సమావేశంలో బార్ ప్రెసిడెంట్ గోపాల్, వైస్ ప్రెసిడెంట్ మానెన్న, న్యాయవాదులు, పోలీస్ ఉన్నతధికారులు లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ప్రవాస భారతీయులు కోటగిరి అనుదీప్ సహాయంతో

# ఇంగ్లిష్ సాహితీ ప్రక్రియ పుస్తకాల పంపిణీ

### ప్రభుత్వ విద్యాభివృద్ధి కోసం నిరంతర దాతల సహకారం : పీజీహెచ్ఎం మన్మధ కిషోర్

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 23 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ నియోజకవర్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 800 మంది విద్యార్థులు చదువుతున్నారని వీరులో 54 గ్రామాల నుండి వస్తున్నారని వారంతా పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులని వారికోసం దాతలు నిరంతరం సహకారం అందించడం గొప్ప విషయమని ప్రధానోపాధ్యాయులు మన్మద కిషోర్ అన్నారు. శనివారం నాడు కోటగిరి భద్రిసెట్ అనురాధ కుమారుడు ఎన్నారై అనుదీప్ సహకారంతో పదవ



తరగతి విద్యార్థులందరికీ పదివేల విలువగల ఇంగ్లిష్ సాహితీ ప్రక్రియ పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం దాతల సహకారంతో స్కూల్ బ్యాగులు క్రీడా సామాగ్రి సౌండ్ సిస్టం క్రీడా దుస్తులు కంప్యూటర్లు ఇలా ఎన్నో సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. రాబోవు రోజులో మరింత మంది విద్యార్థులకు ఉపయోగపడే విద్యా సామాగ్రిని అందించడానికి దాతలు ముందుకు రావాలన్నారు . ఈ సందర్భంగా ప్రవాస భారతీయులు అనుదీప్ మాట్లాడుతూ రాబోవు రోజుల్లో మరింత సహకారాన్ని ఈ పాఠశాలకు అందిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ అధ్యక్షులు వెంకట్రావు సభ్యులు చంద్రశేఖర్ ఆచార్య, జైపాల్ రెడ్డి, రాజయ్య, యాదగిరి , తదితరులు పాల్గొన్నారు.

# మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి గెలుపు పట్ల హర్షం

### - పేట మండల బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్

**వెలుతురు నారాయణఖేడ్ నవంబర్ 23:** మెదక్ జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం పెద్ద శంకరంపేట్... మహారాష్ట్ర ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం పట్ల పెద్ద శంకరంపేట మండలం బిజెపి అధ్యక్షుడు కోణం విట్టల్ హర్షం వ్యక్తం చేశారు.. శనివారం పెద్ద శంకరంపేట భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద బిజెపి నాయకులు కార్యకర్తలు మహారాష్ట్రలో బిజెపి గెలుపొందడంతో బాణసంచా కాల్చి మిఠాయిలు తినిపించుకున్నారు.. బిజెపి కూటముతోనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా జరిగిన ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి మంచి ఫలితాలు సాధించడం జరిగింది అన్నారు.

ఈ కార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు బండల శ్రావణ్ కుమార్.. మంగలి కృష్ణ.. బిజెపి నాయకులు. ఎర్ర శ్రీహరి ..అంజన్న.. రాజు.. సాయికుమార్.. భూమేశ్వర్ .. వెంకయ్య.. సత్యనారాయణ.. తదితరులు పాల్గొన్నారు.







# ఘనంగా న్యాల్కల్ మండల ఎంఆర్ఓ జన్మదిన వేడుకలు...

**జహీరాబాద్, వెలుతురు నవంబర్ 23:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం న్యాల్ కల్ మండలంలోని ఎం ఆర్ ఓ కార్యాలయం లో స్థానిక మండల రెవిన్యూ అధికారి భూపాల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాల్కల్ మండల బీజేపీ ఓంకార్ యాదవ్ మరియు మండల బీజేపీ నాయకులు కేక్ కట్ చేసి ఎం ఆర్ ఓ భూపాల్ ని శాలువా పూలమాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా న్యాల్ కల్ మండలం బీజేపీ అధ్యక్షులు ఓంకార్ యాదవ్ మాట్లాడుతూ మీరు నిండు నూరేండ్లు ఇలాగే ఆయురారోగ్యాలతో మీ పదవి కి మరిన్ని సేవలు చేయాలనీ బడుగు బలహీన వర్గాల కు ప్రభుత్వం తెస్తున్న పథకాలు నిజమైన బడుగు బలహీన వర్గాలకు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు మండలం కార్యదర్శి మల్లేష్, బీజేవైఎం మండలం అధ్యక్షులు విష్ణు సునర్, డిప్టి ఎం ఆర్ ఓ రాజి రెడ్డి, ఆర్ ఐ శ్యామ్ రావు, మండలం సర్వేయర్ లాల్ సింగ్, కార్యాలయం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# శాసన మండలి సభ్యులు ఆమెర్ అలీ ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ముల్తానీ బృందం

**జహీరాబాద్, వెలుతురు, నవంబర్ 23:** శనివారం నాడు మధ్యాహ్నం తెలంగాణ రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఆమెర్ అలీ ఖాన్‌ని హైదరాబాద్‌లోని వారి స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి బోకెతో సత్కరించిన సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు



ఎండి ముల్తానీ. అనంతరం ఎమ్మెల్సీ ఆమెర్ అలీ సంగారెడ్డి డిసిసి ఉపాధ్యక్షుడు ముల్తానీ యోగ క్షేమలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఎండి ముల్తానీ రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఆమెర్ అలీ ఖాన్‌తో పలు కీలకమైన విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేయడంతో వారు సానుకూలంగా స్పందించారు. త్వరలో జహీరాబాద్ నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలో సియాసత్ ఉర్దూ దినపత్రిక తరపున ఒక కార్యక్రమంలో హాజరవుతానని అన్నారు. కార్యక్రమంలో ఎండి ముల్తానీ, మొహమ్మద్ ఎక్బాల్, మొయిజుద్దీన్, ఎండి అన్వర్, ఎండి రఫియోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ చెక్కులను పంపిణీ చేసిన సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉజ్వల్ రెడ్డి

**జహీరాబాద్, వెలుతురు, నవంబర్ 23:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీ గెస్ట్ హౌస్‌లో శనివారం జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా చెక్కులను తెలంగాణ రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ యన్.గిరిధర్ రెడ్డి, జహీరాబాద్ పార్లమెంట్ సీనియర్ నాయకులు డాక్టర్ సిద్దం ఉజ్వల్ రెడ్డిలు కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ సిడిసి చైర్మన్ మహ్మద్ అబ్దుల్ ముబీన్, జహీరాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పి.నర్సింహా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు అక్బర్, మహమ్మద్ జుబెర్, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.





# రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

### - కార్పొరేటర్ రోజా దేవి రంగారావు

**కూకట్‌పల్లి, నవంబర్ 23 వెలుతురు:** రోడ్డు నిర్మాణపు పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వివేకానంద నగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు అధికారులకు సూచించారు. శేర్లింగంపల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్ లోనీ వెంకటేశ్వర నగర్ మల్లికార్జున వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, వెంకటేశ్వర నగర్ 14వ, రోడ్ లో జరుగుతున్న మురుగునీటి పైపులైను(సీవరేజ్ ), రిక్షా పుల్లర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్ లలో జరుగుతున్న



నిర్మాణం పనులను సంబంధిత అధికారులు, కాలనీ వాసులతో కలిసి శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంకటేశ్వర్ నగర్ రోడ్ నెంబర్ 13, 14, 21 లలో మంజూరైన సిమెంట్ రోడ్డు పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి ఇప్పుడు జరుగుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా వీలైనంత త్వరగా పనులను పూర్తి చేయాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి ఏ.ఈ శ్రావణి, హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్ బి మేనేజర్ ప్రియాంక, స్థానిక నాయకులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, లింగయ్య, సోమయ్య, నర్సింలు, రమేష్ రావు, సోమేష్, వెంకటేశ్వరరావు, శ్యామ్, రామచందర్, నరేష్, మహేష్, రవి, రాజు, చానప్ప తదితరులు పాల్గొన్నారు.

## రేపటికి ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం వాయిదా

### జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్

**పెద్దపల్లి, నవంబర్ 23 (వెలుతురు):**
మంథని ప్రాంతంలో నవంబర్ 24న జరగాల్సిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నవంబర్ 25కు వాయిదా పడిందని జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని, ఇందులో భాగంగా నవంబర్ 24న మంథని లో జరగాల్సిన ప్రజా ప్రభుత్వం పిలిచింది కార్యక్రమం నవంబర్ 25 వాయిదా పడిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నవంబర్ 25న మంథని శివ కిరణ్ గార్డెన్స్ లో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమం నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈ కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు , ఎమ్మెల్సీలు ప్రజా ప్రతి నిధులు హాజరవుతారని, ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## బీసీ సంక్షేమ శాఖ నూతన ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్‌ని కలిసి అభినందనలు తెలిపిన బీసీ నేత లింగంగౌడ్

**హైదరాబాద్ వెలుతురు నవంబర్ 23:**
బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శిగా నూతనంగా నియమితులైన శ్రీధర్ గారిని సచివాలయంలో కలిసి అభినందనలు తెలియజేసినట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ



వసతి గృహాలలో స్కావెంజర్ల సిబ్బంది సంఖ్యను విద్యార్థులకు అనుగుణంగా పెంచాలని ఉన్న ఒక్కరిద్దరితో అన్ని పనులు చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయని భోజనం వండేది వారే మరియు బాత్రూంలు శుభ్రం చేసేది వారే అవుతున్నారని, విద్యార్థుల సంఖ్య వంద మంది ఉంటే అందులో పని చేసే సిబ్బంది ఇద్దరు ముగ్గరే ఉంటున్నారని అన్ని పనులు వారే చేయడం చాలా భారంగా ఉంటుందన్నారు. మెస్ బిల్లులు జూలై నుంచి పెండింగ్లో ఉన్నాయని వెంటనే విడుదల చేయాలని జాజుల కోరారు.

## చట్టాలపై అవగాహణ సదస్సు

### మాట్లాడుతున్న థర్డ్ ఏడిజె, ఫ్యామిలీ కోర్టు జడ్జ్ దుర్గ ప్రసాద్

**నల్లగొండ, నవంబర్ 23 (వెలుతురు):** శనివారం రోజున నల్గొండ పట్టణంలోని అరోర లీగల్ సైన్సెస్ ఇన్స్టిట్యూట్ న్యాయ కళాశాల ప్రిన్సపల్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నల్గొండ గారి సహకారంతో కళాశాలలో లీగల్ సర్వీసెస్ అథారిటిపై అవగా




హణ కల్పించి న్యాయ సదస్సు నిర్వహించడమైనది, ఈ సదస్సులో థర్డ్ ఏడిజె మరియు ఫ్యామిలీ కోర్టు జడ్జ్ దుర్గ ప్రసాద్ గారు మాట్లాడుతూ విద్యార్థులకి లీగల్ సర్వీసెస్‌పై కోర్టు వ్యవహారాలపై విస్తృతమైన అవగాహన కల్పించారు, మరియు %ఖూూా% సెక్రటరీ, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ బి.దీప్తి, NALSA స్కీమ్స్ గురించి వివరిస్తూ, న్యాయవాద వృత్తిలో పాటించవలసిన నియమాలను క్లుప్తంగా వివరించారు, ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యాదగిరి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ధనలక్ష్మి, శ్రీనివాస్, కళాశాల విద్యార్థులు, జిల్లా కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా సదస్సును జయప్రదం చేయండి

### రజక వృత్తిదారుల సంఘం మండల కన్వీనర్ రాచకొండ రమేష్

**సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 23 (వెలుతురు):**
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ఈనెల 26న నిర్వహించే తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం మండల కన్వీనర్ రాచకొండ రమేష్ కోరారు.శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆ సంఘం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలన్నారు. రజకులకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు ఇవ్వాలన్నారు.కులవృత్తి అంతరించిపోతుండడంతో బతికే



భారంగా మారుతున్న రజకులకు స్వయం ఉపాధి పథకాలు ప్రవేశపెట్టాలన్నారు.ఈనెల 26 న భువనగిరి పట్టణ కేంద్రంలో పెన్షనర్ల భవనంలో జరిగే ఈ సదస్సుకు తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైల్ల ఆశయ హాజరవుతారన్నారు. రజకులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుపై చర్చిస్తారన్నారు.రజకులు సామాజికంగా, రాజకీయంగా ఎదగడానికి ఉపయోగపడే పలు అంశాలను సదస్సులో చర్చిస్తారన్నారు.ఈ సదస్సుకు అధిక సంఖ్యలో రజకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కడ్తాల భిక్షం తో పాటుపలువురు రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



## మహారాష్ట్ర గెలుపుపై

# కరీంనగర్లో బీజేపీ శ్రేణుల సంబరాలు..

### మరాఠా ప్రజలు ఎన్డీఏ మోడీ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారు...

### మోడీ ఇచ్చిన ఏక్ హైతో సేఫ్ హై నినాదాన్ని విజయవంతం చేశారు..

### కాంగ్రెస్ కుల, మత రాజకీయాలను వ్యతిరేకించారు..

### బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి..

**కరీంనగర్, నవంబర్ 23 (వెలుతురు):**
మహారాష్ట్రలో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడం పట్ల శనివారం రోజున కరీంనగర్ బిజెపి జిల్లా శాఖ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో భారీ సంబరాలు నిర్వహించింది. డప్పు లు వాయించి, టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేసింది. ఇట్టి సంబరాల్లో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ యావత్ దేశం మహారాష్ట్ర ఎన్నికల వైపు చూసిందని , ఉత్కంఠ పోరులో మరాఠా ప్రజలంతా మోడీ ఎన్డీఏ ప్రభుత్వం పైనే విశ్వాసముంచి ఘనవిజయాన్ని అందించినందుకు కరీంనగర్ బిజెపి జిల్లా శాఖ పక్షాన ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ కూటమి తప్పుడు ప్రచారాలు, కుల, మత రాజకీయాలను మహారాష్ట్ర ప్రజలు తిప్పి కొట్టారని , ఈ ఫలితాలు కాంగ్రెస్ కూటమికి చెంపపెట్టు లాంటివన్నారు. ముఖ్యంగా మారాట ప్రజలు కులగనను వ్యతిరేకించారని , ప్రధాని మోడీ ఇచ్చిన ఏక్ హై తో సేఫ్ హై నినాదాన్ని విజయవంతం చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని, కేవలం ఉచిత పథకాలు, అడ్డగోలు హామీలతో ప్రజలను నమ్మించి మోసం చేసి తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటకలో మాత్రమే రాజ్యమేలుతుందన్నారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి రాష్ట్రాలను దివాలా తీయిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. దేశవ్యాప్తంగా ఎన్డీఏ ప్రభుత్వ గ్రాఫ్ పెరిగిందని , ప్రజలంతా మోడీ ప్రభుత్వంపై విశ్వాసం నమ్మకంతో ఉన్నారని తెలిపారు.
ఇట్టి సంబరాల్లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, మాడ వెంకటరెడ్డి, కార్పొరేటర్లు పెద్దపెల్లి జితేందర్, కొలగాని శ్రీనివాస్, పవన్, బండ రమణారెడ్డి మీడియా కన్వీనర్ కటకం లోకేష్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, సత్యనారాయణ రెడ్డి, ఏన్నం ప్రకాష్, రాజిరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, బండారు గాయత్రి, శిల్ప వేదం, వరాల జ్యోతి, పుప్పాల రఘు, శ్రీనివాస్ , ప్రవీణ్ రెడ్డి, సుధాకర్, లడ్డు ముండద, రాజు, శివానందం, మొండన్న తదితరులు పాల్గొన్నారు.

### నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి పుణ్యక్షేత్రమైన మీనాక్షి అగస్తేశ్వరస్వామి దేవాలయ

## భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ జరిపించాలి



**- జాజుల లింగంగౌడ్**

**హైదరాబాద్, నవంబర్ 23 (వెలుతురు):**
వాడపల్లి శ్రీ మీనాక్షి అగస్తేశ్వర స్వామి దేవాలయం (శివాలయం) వాడపల్లి ఆలయానికి సంబందించిన దేవదాయ ఇనామ్ భూమి సర్వే నెంబర్ 509,510లో 8 ఎకరాల 22 గుంటల భూమి ఉంది. ఆ యొక్క భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై విచారణ జరిపించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.
ఈ భూమి 1818 లో స్వయంభుగా ఏర్పడిన ఈ దేవాలయం కి అభివృద్ధి కి దేవుని పూజలకు సేవకుల జీవనం కోరకు అప్పటి రెడ్డి రాజులు ఈ భూమిని దానంగా ఇచ్చిన భూమి. ఈ భూమి పూజరుల క్రింద ఉంది. 1954 లో ఇనామ్ చట్టం తీసివేసి ఇనామ్ భూమి ని ప్రభుత్వ భూమి గా కొంత మంది కి ఇనామ్ దారులు గా గుర్తించి వారి కి పాస్ బుక్ లు ఇచ్చారు.
అలా 1954 లో కసరా పహాణి నుండి 1996 వరకు దాచారం సత్యనారాయణ శాస్త్రి( గుడి పూజారి) పేరు మీద రెవిన్యూ రికార్డు లో వస్తుంది ఆయన కి అప్పటి ప్రభుత్వం పాస్ బుక్ లు కూడ ఇచ్చింది.
1981లో రాశి సిమెంట్ వారు 1981 నుండి 20 సంవత్సరాలు భూమి లీజు కి తీసుకున్నారు అంటే 2001 వరకు ఈ లీజు ని రిజిస్ట్రేషన్ ఆఫిస్ లో రిజిస్టర్ ద్వారా డాక్యుమెంటరీ ద్వారా చేశారు ఆ లీజు దాచారం సత్యనారాయణ ఆయన కుమారులు ముగ్గురుతో డాక్యుమెంట్ చేయించుకున్నారు.
2000 సంవత్సరంలో దేవాదాయ ఈవో కంపెనీ యాజమాన్యం ప్రభుత్వ నికి అధికారులకు తప్పుడు నివేదికలు ఇచ్చి అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు.
దీనిపై సమగ్ర విచారణ జరిపి అన్యాక్రాంతం అయిన భూమిని తిరిగి దేవాదాయ శాఖ తీసుకోవలి అని లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కల్లుగీత కార్మికుడి కుటుంబానికి

# గోపా డివిజన్ అధ్యక్షుడు సమ్మి గౌడ్ పరామర్శ

### కల్లుగీత కార్మిక కుటుంబాలకు సమ్మి గౌడ్ సేవలు అభినందనీయం

### కేజీ కేఎస్ రాష్ట్ర సభ్యులు కేసముద్రం మండల అధ్యక్షులు ఉప్పలయ్య

### అనంతరం ఉపేంద్ర కుటుంబానికి 75 కేజీల బియ్యం నెలసరి నిత్యావసర వస్తువులు అందజేత

**కేసముద్రం, నవంబర్ 23 (వెలుతురు):**
కేసముద్రం మండలం అప్పణ పల్లి గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికుడు కందాల వెంకటయ్య భార్య కందాల ఉపేంద్ర ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఉపేంద్ర భర్త వెంకటయ్యను కుమారులు రమేష్ శ్రీకాంత్ కుమార్తెలు సుభద్ర సుగుణ రజితలను పరామర్శించి ఉపేంద్ర పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్.అనంతరం వారి కుటుంబానికి 75 కేజీల బియ్యం నెలకు



సరిపడా నిత్యవసర వస్తువులను అందజేసి వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని అన్నారు.ఈ సందర్భంగా కేజీ కేఎస్ రాష్ట్ర సభ్యులు కేసముద్రం మండల కేజీ కేఎస్ అధ్యక్షులు
డబ్బులు ఉప్పలయ్య మాట్లాడుతూ ఏ గ్రామం లోనైనా సరే గౌడ కుటుంబాలు ఆపదలో ఉంటే విషయం తెలిసిన వెంటనే సమ్మయ్య గౌడ్ సహాయం అందించడం, ప్రతి కుటుంబం లో ఒక సభ్యుడిగా ఉంటూ వారికి చేదోడు వాదోడుగా ఉంటున్న సమ్మయ్య గౌడ్ మంచితనాన్ని, ఔన్నత్యాన్ని అభినందిస్తూ కృతజ్ఞతలు



తెలిపారు..
ఈ పరామర్శలో సమ్మిగౌడ్ వెంట ఎర్రం శెట్టి అశోక్,కొండేటి కళాధర్, పబ్బతి ప్రశాంత్ గౌడ్, మోడం రాజు,గంధసిరి బుచ్చి రాములు,మాజీ సర్పంచ్ గంధసిరి వెంకన్న,సారయ్య వెంకటమల్లు వెంకన్న సాంబయ్య శ్రీను వెంకటాద్రి యాదగిరి వెంకన్న ప్రభాకర్ సుధాకర్ విజేందర్ అశోక్ హరీష్ ఎస్కే జానీ ఎస్‌కే సైదులు తదితరులు పాల్గొన్నారు

## 28న స్ట్రక్చర్ మీటింగ్‌లో

# పెండింగ్‌లో ఉన్న కార్మిక సమస్యలను చర్చిస్తాం..

**- ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి వైవి రావు**

**గోదావరిఖని, నవంబర్ 23 (వెలుతురు):**
ఈనెల 28న స్ట్రక్చర్ మీటింగ్‌లో పెండింగ్‌లో ఉన్నకార్మికుల సమస్యలతోపాటు ఈ పి,ఆపరేటర్ల సమస్యలను చర్చించను న్నామని ఏఐటీయూసీ, ఉప ప్రధానకార్యదర్శి వైవీ.రావు,కేంద్ర కార్యదర్శి కె.స్వామి తెలిపారు.గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలోవారు మాట్లాడుతూ సింగరేణిలోగత 10 సంవత్సరాల కాలంగా కార్మికుల సమస్యలపై కమిటీ సమావేశాలు, స్ట్రక్చర్ మీటింగ్ జరగకపోవడం మూలంగాచాలా సమస్యలు పెండింగ్ లోఉన్నాయని,వాటిని తాము28న డైరెక్టర్లతో జరిగేస్ట్రక్చర్ మీటింగ్ లోచర్చించనున్నమని తెలిపారు.ముఖ్యంగా ఈ పి,అపరేటర్లకు గత 10సంవత్సరాలుగా ప్రమోషన్లు కల్పించ కుండా పెండింగ్ లో ఉంచారని,ఎన్ మైనస్ పేరిటకటింగ్, పెడుతున్నప్లేడేలు, పీహెచ్‌ఓ,లు కల్పించాలని, మెడికల్ అన్ఫిట్ అయినఈపి,ఆపరేటర్లకుశుటబుల్ జాబ్ ఇవ్వాలని,ఇన్సెంటివ్ అమలుచేయాలని తదితరడిమాండ్లను యాజమాన్యం ముందుపెట్టనున్నమని తెలిపారు. యాజమాన్యం అంగీకరించని పక్షంలోసింగరేణి వ్యాప్తంగా19 ఓసిలలోఈపి, ఆపరేటర్లను




కదిలించిపోరాటాలకు సిద్ధంచేస్తామని హెచ్చరించారు.అలాగే పెండింగ్ లోఉన్న పెర్క్స్ పై ఇన్కమ్ టాక్స్ రద్దు,సొంతింటి కల తదితర సమస్యలపై చర్చిస్తామని వెల్లడించారు. ఈ విలేఖరుల సమావేశంలో ఏఐటీ యుసి నాయకులు జూపాక రాంచందర్, కందుకూరి రాజారత్నం,జీగురు రవిందర్, ఎం రాంచంద్రారెడ్డి, గండి ప్రసాద్, గుర్రం ప్రభుదాస్, ఏలేశ్వరం సత్యనారాయణ, బొల్లం రాంమోహన్, గంగాధర్ ,వేముల రమేష్, ఎన్.రమేశ్, భక్తి శ్రీనివాస్,బుడిమె సమ్మయ్య, పాల్గొన్నారు.



## ఏసిపి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సెక్యూరిటీ జిఎంలక్ష్మీనారాయణ

**గోదావరిఖని, నవంబర్ 23 (వెలుతురు):**
సెక్యురిటి నూతన జియం,గాపదవి బాధ్యతలు చేపట్టట్టిన,సి.హెచ్,లక్ష్మీనారాయణ, రామగుండం ఏరియా-1కువచ్చిన సందర్భంగాఎసిపి కార్యాలయం నందు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ యం. రమేష్,ఎసిపి,ని మర్యాదపూర్వకంగా కలిసిపుష్ప గుచ్చం అందజేయటం జరిగింది. ఈసందర్భంగా సెక్యురిటి నూతన జియం, సి.హెచ్, లక్ష్మీనారా యణ, తెలియజేస్తూ సింగరేణి సంస్థకు సంబంధించిన రక్షణ భద్రత విషయంలో, సింగరేణిఆస్తులను కాపాడటంలో సింగరేణి సెక్యూరిటీ డిపార్ట్మెంట్ కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సెక్యురిటి అధికారి వీరారెడ్డి, జూనియర్ఇన్స్పెక్టర్ , మహమ్మద్ అక్బర్ అలీ సెక్యురి టిసిబ్బంది, పాల్గొన్నారు.

## ప్రతి ఆడబిడ్డకు అండగా ప్రభుత్వం

### సీఎంఆర్ ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మక్కన్ సింగ్

**గోదావరిఖని, నవంబర్ 23 (వెలుతురు):**
ప్రతి ఆడబిడ్డకు అండగా ప్రభుత్వం ఉంటుంది ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్, అన్నారు. శనివారం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ ఎఫ్, 235 మంది లబ్ధిదారులకు, రెండు కోట్ల 35 లక్షల 27 వేల రెండు వందల అరవై



రూపాయల చెక్కును ఎమ్మెల్యే మక్కన్ సింగ్, కల్యాణ లక్ష్మి & షాద్ ముబారక్, చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేమాట్లాడుతూ

రామగుండం మండలంలోని పలు గ్రామాల లబ్ధిదారులు అయినటువంటి 235 మంది లబ్ధిదారులకు 2,35,27,260 ( రెండు కోట్ల ముప్పై ఐదు లక్షల ఇరవై ఏడు వేల రెండు వందల అరవై) రూపాయల విలువగల కల్యాణ లక్ష్మి%డ%షాదిముబారక్ చెక్కులనుపంపిణి చేశారు.అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ

కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, పేదల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెడుతుందని చెప్పారు.కాంగ్రెస్ పేదలప్రభుత్వమని, రాష్ట్రంలోనిపేద వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వంఅండగా ఉంటుందన్నారు. పేదలకు సంక్షేమ పథకాలుఅందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిందని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే ఇటు కార్పొరేషన్ అభివృద్ధి కోసం అనేక కార్యక్ర మాలు చేపట్టడం జరుగుతుంది. ఇవన్నీ యేడాది పాలన గడవకముందే ప్రజలకుఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కార్పొ రేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సంస్కృతభాష సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్, నవంబర్ 23 (వెలుతురు):**
సంస్కృత భాష సంవత్సర సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేయుటకు 2024-25 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్కృత అధ్య యన కేంద్రం కోఆర్డినేటర్ డా. ఎం.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఢిల్లీ ఆధ్వర్యంలో స్థానిక మహిళా డిగ్రీ కళాశాలలో మరియు డైట్ కళాశాలలో సంస్కృత భాష సర్టిఫికెట్ కోర్సుకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన వివరించారు.

సంస్కృత భాష పరిచయం లేనప్పటికీ, సంస్కృతం నేర్చుకోవాలని ఆసక్తి కలిగిన 15 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరూ ఈ సర్టిఫికేట్ కోర్సుకు అర్హులని చెప్పారు. గృహి ణులు, విద్యార్థులు, భాషా అభిమానులు, రిటైర్డ్ అయిన ఉద్యోగులు అధిక సంఖ్యలో ఈ కోర్సులో చేరి సంస్కృత భాష వ్యాప్తికి తోడ్పడాలని కోరారు. పూర్తి వివరాలకు సంస్కృత అధ్యయన కేంద్ర శిక్షిక లెక్కల రమని 8897393860 ఫోన్ నంబర్లో సంప్రదించ వచ్చని తెలిపారు.

## హయత్ నగర్‌లో వాహన తనిఖీలు

**హయత్ నగర్, నవంబర్ 23 (వెలుతురు):**
వాహనాలకు సరిగా నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని వనస్థలిపురం ట్రాఫిక్ ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.శని వారం హయత్ నగర్‌లో వాహనాల



తనిఖీ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బైక్ నంబర్లు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలకు వెనుకాడబోమని ఎస్ ఐ వెంకటేష్ హెచ్చరించారు. అలాగే బైక్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన సూచించారు .ఈ సందర్భంగా వాహనాలకు సంబంధించి పత్రాలు లేని వాహనాలను గుర్తించి వాటికి. అలాగే లైసెన్స్ లేని వాహనదారులకు జరిమానాలు విధించారు. ఈ వాహన తనిఖీ లో పలువురు ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

### రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు

### ప్రతి రైతుకు ప్రభుత్వం ద్వారా అందే సహాయాన్ని వివరిస్తూ గ్రామాలలో బోర్డులు ఏర్పాటు

### ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి శ్రీధర్ బాబు



**పెద్దపల్లి, నవంబర్ 23 (వెలుతురు):**
ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని, సన్నాలకు బోనస్ ఎంత పడిందో ప్రజలకు తెలియజేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు.

శుక్రవారం రాత్రి మంత్రి శ్రీధర్‌బాబు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలుపై ప్రభుత్వ విప్ అడ్లూరు లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, పెద్దపల్లి రైతుల జిల్లా అని , ఇక్కడ పరిస్థితులు చాలా సున్నితంగా ఉంటాయని, ఇక్కడ ఎటువంటి ఇబ్బందులు రావద్దని అన్నారు. ధాన్యం కొనుగోలు అంశంలో ప్రభుత్వం చేస్తున్న పని క్షేత్రస్థాయిలో రైతులను కనెక్ట్ అయ్యేలా చూడాలని మంత్రి ఆదేశించారు. సన్న వడ్లకు 500 రూపాయల బోనస్ ప్రకటించడంతో రైతులకు అధికంగా లాభం చేకూరుతుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాల ద్వారా ప్రతి రైతు ఎంత లబ్ధి పొందుతున్నాడు వివరాలతో గ్రామాలలో బోర్డులను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. రైతులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ప్రాధాన్యతను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, 2 లక్షల రుణమాఫీ, సన్న రకం వడ్లకు 500 రూపాయల బోనస్ పథకాల లబ్ధి పొందుతున్న రైతులతో వీడియోలు చేసి ప్రచారం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. సన్న రకం వడ్లకు బోనస్ పడుతుంది అనే అంశం రైతులకు తెలిసేలా చేయాలని, ప్రతి రోజు సన్న రకం వడ్ల బోనస్ ఎంత వస్తుందో ప్రచారం కల్పించాలని అన్నారు. మనం చేసే కష్టం క్షేత్రస్థాయిలో అందరికీ తెలియజేయాలని మంత్రి పేర్కొన్నారు. రైస్ మిల్లర్లకు సంబంధం లేకుండా ట్రక్ షీట్ జనరేట్ అయ్యే విధంగా చూడాలని, రైతులకు ఎక్కడ కోతలు విధించడానికి వీలు లేదని మంత్రి తెలిపారు. రైతులను ఎట్టి పరిస్థితులలో దోపిడీకి గురి చేయడానికి ఆస్కారం ఇవ్వవద్దని మంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు చేసిన ధాన్యంలో దాదాపు ఇప్పటివరకు 80 శాతం మేరకు దాన్యం నగదు చెల్లించడాన్ని మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు.

జిల్లాలో 51 వేల 827 రైతులకు 372 కోట్ల 59 లక్షల రూపాయలు రుణమాఫీ పూర్తి చేశామని అన్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్, రేషన్ కార్డ్ వంటి సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కానీ రైతులకు కూడా త్వరలో రుణమాఫీ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలం 82 శాతం మేర సన్న రకం వడ్ల పంట వస్తుందని అన్నారు. రైతులకు సన్న రకం వడ్ల బోనస్ వల్ల అధికంగా లబ్ధి చేకూరుతుందని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో తేమ శాతం వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి 24 గంటల వ్యవధిలో రైస్ మిల్లులకు తరలించి ఓపిఎంఎస్ వెబ్ సైట్ లలో నమోదు చేస్తున్నామని , ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు త్వరితగతిన చెల్లింపులు జరిగేలా చూస్తున్నామని అన్నారు.

యూనియన్ బ్యాంకులో 3 వేల రైతులకు సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీ కాలేదని, ఈ అంశాన్ని ఉన్నతాధి కారుల దృష్టికి తీసుకొని వెళ్ళామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి ,జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ , జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ శ్రీకాంత్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### 8 కోట్ల 46 లక్షల రూపాయల సన్నరకం వడ్ల బోనస్ సోమ్ము

# రైతుల ఖాతాలలో జమ..

### అదనపు కలెక్టర్ డి.వేణు.

### 48 గంటల వ్యవధిలో రైతులకు ధాన్యం డబ్బులు అందిస్తున్నాం

### ధాన్యం కొనుగోలుపై పత్రికా సమావేశం నిర్వహించిన అదనపు కలెక్టర్



**పెద్దపల్లి, నవంబర్ 23 (వెలుతురు):**
పెద్దపల్లి జిల్లాలో సన్న రకం వడ్ల కు బోనస్ కింద ఇప్పటి వరకు 8 కోట్ల 46 లక్షల రూపాయలు చెల్లించడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు తెలిపారు.

శనివారం అదనపు కలెక్టర్ డి.వేణు సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ధాన్యం కొనుగోలుపై పత్రికా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి.వేణు మాట్లాడుతూ, పెద్దపల్లి జిల్లాలో 329 ధాన్యం కొనుగోలు ప్రతిపాదించి, 320 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని, ఇప్పటివరకు 268 కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు ప్రారంభమైందని అన్నారు. రామగుండం, మంథని మొదలగు ప్రాంతాలలో కోతలు ఆలస్యంగా జరుగుతాయని, అక్కడ మినహా ప్రతి చోట దాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైందని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 12 వేల 829 మంది రైతుల నుంచి 189 కోట్ల 15 లక్షల రూపాయల విలువ గల 81 వేల 537.94 మెట్రిక్ టన్నుల (దొడ్డు రకం 31 వేల 701, సన్న రకం 49 వేల 836) కోనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేశామని, రైతులకు 80 శాతం మేర అనగా 151 కోట్ల 20 లక్షల రూపాయల ధాన్యం డబ్బులు వారి ఖాతాలలో జమ చేశామని తెలిపారు.

సన్న రకం ధాన్యం క్వింటాలు ధాన్యానికి ప్రభుత్వం 500 రూపాయల బోనస్ ప్రకటించిందని, జిల్లాలో ఇప్పటి వరకు 4051 మంది రైతులకు 15 కోట్ల 34 లక్షల రూపాయలు బోనస్ ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేసామని, ఇప్పటి వరకు 8 కోట్ల 46 లక్షల బోనస్ రైతులకు చెల్లించిందని అన్నారు.

ప్రతి మండలానికి 2 ప్రత్యేక అధికారులను నియమించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పర్యవేక్షిస్తున్నామని, రైతులకు ఎటు వంటి ఇబ్బందులు కల్గకుండా ధాన్యం కొనుగోలు చేపట్టామని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 33 రకాల సన్న రకం ధాన్యాన్ని వ్యవసాయ అధికారులు సర్టిఫై చేస్తున్నారని అన్నారు.

ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ప్యాడ్ క్లీనర్, తేమ యంత్రాలు, 334 హజ్ క్లీనర్, అవసరమైన గన్ని సంచులు అందుబాటులో పెట్టామని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు విద్యుత్ సౌకర్యం కల్పించామని అన్నారు. ఈ సమా వేశంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ కమీషనరేట్‌లో ‘మాబ్ ఆపరేషన్’ మాక్ డ్రిల్ ప్రాక్టిస్

### శాంతిభద్రతలను పరిరక్షించటమే మాబ్ ఆపరేషన్ డ్రిల్ ముఖ్య లక్ష్యం.



**గోదావరిఖని, నవంబర్ 23 (వెలుతురు):**
అక్రమంగా గుమ్మిగుడిన జన సమూహాలను కంట్రోల్ చేయు టకు, అవాంఛనీయ సంఘటనలు పోలీసుల దృష్టికి వచ్చినప్పుడు, (144) 163 బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ అమల్లో ఉన్న సందర్భంలో ప్రజల శాంతి భద్రతల నేపథ్యంలో పోలీసులు ఏ విధంగా స్పందించాలి, అక్రమ జన సమూహాలను ఏ విధంగా చెదర గొట్టాలి అనే వ్యూహంలో భాగంగా రామగుండము పోలీస్ కమీషనర్ ఎం.శ్రీనివాస్ ఆదేశాల మేరకు రామగుండము పోలీస్ కమీషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో ఎఆర్ ఎసిపి సుందర్ ఆధ్వర్యంలో గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సివిల్, ఎఆర్ పోలీసులకు మాబ్ ఆపరేషన్-మాక్ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహించారు.

ప్రజల, ప్రభుత్వ ఆస్తులు ద్వంసం చేస్తూ విధ్వంసానికి పాల్పడుతున్న సందర్భాల్లో సమయస్ఫూర్తితో వ్యవహరిస్తూ, జన సమూహాలను నియంత్రించి శాంతిభద్రతలను ఎలా నియంత్రిం చాలన్న వాటిపై మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ ప్రాక్టీస్ ముఖ్య ఉద్దేశాన్ని సిబ్బందికి ఏసీపీ వివరించారు. మాబ్ ఆపరేషన్ డ్రిల్‌లో ఓ వైపు ప్లకార్డులు చేతపట్టిన ఆందోళన కారులు, అల్లరి మూకలు మరోవైపు వారిని ఎదుర్కొనేందుకు సిద్ధమైన పోలీసులు జన సమూహాలను కంట్రోల్ చేసేందుకు మొదటగా హెచ్చరికలు వినకపోతే మెజిస్ట్రేట్ అనుమతి, ఉన్నతాధికారుల అనుమతితో భాష్పవాయువు ప్రయోగించడం, ఆ తర్వాత ఫైర్ డిపార్ట్మెంట్ వారితో వాటర్ కెనాన్ వారిపై ప్రయోగించడం, ఉద్రిక్త పరిస్థితుల్లో తనను తాను రక్షించుకుంటూ లాఠీ ఛార్జ్ చేపట్టడం, ప్లాస్టిక్ పెల్లెట్స్ ఫైరింగ్ చేయడం అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోతే ఫైరింగ్ చేయడం వంటివి ఆర్ఐ దామోదర్, మల్లేశం, సంపత్ లు అర్మ్డ్ సిబ్బంది డెమో ప్రదర్శన చేపించి తరువాత గోదావరిఖని, పెద్దపల్లి సబ్ డివిజన్ సివిల్ సిబ్బందితో ప్రాక్టిస్ చేపించడం జరిగింది.

మాబ్ ఆపరేషన్ మాక్‌డ్రిల్ ముఖ్య ఉద్దేశం శాంతి భద్రతలకు విఘాతం కలిగినప్పుడు, ఘర్షణలు తలెత్తినప్పుడు శాంతిభద్ర తలను పరిరక్షించడానికి పోలీస్ శాఖ ఎలా వ్యవహరిస్తుంది? ఘర్షణలకు పాల్పడిన వారిపై ఏవిధంగా చర్యలు తీసుకుంటారు? అనే దాని గురించి అవగాహన కల్పించేందుకు మాక్ డ్రిల్ నిర్వహించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఏ ఆర్ ఏసీపీ సుందర్ రావు, గోదావరిఖని 2 టౌన్ సీఐ ప్రసాద్ రావు, గోదావరిఖని 2 టౌన్ ఇన్స్పెక్టర్, ఆర్ఐ లు దామోదర్, మల్లేశం, సంపత్, గోదావరిఖని సబ్ డివిజన్ ఎస్ఐ లు, పెద్దపల్లి సబ్ డివిజన్ ఎస్ఐ లు, ఆర్ఎస్ఐ లు అనిల్, పోచలింగం, ఏ ఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వోడితల ప్రణవ్ ఎవరు..? ప్రజా ప్రతినిధా..? ప్రభుత్వ ప్రతినిధా..?

### ప్రణవ్‌కు ఏ ప్రోటోకాల్ ప్రకారం పోలీసు భద్రత, బందోబస్తు కల్పించారు...?

### అసలు ఆయన సి ఎం ఆర్ ఏఫ్ చెక్కులు ఎలా పంపిణీ చేస్తారు..?

### చెక్కులు ప్రభుత్వానివా.. లేక కాంగ్రెస్ పార్టీ వా..?

### - బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

**హుజురాబాద్, నవంబర్ 23 (వెలుతురు):**
హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ నేత వోడితల ప్రవీణ్ కుమార్ సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడాన్ని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తీవ్రంగా తప్పు పట్టారు. శనివారం రోజున ఆయన మాట్లాడుతూ సీఎంఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన వోడితల ప్రణవ్ అసలు ఆయన ఎవరని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిదా లేక కాంగ్రెస్ ప్రభుత్వం నామినేట్ చేసిన వ్యక్తా..? అనే విషయం తెలియడం లేదని, . ఎందుకంటే వీణవంకలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ సందర్భంగా ఏ ప్రోటోకాల్ ప్రకారం ప్రణవ్‌కు పోలీస్ ఎస్కార్ట్, బందోబస్తు కల్పించిందనే విషయం ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు ప్రభుత్వానివా లేక , కాంగ్రెస్ పార్టీ వా అనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తులు వాళ్ల ప్రభుత్వం అధికారంలో ఉందని, అధికారులను చెప్పు చేతుల్లో పెట్టుకొని ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రభుత్వ అధికారులు పార్టీ వ్యక్తుల కోసం పనిచేయడంపై ఆత్మ విమర్శన చేసుకోవాలన్నారు . ఎలాంటి అర్హత లేకుండా ప్రభుత్వ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేసిన వోడితల ప్రణవ్ పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తామని గంగాడి కృష్ణారెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమం లో వీణవంక మండల బీజేపీ అధ్యక్షులు ఆదిరెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సింహరాజు, బీజేపీ సీనియర్ నాయకులు పెద్ది మల్లారెడ్డి, ముత్యాలరవీందర్, ఐ టి సెల్ కన్వీనర్ వినోద్,ఎనగంటి శ్రీనివాస్, మంతెన శ్రీనివాస్, శివరాత్రి శంకర్,నవీన్, హరీష్, శివ, సదానందం తదితరులు పాల్గొన్నారు...





## మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను కలిసిన అంబేద్కర్ సంఘం నాయకులు

గోదావరిఖని, నవంబర్ 23 (వెలుతురు):
మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో, శుక్రవారంసాయంత్రం రామగుండం మాజీ శాసనసభ్యులు, బిఆర్ఎస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు,కోరు కంటి చందర్ ని, మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది, గోదావరిఖని పట్టణంలోని తన నివాసంలో కలిసి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, రాసిన భారత రాజ్యాంగం ఆమోదం, పొంది75సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో నవంబర్ 26 నుండి డిసెంబర్ 6 వరకు, చేపట్టే,పలు కార్యక్రమాలలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించడం జరిగింది,మాజీ శాసనసభ్యులు కోరు కంటి చందర్ అన్న, బిఆర్ఎస్, పార్టీ నాయకులు, శ్రీ,పర్లపెల్లి రవి, నారాయణదాసు మారుతి,ని,కలిసిన వారిలో సీనియర్ జర్నలిస్టు,ఎస్సీఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బొంకూరి మధు,జాతీయ కార్యదర్శి, కొంకటి లక్ష్మణ్,టిఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ,పర్లపల్లిరవి, నారాయణదాసు మారుతి,చెలక పల్లి శ్రీనివాస్, తెలంగాణ అంబేద్కర్ భవన నిర్మాణ కమిటీ చారిటబుల్ ట్రస్ట్ వైస్ చైర్మన్,శనిగరపు రామ స్వామి ,ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్ల కమిటీ సభ్యులు, ఎండి నవాబు,టిఆర్ఎస్ నాయకులు చింటూ,ఇరువురాల శ్రావణ్,తాండ్ర సంతోష్ కొమ్ము మహేందర్, ఉన్నారు,

## బోసుపల్లి ప్రతాప్‌ని సన్మానించిన కార్పొరేటర్, ప్రెసిడెంట్‌లు

గడ్డిఅన్నారం, వెలుతురు నవంబర్ 23:
శనివారం నాడు తెలంగాణ బిజెపి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు బోసుపల్లి ప్రతాప్ ను సన్మానించిన ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి( కార్పొరేటర్), దాసరి జయ ప్రకాష్ డివిజన్



బిజెపి ప్రెసిడెంట్, మిరియం బాబు రావు, పద్మజ దార, తదితరులు ఈ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.




## అనంతగిరి భగవంతుని ప్రసాదం

- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్
- వికారాబాద్ రూరల్ మండలం అనంతగిరి అటవీ ప్రాంతంలో అనంతగిరి అర్బన్ ఫారెస్ట్ పార్క్‌కు శంకుస్థాపన, భూమి పూజ చేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్
- రూ. 25 లక్షలతో నూతనంగా నిర్మించిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి కార్యాలయాన్ని ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్ కుమార్

హైదరాబాద్ నవంబర్ 23, (వెలుతురు):
అనంతగిరి అటవీప్రాంతాన్ని అన్ని విధాలుగా పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఈ అనంతగిరి భగవంతుని ప్రసాదం. అందమైన ప్రదేశం. అనంతగిరిని రూ. 300 కోట్ల రూపాయలతో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి రెండు విదేశీ కంపెనీలు ఇచ్చిన ప్రెజెంటేషన్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేను చూశాం, త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం.



అనంతగిరి పర్యావరణానికి హాని కలగకుండా అన్ని వసతులతో ఈకో టూరిజంగా అభివృద్ధి చేస్తాం. అనంతగిరిలో అన్ని వసతులతో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడంతో ఈ ప్రాంతంలోని వారికి ఉపాధి కలుగుతుంది.

గత ప్రభుత్వం అనంతగిరి గుట్టపై మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలనుకున్నది. కానీ ఇక్కడ పర్యావరణానికి ఇబ్బందులు కలుగుతాయనే ఉద్యేశంతో మెడికల్ కాలేజీని వికారాబాద్ పట్టణం సమీపంలో మెటల్ గండి లో నిర్మిస్తున్నాం.

తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కష్టపడుతున్నారు. కానీ గత ప్రభుత్వం పది సంవత్సరాలలో చేసిన అప్పులు ఇప్పుడు అభివృద్ధికి అడ్డంపడుతున్నాయి. రైతు రుణమాఫీపై ప్రతి పక్షాలు లొల్లి చేస్తున్నాయి. అర్హులైన రైతులకు అందరికీ రుణమాఫీ అందుతుంది, రైతులకు నా విజ్ఞప్తి. ప్రతిపక్షాల మాయలో పడొద్దు.

2004 దేశంలో UPA ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు డెబ్బై వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ కోసం బడ్జెట్‌లో 31,000 కోట్ల రూపా యలను కేటాయించింది. ఇప్పటికే 18,000 కోట్లను రైతు రుణమాఫీ అమలుకు ఖర్చు చేసింది. ఇంకా ఎంత అవసరమైనా ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నది. జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (చార్మి నార్ సర్కిల్) ప్రియాంక వర్గీస్, జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్,అటవీశాఖ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు .

## ప్రభుత్వ మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికై
# ఎమ్మెల్యేకీ విజ్ఞాపన పత్రం అందించిన ఎఐటియూసి

ంగోదావరిఖని, నవంబర్ 23 (వెలుతురు):
గోదావరిఖని ప్రభుత్వ మెడికల్,కాంట్రాక్టు కార్మికులసమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తిచేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలోశనివారం, స్థానిక శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్‌కి విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం గోదావరిఖని క్యాంపు ఆఫీసులోఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లాజనరల్ సెక్రెటరీ కడారిసునీల్, ఎమ్మెల్యేకి కాంటాక్ట్ కార్మికుల సమస్యలు వివరిస్తూ కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత అధిక పని భారం, వారంవారం డ్యూటీ లోమార్పు అదనపు,స్కావెంజర్ పనులు పురమాయింపు, విధులనిర్వహణ గురించిజరుగుతున్న విషయాలపై, శాసనసభ్యుల, దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే సంబం ధించిన కాంట్రాక్టర్‌కి చరవాణిలో మాట్లాడుతూ ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని. నెలనెల డ్యూటీలు క్లోజ్ చేసి వారంవారం వేయాలని స్వీంజర్స్ కార్మికులు చేసేపనిని వారితోనే చేయించాలని, చెప్పడం జరిగింది.

సమస్యలు చెప్పగానే వెంటనే స్పందించిన, ఎంఎల్ఏకి



ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్ట్, కార్మికుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతధన్య వాదాలు తెలియజేస్తూ శాలువాతో సన్మానం చేయడం జరిగింది.

ఈ కార్యక్రమంలో కార్మికనాయకులు శనిగల శ్రీనివాస్, వైనల రవి, ఐలమ్మ, నర్మదా, శేఖర్, ప్రవీణ్, ఎలక రాంబాబు, శ్యామల, లలిత, మల్లమ్మ, హసీనా, రాజేందర్, లక్ష్మి పాల్గొన్నారు.

# అసిఫాబాద్ జిల్లాలో అరుదైన ఇండియన్ వెల్డ్ డాగ్స్

### అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఉన్న అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్(అడవి కుక్కలు) తెలంగాణలో కనిపించాయి.

వెలుతురు బ్యూరో, హైదరాబాద్ నవంబర్ 23:
అంతరించిపోతున్న వన్యప్రాణుల జాబితాలో ఉన్న అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్(అడవి కుక్కలు) తెలంగాణలో కనిపించాయి. కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్ పేట్ అడవుల్లో అరుదైన ఇండియన్(ఏసియన్) వైల్డ్ డాగ్స్ సంచారం కెమెరాలకు చిక్కాయి. ఓ నీటి కుంట వద్ద నీళ్ల కోసం వచ్చిన ఇండియ్ వైల్డ్ డాగ్స్ దృశ్యాల వీడియో వైరల్ గా మారింది. కమ్మర్గాం- మురళిగూడ మధ్య అటవీ ప్రాంతాంలోని చెరువ వద్ద మూడు ఇండియన్ వైల్డ్ డాగ్స్ స్థానిక యువకుల కెమెరాకు చిక్కాయి. పెంచికల్ పేట రేంజ్ పరిధిలో సుమారుగా ఐదు నుంచి పది ఏసియన్ వైల్డ్ డాగ్స్ ఉన్నాయని అటవీశాఖ అధికారులు చెప్పారు. అంతరించిపోతున్న జాతుల్లో ఒకటైనా వైల్డ్ డాగ్స్ కి ఎవరైనా హాని తలపెడితే కఠిన చర్యలు ఉంటాయంటూ అటవిశాఖ హెచ్చరికలు జారీ చేసింది.

తెలంగాణలో కృష్ణా తీరం నల్లమల, గోదావరి తీరం ఆదిలా బాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల ఆడవులు పెద్దపులులతో పాటు అరుదైన వన్య ప్రాణుల ఆవాసంగా మారి జీవ వైవిద్యానికి



వేదికవ్వడం విశేషమంటున్నారు పర్యావరణ నిపుణులు. ఈ అరుదైన ఇండియన్ వైల్డ్ డాగ్స్ దేశంలోని పెంచ్ నేషనల్ పార్క్ , సత్పురా నేషనల్ పార్క్ మరియు సెంట్రల్ ఇండియాలోని తడోబా నేషనల్ పార్క్ , దక్షిణ కర్ణాటక రాష్ట్రంలోని బందీపూర్ , నాగర్‌హోల్ నేషనల్ పార్క్ లలో కనిపిస్తాయి. మధ్య భారతదేశం, పశ్చిమ, తూర్పు హిమాలయాలలో, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్‌లలో కూడా వీటిని చూడవచ్చని తెలిపారు.

# మహారాష్ట్ర ట్రెండ్ సెట్టర్‌గా నిలిచిన ‘పవన్’

- మోదీ అన్నట్టుగానే మరాఠీ గడ్డపై ‘సూపర్’ తుఫాన్ ప్రభంజనం
- పవన్ కల్యాణ్ ప్రచారం చేసిన అన్నిచోట్లా ‘ఎన్డీఏ’ గెలుపు
- మిగతా నియోజకవర్గాల్లోనూ కనిపించిన ‘పవన్’ సనతాన ధర్మ ప్రచార ప్రభావం
- జాతీయస్థాయి నేతగా పవన్ కల్యాణ్‌పై నేషనల్ మీడియా చర్చలు



హైదరాబాద్ నవంబర్ 23, (వెలుతురు):
మహారాష్ట్ర ఎన్నికల్లోనూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సత్తా చాటారు. మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తరుపున అయిదు నియోజకవర్గాల్లో ఆయన ప్రచారం చేశారు. పవన్ ప్రచారం చేసిన ప్రతి నియోజకవర్గంలోనూ బీజేపీ విజయం సాధించింది. దీంతో పాటు రాష్ట్రంలోని మిగతా నియోజక వర్గాల్లో నూ పవన్ భుజానికెత్తుకున్న సనాతన ధర్మ ప్రచారం ప్రభావం కనిపించింది. దీన్నిబట్టి ఆయన కేవలం తెలుగు ప్రజలకే పరిమితం కాదని తేలిపోయింది. పవన్ కల్యాణ్ సనాతన వాదిగా యావత్భారతం ఆయన్ను గుండెల్లో పెట్టుకుందని చెప్పాలి.

మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల ప్రభావాన్ని బట్టి నార్త్‌లోనూ పవన్ హవా నడుస్తోందని.. శనివారం ఉదయం నుంచి




సాయంత్రం దాకా జాతీయ మీడియా ఛానెళ్లల్లో చర్చించడం గమనార్హం. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం వేళ బీజేపీ ఏ ఒక్క అవకాశం వదులుకోలేదు. తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తో ప్రచారం చేయించింది. ఆయన ప్రచారం చేసిన పూణే, బల్లార్ పూర్, షోలాపూర్, డెత్లూర్, లాతూర్ లలో బీజేపీ మహాయుతి అభ్యర్థులు విజయం సాధించా రు.

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీజేపీ నేతృత్వంలోని మహాయుతి కూటమి బంపర్ మెజారిటీ సాధించడం వెనుక పవన్ కల్యాణ్ ప్రభావం ఉన్నట్టు జాతీయ మీడియాలో శనివారం రోజంతా కథనాలు, చర్చలు, విశ్లేషణలు జరిగాయి. పవన్ కల్యాణ్ ప్రచారం చేయడం ద్వారా 70 శాతం కాంగ్రెస్ బలమైన స్థానాలను ఎన్డీఏ ఖాతాలో పడేట్లు చేసారని విశ్లేషకులు చెప్పుకొచ్చారు.

### ఇండియా కూటమిని మట్టికరిపించిన ‘పవన్’

మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒకే దశ ఎన్నికల పోలింగ్ జరుగగా అధికార మహాయుతి కూటమి - బీజేపీ, శివసేన, ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) మధ్యాహ్నానికే మ్యాజిక్ ఫిగర్ దాటి 215 స్థానాల్లో ఆధిక్యాన్ని కనబరిచింది. ప్రతిపక్ష మహా వికాస్ అఘాడి (ఎంవీఏ)- కాంగ్రెస్, శివసేన (యూబీటీ), ఎన్సీపీ(శరద్ పవార్ వర్గం) కేవలం 58 స్థానాల్లో ఆధిక్యాన్ని కనబరిచి.. సాయంత్రానికి తుది ఫలితాల వెల్లడిలో ఎన్డీఏ కూటమి 224 స్థానాలతో అధికార పగ్గాలు చేజిక్కించుకుంది. కాగా, 2019 ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు 105 విజయం సాధించగా ఇప్పుడు 2024లో ఆ సంఖ్య 224కి చేరింది. ఇది ఖచ్చితంగా పవన్ కల్యాణ్ ప్రభావం అని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

### సనాతనవాదిగా ‘పవన్’ అందరివాడని నిరూపించారు

ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో బీజేపీ-తెలుగుదేశం-జనసేన కూటమి విజయం తరువాత ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఒక్కసారిగా సనాతన ధర్మాన్ని భుజానికెత్తుకున్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారంతో సనాతన బాధ్యతలు తీసుకున్న పవన్ కల్యాణ్ ఇప్పుడూ అదే మార్గంలో ఉన్నారు. సనాతనవాదిగా పవన్ కల్యాణ్ తన మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో కూడా అవే అంశాలు వల్లెవేశారు. హిందూత్వం, ధర్మ పరిరక్షణతో పాటు జాతి మొత్తం గర్వించదగ్గ అంశాలనూ ఆయన ప్రచారం చేశారు.

### ‘పవన్’ ప్రచారంలో సంచలన వ్యాఖ్యల ప్రభావం

పవన్ కల్యాణ్ ఎప్పుడు ఏం మాట్లాడాలనేది ఎవరూ సూచన చేయకుండానే.. ఆయన దేశంలోని పలు కీలక అంశాల్ని తన ఎన్నికల ప్రచారంలో వాడారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు, సనాతన ధర్మం, అయోధ్య రామాలయం వంటి అంశాల్ని బీజేపీ నేతలు ప్రస్తావించకున్నా.. వాళ్ళకు మించి పవన్ కల్యాణ్ ప్రచారం చేశారు. పవన్ కల్యాణ్ తన ప్రచారంలో ప్రధానంగా మహారాష్ట్ర గడ్డ ఛత్రపతి శివాజీ నేలగా అభివర్ణించారు. మరాఠా ప్రజల భవిష్యత్ కావాలంటే బీజేపీకి మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. తనకు బాలా సాహెబ్ థాక్రే పైన ఉన్న అభిమానం చాటుకున్నారు. శివసేన, జనసేన మధ్య సారూప్యత వివరించారు. తెలంగాణ, హైదరాబాద్‌లోని రాజకీయ పరిస్థితులపై పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు.

పోలీసులు 15 నిమిషాలు కళ్లు మూసుకుంటే హిందువులకు తామేంటో చూపిస్తామని హైదరాబాద్‌లో కొందరు నేతలు అంటు న్నారని ఎంఐఎం నేతలను ఉద్దేశించి పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. అలాంటి ప్రభుత్వాలు వద్దని తెలిపారు. ఈ ఎన్నికల్లో విడిపోయి బలహీనపడదామా.. కలిసి బలంగా నిలబడదామా అని ప్రశ్నించారు.

విడిపోయి హిందువుల అస్తిత్వాన్ని ప్రమాదంలోకి నెట్టే ద్దామా.. కలిసి బంగారు భవిష్యత్తు నిర్మించుకుందామా అంటూ పవన్ కల్యాణ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఎన్నికల వాతావరణంలో సర్వత్రా చర్చకు తెరలేపాయి.

### మోదీ అన్నట్టుగా సూపర్ ఆంధీ ‘పవన్’..

ప్రధానమంత్రి మోదీ అన్నట్టుగానే ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సూపర్ తుపాను ప్రభంజనం మహారాష్ట్రలోనూ పనిచేసింది. ఈక్రమంలో పవన్ కల్యాణ్, మోదీ ఒకే ఎజెండాతో ముందుకెళ్లాల్సిన పరిస్థితుల్లో ఎన్డీఏ కూటమికి బ్రాండ్ అంబాసిడర్ లభించినట్టేనని.. ఏపీ, తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లోనూ పవన్ కల్యాణ్‌ను కీలక స్థానంలో నిలబెడతారని జాతీ స్థాయిలో విశ్లేషకులు చర్చిస్తున్నారు.




# ఇక్కడ నో సెల్ఫీ!

సెల్ఫీ మోజు ఎక్కడెలా ఉన్నా.. పర్యాటక పర్వంలో మాత్రం విపరీతంగా పెరిగిపోయింది. ఏ ప్రాంతానికి వెళ్లినా.. పర్యాటకుల కళ్ల కన్నా ముందు చరవాణి లెన్సే చుట్టుపక్కలు చూసేస్తున్నాయి. క్లిక్ మనిపిస్తున్నాయి. మన్నూమిన్నూ కానకుండా ప్రమాదపుటంచుల్లోనూ సెల్ఫీ పోజులిస్తున్నారు కొందరు. అత్యుత్సాహం అదుపుతప్పితే? సెల్ఫీ కాస్తా కిల్ఫీగా మారిపోతోంది. ఈ పరిస్థితికి చెక్ పెట్టడానికి కేంద్ర పర్యాటక శాఖ కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. విహార కేంద్రాల్లో 'నో సెల్ఫీ జోన్' ఏర్పాటు చేయనుంది. డేంజర్ జోన్స్‌లో సెల్ఫీలను నియంత్రించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నారు అధికారులు. ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. పర్యాటకులు అత్యుత్సాహంతో ప్రాణాల మీదికి తెచ్చుకోకుండా, స్వీయ నియంత్రణ పాటించాలంటున్నారు.



# అరచేతిలో అద్భుతం..

డానాంగ్: అర చేతుల్లో అద్భుతం.. ఈ ఫోటో చూసిన వెంటనే ఎవరికైనా ఇదే మాట తడుతుంది. దూరం నుంచి చూసే వారికి ఇంత పెద్ద భారీ వంతెనను పడిపోకుండా ఈ రెండు చేతులు కాపాడుతున్నాయేమో అన్పిస్తోంది. మరి ఆ అర చేతుల్లో మనం కూడా వాలిపోవాలంటే.. చలో వియత్నాం. 'గోల్డెన్ హ్యాండ్స్' అని పిలుచుకుంటున్న ఈ వంతెన వియత్నాంలోని బనా హిల్స్ రిసార్ట్ వద్ద నిర్మించారు.

ఈ వంతెనను సముద్ర మట్టానికి సుమారు 4593 అడుగుల ఎత్తులో కట్టారు. వంతెనకు ఇరు పక్కల వంగపువ్వు రంగులో ఉండే లోబిలియా చామంతి పూల మొక్కలను నాటారు. దూరం నుంచి చూసినప్పుడు అడవిలో నుంచి రెండు భారీ చేతులు వచ్చి ఈ వంతెనను పట్టుకున్నాయేమో అనిపిస్తోంది.

జూన్ నెలలో ప్రారంభించిన ఈ వంతెనను చూడటానికి ఇప్పుడు ప్రపంచ నలుమూలల నుంచి పర్యాటకులు పోటెత్తుతున్నారు. అంతేనా ఈ వంతెనకు సంబంధించిన ఫోటోలు కూడా సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.

ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు వియత్నాం ప్రభుత్వం దాదాపు 10 వేల కోట్ల రూపాయలు కేటాయించింది. ఇందులో భాగంగా ఈ 'గోల్డెన్ బ్రిడ్జి'ని నిర్మించారు. ఈ వంతెనపై నిల్చోని చూస్తే ఆకాశానికి చాలా దగ్గరగా ఉన్నట్లు అన్పిస్తోంది అంటున్నారు పర్యాటకులు. అయితే ఈ వంతెనపైకి కేవలం పాదచారులను మాత్రమే అనుమతిచ్చింది వియత్నాం ప్రభుత్వం.

# 'టీ' అమ్ముతూ 23 దేశాలను చుట్టేశారు...

టీ అమ్మే ప్రతి ఒక్కరూ.. ప్రధాని కాకపోవచ్చు. కానీ, విదేశీ ట్రిప్పులు వేయొచ్చు. ఇందుకు ఈ వృద్ధ జంటే నిదర్శనం. కేరళాలోని కోచికి చెందిన విజయన్, మోహన అనే దంపతులు తమ 45 ఏళ్ల వైవాహిక జీవితంలో 23 దేశాలను చుట్టివచ్చి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. అందులో చిత్రం ఏముందీ? వారికి బాగా డబ్బుందేమో అనుకుంటే పొరపాటే! కేవలం టీ అమ్ముతూ వచ్చిన డబ్బులతోనే ఆ జంట విదేశాల్లో పర్యటిస్తున్నారు.

**ఇదీ టూర్ ప్లాన్:**

విజయన్, మోహనాలు కోచీలో 'శ్రీబాలాజీ కాఫీ హౌస్' అనే టీ, కాఫీ షాపు నడుపుతున్నారు. వారికి ప్రపంచ పర్యటన చేయాలనేది కల. ఇందుకు చాలా డబ్బు అవసరమని వారికి తెలుసు. టీ అమ్మగా వచ్చే రాబడి అందుకు సరిపోదు. దీంతో కొంత మొత్తాన్ని పొదుపు చేస్తూ.. మిగతా సొమ్మును బ్యాంక్ నుంచి రుణంగా తీసుకునేవారు. ఆ డబ్బుతో విదేశాలు తిరిగి వచ్చేవారు. పర్యటన ముగించిన వచ్చిన తర్వాత తీసుకున్న రుణాన్ని తీర్చేసి మరో ట్రిప్‌కు ప్లాన్ చేసేవారు.

**ఈ సందర్భంగా విజయన్ మాట్లాడుతూ..**

"జీవితంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. ప్రపంచం మొత్తం చుట్టిరావాలనేది నా చిననాటి కోరిక. పెళ్లికి ముందు నా భార్య ఎర్నాకులం దాటి ఎక్కడికి వెళ్లేది కాదు. పెళ్లైన తర్వాత నాతో కలిసి దేశం మొత్తం తిరిగేసింది. ఇప్పుడు విదేశాల్లో సైతం పర్యటిస్తూ ఎంతో సంతోషంగా ఉంది" అని తెలిపారు.



విజయన్ 1963 నుంచి టీ అమ్ముతూ కుటుంబాన్ని నడుపుతున్నారు. ఆయన దుకాణంలోని గోడలపై వారి విదేశీ పర్యటనలకు సంబంధించిన ఫొటోలు, వాటి బిల్లులు, వివిధ దేశాల కరెన్సీ నోట్లను చూడొచ్చు. వీరి దుకాణంలో పనివాళ్లు ఎవరూ ఉండరు. పనివారికి అయ్యే ఖర్చులు కూడా మిగులుతున్నాయి. ఇప్పటివరకు తిరిగిన 23 దేశాల్లో విజయన్‌కు సింగపూర్, స్విట్జర్లాండ్, న్యూయార్క్ దేశాలు బాగా నచ్చాయట. త్వరలో తాను స్వీడన్, డెన్మార్క్, నెదర్లాండ్, గ్రీన్ ల్యాండ్, నార్వేలు చుట్టి రానున్నట్లు తెలిపాడు.

**ఆనంద్ మహీంద్ర ట్వీట్‌తో వైరల్..:**



మహీంద్ర గ్రూప్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర సోషల్ మీడియాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ ఆసక్తికరమైన ట్వీట్స్ చేస్తుంటారు. ఇందులో భాగంగా విజయన్ దంపతులపై రూపొందించిన ఓ వీడియోను పోస్ట్ చేశారు. 'ఫోర్బ్స్ ధనవంతుల జాబితాలో వారి పేరు కనిపించకపోవచ్చు. కానీ, వారు దేశంలో అత్యంత సంపన్నులు. వారి జీవన విధానమే వారికి ఆస్తి. నేను ఎప్పుడైనా ఆ నగరానికి వెళ్తే తప్పకుండా ఆగి, అక్కడ టీ తాగుతాను" అని ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. దీంతో సోషల్ మీడియా అంతటా ఈ జంట గురించే చర్చ జరుగుతోంది.

ఈ జంటపై హరిమోహన్ అనే డైరెక్టర్ 'ఇన్విజిబుల్ వింగ్స్' అనే డాక్యుమెంటరీ రూపొందించారు. ఈ చిత్రానికి 2018 ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ కార్యక్రమంలో నాన్ ఫిక్షన్ విభాగంలో అవార్డు దక్కింది. ఇందులో విజయన్ తన లైఫ్'జర్నీ' గురించి ఎంతో స్పష్టంగా అందంగా వివరించాడు. ఈ డాక్యుమెంటరీ మీకు కూడా బాగా నచ్చేస్తుంది.

# ఆ ఊరి పేరు జిరో... ప్రకృతి అందాల్లో హీరో!

అరుణాచల్ ప్రదేశ్‌లో వెళ్లినప్పుడు తప్పకుండా లోయర్ సుబాన్సిరీ జిల్లాలో సముద్ర తలానికి 1500 మీటర్ల ఎత్తులో ఉన్న 'జిరో'ను తప్పకుండా సందర్శించాలి.

పూతోటల స్వర్గంగా పేరొందిన అరుణాచల్ ప్రదేశ్.. ప్రకృతి అందాలకు పెట్టింది పేరు. దేశానికి ఈశాన్యంలో ఉన్న ఈ రాష్ట్రం 1987 వరకు అస్సాంలో ఉండేది. చైనాతో ఏర్పడిన సరిహద్దు వివాదాల దృష్ట్యా ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదాను కల్పించారు. చైనాతో ఉన్న వివాదాలను పక్కనపెడితే.. ఈ రాష్ట్రంలో పర్యాటకులను ఆకట్టుకునే ఎన్నో ఆకర్షణలు ఉన్నాయి.



**జిరో:** అరుణాచల్ ప్రదేశ్‌లో వెళ్లినప్పుడు తప్పకుండా లోయర్ సుబాన్సిరీ జిల్లాలో సముద్ర తలానికి 1500 మీటర్ల ఎత్తులో ఉన్న 'జిరో'ను తప్పకుండా సందర్శించాలి. ఈ ప్రాంతాన్ని UNESCO ప్రపంచ వారసత్వ సంపదలో చేర్చేందుకు ప్రతిపాదించింది. ఇక్కడి ప్రజల ఆచారాలు ఎంతో భిన్నంగా ఉంటాయి. ప్రాచీన అపతానీ తెగకు చెందిన గిరిజనులకు ఇది పుట్టినిల్లు. వీరి జీవనాధారం వ్యవసాయం. చుట్టూ అందమైన పర్వతాలు.. మధ్యలో వ్యవసాయ క్షేత్రాలతో జిరో ఎంతో అహ్లాదకరంగా ఉంటుంది. వేసవిలో భిన్నమైన చల్లని హిల్ స్టేషన్ చూడాలనే ఆసక్తి ఉంటే తప్పకుండా ఈ ప్రాంతానికి విచ్చేయండి. ఏటా సెప్టెంబర్ నెలలో జరిగే జిరో మ్యూజిక్ ఫెస్టివల్‌ను చూసేందుకు దేశ విదేశాల నుంచి యువత ఇక్కడికి తరలివస్తారు. ఇటానగర్ నుంచి 167 కిమీలు ప్రయాణిస్తే 'జిరో'కు చేరుకోవచ్చు. అరుణాచల్ ప్రదేశ్‌లో 'జీరో' మాత్రమే కాదు.. మరెన్నో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. అవేంటో చూడండి.

**తవాంగ్:** సముద్ర మట్టానికి 10,000 అడుగుల ఎత్తులో ఉన్న తవాంగ్ అందమైన సరస్సులు మైమరపిస్తాయి. అంతేకాదు, ఇక్కడి బౌద్ధ మఠాలు సైతం కనువిందు చేస్తాయి. సుమారు 400 ఏళ్ల కిందటి తవాంగ్ బౌద్ధమఠాన్ని తప్పకుండా చూడాలి. దేశంలో ఉన్న అతిపెద్ద మఠాల్లో తవాంగ్ మఠం కూడా ఒకటి. తవాంగ్‌లోని సెలా పాస్, తక్త్సాంగ్ గోంపా, సముద్రతలానికి 22,500 అడుగుల ఎత్తైన గొరించెన్ శిఖరం, షాంగ్‌త్సర్ లేక్, నౌరంగ్ జలపాతం, పాన్‌కాంగ్ తెంగ్ త్సో లేక్ సరస్సు, బుమ్లా పాస్, బాప్ తెంగ్ కాంగ్ జలపాతం, జస్వంత్ గర్హ్ తదితర ప్రాంతాలను చూడదగినవి.

**రోయింగ్:** అరుణాచల్ ప్రదేశ్‌లో చూడదగిన మరో ముఖ్యమైన ప్రదేశం.. రోయింగ్. ఇది



దిబాంగ్ పర్వతం దిగువన ఉంది. ప్రకృతి ప్రేమికులు.. ఈ ప్రాంతాన్ని చూస్తే ఫిదా అయిపోతారు. ఇక్కడి కట్టడాలు, అడ్వేంచర్లు కూడా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ఇక్కడ కూడా ఎన్నో సరస్సులు, జలపాతాలు ఉన్నాయి. మయుడియా నుంచి హిమాలయాల అందాలు మనసు దోచుకుంటాయి. మేఘాలు చేతికి అందే ఈ ప్రాంతంలో మంచుతో నిండిన హిమగిరులు భలే అందంగా కనిపిస్తాయి. పర్వతాల మధ్య ఉన్న మెహో లేక్, మెహో వన్యప్రాణుల అభయారణ్యం, భిస్మాక్ నగర్ కోట, హునిలీ పర్వతం, నిజోమగాట్, రుక్మినీ నతికోట, సాల్లీ సరస్సు, ఇఫీపానీ ఘాట్ ప్రాంతాలు ఆకట్టుకుంటాయి.

**ఇటానగర్:** అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర రాజధాని ఇటానగర్ చూడకపోతే మీ జర్నీ పూర్తికానట్లే. ఇటానగర్ వన్యప్రాణుల అభయారణ్యం, ఇటా కోటా, స్టేట్ మ్యూజియం, గంగా సరస్సు, పోలో పార్క్ ఇంకా ఎన్నో ఇక్కడ చూడొచ్చు. అంతేకాదు, శతాబ్దాల కాలం నాటి భవనాలు, హిమాలయన్ నల్ల ఎలుగుబంటి వంటి అరుదైన జంతు జాతులను ఇక్కడ చూడొచ్చు.

**బొమ్డిలా:** సముద్రతలానికి 8000 అడుగుల ఎత్తులో ఉన్న బొమ్డిలా నుంచి మంచుతో నిండిన హిమగిరుల అందాలు మది దోచుకుంటాయి. ఇక్కడి చల్లని వాతావరణం ఎంతో ఆహ్లాదాన్ని అందిస్తాయి. యాపిల్ తోటలు భలే అందంగా కనిపిస్తాయి. షాపింగ్‌కు కూడా ఇది బెస్ట్ ప్లేస్. సెస్సా అభయారణ్యం, ఈగల్ నెస్ట్ అభయారణ్యం, దిరంగ వ్యాలీ, బొమ్డిలా బౌద్ధ మఠం, ఆర్.ఆర్.హిల్‌పాయింట్,

**ఇలా చేరుకోవాలి:**

అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌కు వెళ్లేందుకు గౌహతి, షిల్లాంగ్‌ల నుంచి రోడ్డు మార్గంలో చేరుకోవాలి. విమానంలో వెళ్లాలనుకునేవారు కోల్‌కతా విమానాశ్రయం నుంచి లిలాబరీకి చేరుకుని, అక్కడ నుంచి 141 కిమీలు ప్రయాణించాలి. హైదరాబాద్ నుంచి వెళ్లాలంటే గౌహతి విమానాశ్రయంలో దిగి రోడ్డు మార్గంలో ఇటానగర్ చేరుకోవాలి.

# అతిథిగా.. మీకోసం ఓ రోజు



పనుల కోసం ఒక రోజు.. పరుల కోసం మరో రోజు.. ఒంట్లో బాగోకపోతే ఇంకో రోజు.. ఇదండీ వరస. తన కోసం ఓ రోజు ఎప్పుడు? అదే స్టేకేషన్. పర్యాటక నిఘంటువులో కొత్తగా వచ్చి చేరిన పదమిది. ఒంటరిగానో, కుటుంబంతోనో అనుకోకుండా ఒకరోజు తీరికగా గడపడమే స్టేకేషన్ ప్రధాన ఉద్దేశం. ఇటీవలి కాలంలో ఈ ట్రెండ్‌ను ఫాలో అవుతున్నవారు ఎక్కువయ్యారు. స్టేకేషన్ అంటే వందల కిలోమీటర్లు ప్రయాణించాల్సిన పనిలేదు. ప్రకృతి కేంద్రానికి, పుణ్య క్షేత్రానికి వెళ్లాల్సిన అవసరమూ లేదు. మంచి రిసార్టులోనో, స్టార్ హోటల్‌లోనో ఓ గదిని బుక్ చేసుకొని.. రోజంతా అందులో గడిపేయడమే! ఉన్న ఊళ్లో అతిథిగా ఉండటమే ఇందులోని గమ్మత్తు! కొన్ని నియమాలు పాటిస్తే.. స్టేకేషన్‌లోని ఆనందాన్ని ఆస్వాదించవచ్చు. చరవాణిని అటకెక్కించి టీవీలో సినిమాలు చూస్తూ.. నచ్చిన పుస్తకం చదువుతూ.. కోరింది తింటూ.. కాలక్షేపం చేయాలి. సాయంత్రం పూట హోటల్ పైకి చేరుకొని.. నగరాన్ని చూస్తూ కాసేపు గడిపేయాలి. పని ఒత్తిడిలో హడావుడిగా కనిపించే నగరం.. అప్పుడు మరోలా దర్శనమిస్తుంది. వారాంతంలో స్టేకేషన్ చేసి.. పునరుత్తేజంతో మళ్లీ పనిలో నిమగ్నమవుతున్నవారు ఎందరో ఉంటున్నారు. ఇలాంటి వారి కోసం స్టార్ హోటళ్లు, రిసార్టులు స్టేకేషన్ ప్యాకేజీలూ ప్రకటిస్తున్నాయి. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో స్టేకేషన్ ప్యాకేజీల ధరలు రూ.2,000 నుంచి రూ.15,000 వరకు పలుకుతున్నాయి.

# ట్రావెల్ టిప్స్

**ఈ వేసవి పర్యటనలలో మంచి ఫొటోలు కావాలనుకుంటున్నారా? అయితే ఈ టిప్స్ మీకే.**

1: బరువైన కెమేరాలు విమానాల్లో తీసుకెళ్లడానికి నిబంధనలు ఉంటాయి. దుస్తులంత తేలికైన కెమేరాలు కూడా అందుబాటులో ఉన్నాయి. వెంట తీసుకెళ్లడానికి ఇబ్బందిలేని పాకెట్ కెమెరాలు ఉత్తమం. ముందుగా మీరు వెళ్లబోయే చోటు ఎలాంటిదో తెలుసుకోండి.

2: సూర్యాస్తమయానికి ముందే నిద్రలేవాలి. అప్పుడే ఉషోదయ వేళలో ఉండే ప్రకృతి అద్భుత సౌందర్యాన్ని కెమేరాలో బంధించవచ్చు. అలాగే సూర్యాస్తమ సమయమూ అత్యద్భుతంగా ఉంటుంది.

3: ప్రయాణంలో కెమేరా ఫీచర్స్ గురించి తెలుసుకుంటూ వెళితే, సరైన ఫొటో మీకు లభించదు. బయల్దేరకముందే కెమెరా, లెన్స్, ఫ్లాష్.. వంటివి ఇంటి వద్దే చూసి, నేర్చుకోవాలి.

4: దేవాలయాలు, ఆర్ట్ గ్యాలరీలు, నృత్యం, సంగీతం.. వంటివి ఫొటోలలో బంధించేముందు వాటికి సంబంధించిన కొన్ని పుస్తకాలను చదవడం వల్ల మరింత పరిజ్ఞానం లభిస్తుంది. దీని వల్ల ఒక క్రమ పద్ధతిలో కళాత్మకంగా ఫొటోలు తీసే నేర్పు అలవడుతుంది.

5: టూర్ అన్నాం కదా అని అన్నీ వేగంగా చూసేస్తే సరిపోతుంది అనుకోకూడదు. దారిలో ఎంతో మంది వ్యక్తులు ఉంటారు. ఆ ప్రాంత ప్రత్యేకత ఫొటోల ద్వారా తెలియజేయాలనుకుంటే స్థానికులతో మాట్లాడితే సరైన సమాధానం లభిస్తుంది.

# ట్రావెలింగ్‌తో ఆనందం మస్త్.. ఆరోగ్యం జబర్దస్త్!

ట్రావెలింగ్ అంటే ఇష్టమా? అయితే, తప్పకుండా ఈ విషయాలు తెలుసుకోవల్సిందే. ట్రావెలింగ్ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇక్కడ అందిస్తున్నాం. అవేంటో చూడండి. ప్రపంచంలో అందాలకు కొదవలేదు. కొండలు, కోనలు, పచ్చని అడవులు, ఏరులు, సెలయేళ్లు, జలపాతాలు.. ఒకటేమిటీ ఎన్నో అందాలను కళ్లారా ఆశ్వాదిస్తే ఆ కిక్కే వేరు. అందుకే, చాలామంది నిత్యం ఆనంద ప్రపంచంలో విహరిస్తుంటారు. అంతేకాదు, బోలెండంత ఆరోగ్యాన్ని కూడా సొంతం చేసుకుంటున్నారు. అదెలాగో చూడండి.

**రోగ నిరోధక శక్తి పెరుగుతుంది:**

సరికొత్త ప్రాంతాలు, వాతావరణంలో విహారం వల్ల శరీరంలోని దృఢమైన యాంటిబయోటిక్స్ ఏర్పడతాయి. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది.

**ఒత్తిడిని తగ్గిస్తుంది:**

ట్రావెలింగ్ వల్ల ఒత్తిడి తగ్గుతుంది. మీలో సంతోషాన్ని పెంచి, డిప్రెషన్ నుంచి గట్టెక్కిస్తుంది. మీరు ఇంటికి తిరిగి వచ్చినా సరే ఆ ఉత్సాహం కొనసాగుతోంది.

**మెదడుకు మంచిది:**

ట్రావెలింగ్ మనసుకు ఉల్లాసం కలిగిస్తుంది. కొత్త వ్యక్తులు, కొత్త



అనుభవాలతో సరికొత్త అనుభూతి ఇస్తుంది. దీనివల్ల మెదడు చురుగ్గా పనిచేస్తుంది. ట్రావెలింగ్ చేసేవారిలో క్రియేటివ్ ఆలోచనలు పెంపొందుతాయని పలు సర్వేలు పేర్కొన్నాయి.

**గుండె జబ్బుల ముప్పు ఉండదు:**

ట్రావెలింగ్ వల్ల గుండె జబ్బుల ముప్పు తగ్గుతుంది. ట్రావెలింగ్ వల్ల ఒత్తిడి, ఉద్వేగం తగ్గుతుంది. ట్రావెలింగ్ చేయనివారితో పోల్చితే ఏడాదికి కనీసం ఒకసారైనా ట్రావెలింగ్ చేసే స్త్రీ, పురుషుల్లో గుండె జబ్బులు ఏర్పడే పరిస్థితి తక్కువగా ఉన్నట్లు ఫ్రామింగ్‌హమ్ హార్ట్ స్టడీ పేర్కొంది.

**ఫిట్‌గా ఉంచుతుంది:**

ఫిట్‌గా ఉంటేనే ట్రావెల్ చేయాలి అనుకుంటే పొరపాటే. ట్రావెలింగ్ ద్వారా కూడా ఫిటనెస్ పొందవచ్చు. కొత్త ప్రాంతాలను చూస్తూ ఎంత దూరం నడుస్తున్నామో తెలీదు. దీనివల్ల మీకు తెలియకుండానే ఫిట్‌నెస్ పొందుతారు.

**ఆరోగ్యం ప్రయాణం:**

పచ్చని కొండలు, అడవుల్లో విహరించడం, జలపాతాల్లో స్నానం చేయడం వల్ల కూడా ఆరోగ్యం పెంపొందుతుంది. పచ్చని ప్రాంతాల్లో కాలుష్యం చాలా తక్కువ. ఔషద గుణాలు కలిగిన మొక్కలు నుంచి వీచే గాలి, వాటి మీదుగా ప్రవహించే జలాలు శరీరానికి మేలు చేస్తాయి. హాట్ స్ప్రింగ్స్‌లో స్నానం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిదే.

**ఆయుష్షు పెంచుతుంది:**

ట్రావెలింగ్ మీ ఆయుష్షు పెంచుతుంది. ట్రావెలింగ్ వల్ల శరీరానికి అన్నిరకాల వ్యాయామం లభిస్తుంది. కాబట్టి, ఏడాదికి ఒక్కసారైనా మీకు నచ్చిన ప్రాంతంలో హాయిగా విహరించి రండి. ఆయుష్షు పెంపొందించుకోండి.



హిందూ దైవం

# ఎవరు గురువు? ఏది చదువు?

**విద్యార్థికి ఈ సమాజం అంతా గురువే. తెలియని విషయాలు చెప్పేవారందరూ గురువులే. చేపలు పట్టే వ్యక్తి కూడా ఏకాగ్రత విషయంలో గురువే అని వివరిస్తుంది మహాభాగవతంలోని అవధూత ఉపాఖ్యానం. సమాజం నుంచి సమగ్రమైన విజ్ఞానం లభిస్తుంది. మనసు వికసిస్తుంది. తుదిగా ఆ సమాజంపై గౌరవం ఏర్పడుతుంది.**

గమ్యం తెలియని జీవన గమనానికి దారి చూపే దీపం చదువు. విద్యార్థి జీవితం సజావుగా సాగేందుకు ఆ దీపాన్ని భద్రంగా పట్టుకొని ఉండే జ్ఞానాధారం గురువు. విద్యార్జన మహాయాగం వంటిది. దానిని నిర్వహించే బ్రహ్మ గురువు. ఆయన అనుగ్రహం విద్యార్థిని జ్ఞానవంతుడిని చేస్తుంది. విద్యార్థి చదువు గురువుతో ఉండే అనుబంధం మీద ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల సంబంధం గురించి, సమాజహితాన్ని కోరే చదువు గురించి మన సనాతన ధర్మం ఏం చెప్పిందంటే..

తమ చిన్నారికి మూడో యేడు వచ్చిందో లేదో తల్లిదండ్రులకు ఆరాటం. ఎప్పుడెప్పుడు అక్షరస్వీకారం చేయిస్తామో.. ఎప్పుడెప్పుడు బడికి పంపిస్తామో అని. మన సంప్రదాయంలో పిల్లలను బడిలో వేయడం కూడా ఒక సంబరమే. పప్పు బెల్లాలు, పలకాబలపాలు తోటి పిల్లలకు పంచిపెట్టి.. తమ పిల్లలతో ఓనమాలు దిద్దిస్తారు. ఆనందంగా మొదలయ్యే విద్యార్థి జీవితం ఓ మధురానుభూతి. చదువంటే ఓ సంతోషం, ఓ ఆనందం. బడికి పోవాలనే ఒకటే ఆరాటం. ఎలాంటి ఒత్తిడి లేకుండా, హాయిగా చదువుకోవడం తొలినాళ్ల నుంచి మన విద్యావ్యవస్థలో కనిపిస్తుంది. అప్పుడే పునాది గట్టిగా ఉంటుంది. దానిపై భవిష్యత్ బంగారుమేడ గట్టిగా నిలవగలుగుతుంది.

### మనిద్దరం కలిసి..

విద్యార్థి జీవితం గురువుపైనే ఆధారపడి ఉంటుంది. గురుశిష్యుల బంధం ఎంత బలంగా ఉంటే.. ఆ విద్యార్థి భవిష్యత్తు అంత ఉజ్వలంగా ఉంటుంది. సనాతన విద్యావిధానం గురుశిష్యుల సంబంధాన్ని చాలా సందర్భాల్లో స్పష్టం చేసింది. దీనికి సంబంధించిన సారాంశం కేనోపనిషత్తు శాంతి మంత్రంలో కనిపిస్తుంది.

**"ఓం సహనావవతు, సహనౌభునక్తు..**
**సహవీర్యం కరవావహై**
**తేజస్వినావధీతమస్తు మావిద్విషావహై**
**ఓం శాంతిః శాంతిః శాంతిః"**

ఈ శాంతి మంత్రం విద్యావిధానానికి ఓ దిక్సూచి లాంటిది. దీనిలో ఉన్న గురుశిష్య సంబంధ అంశాలను పరిశీలిస్తే మన సంప్రదాయం వారి బంధానికి ఎంత ప్రాధాన్యం ఇచ్చిందో తెలుస్తుంది. శిష్యుడిని గురువు ఎంత ప్రేమగా చూసుకోవాలో అర్థమవుతుంది. "ఓ శిష్యుడా! మనమిద్దరినీ భగవంతుడు రక్షిస్తూ, పోషిస్తూ ఉండాలి. మనమిద్దరం శక్తిమంతులమై శ్రమిస్తూ ఉండాలి. మన అధ్యయనం తేజోవంతంగా ఉండాలి. మనిద్దరం నిరంతరం ద్వేషం లేకుండా ఉందాం" ఇది కేనోపనిషత్తులోని శాంతిమంత్ర ప్రసాదం. గురుశిష్య సంబంధం గురించి విద్యార్థికి ప్రతి గురువూ తెలియజేయాలి. అప్పుడు ఆ విద్యార్థికి గురువు ప్రాణసమానుడు అవుతాడు.

**వినయమే విద్యార్జనకు తొలిమెట్టు. గురువు కూర్చునే ఆసనం, ఆయన వినియోగించే వస్తువులను కూడా సాక్షాత్తు గురువే అనే భావనతో ఉండేవారు అప్పటి విద్యార్థులు. పాఠం ముగించుకొని గురువు వెళ్లాక.. ఆయన వినియోగించిన ఆసనాన్ని తాకడానికి సాహసించేవారు కాదు. గురువుపై అంతటి భక్తిప్రపత్తులుండేవి.**

### అందరికీ చదువు

విద్య అందరికీ అవసరమే. అందుకే తల్లిదండ్రులు తమ పిల్లల విషయంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. పురాణాల కాలంలోనూ ఇదే కనిపిస్తుంది. మనుషులు, దేవతలే కాదు.. చదువు ఎంత గొప్పదో అసురుల్లోనూ నాటుకుపోయింది. ఈ విషయాన్ని పోతన మహాభాగవతం ఏడో స్కందంలోని 130, 132 పద్యాల సారాంశం మనకు విశదీకరిస్తుంది. హిరణ్యకశిపుడు రాక్షసరాజు. ఆయన కుమారుడు ప్రహ్లాదుడు. ఓ రోజు చిన్నారి ప్రహ్లాదుడిని చెంతకు పిలిచిన హిరణ్యకశిపుడు లాలనగా..

**చదువని వాడజ్ఞుండగు,**
**జదివిన సదసద్వివేక చతురత గలుగుం**
**జదువగ వలయును జనులకు, జదివించెద**
**నార్యులొద్ద జదువుము తండ్రీ!'**

అని అన్నాడు. "జీవితానికి చదువు చాలా ముఖ్యం, చదువుకోని వాడు అజ్ఞానిగా ఉంటాడు.. వాడు పశువుతో సమానం. చదువుకుంటే తెలివితేటలు బాగా వస్తాయి. చదువనేది మంచి ఏమిటి? చెడు ఏమిటి? అనే వివేకాన్ని కలిగిస్తుంది. అందుకే పుట్టిన ప్రతివాడూ చదువుకోవాలి. నిన్ను మంచి గురువుల దగ్గర చదివిస్తాను" అని ఆ పద్య భావం. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య ప్రాధాన్యం తెలియజేయాలి. తగిన విధంగా ప్రోత్సహించాలి. విద్యపై ఆసక్తి కలిగించే విషయాలు చెప్పాలి. అప్పుడు పిల్లలకూ బడిపై మమకారం పెరుగుతుంది. చదువుపై ఆసక్తి కలుగుతుంది.

### సంస్కరించే విద్య..

ఇప్పుడు చదువంటే.. మార్కులు. ఉత్తీర్ణత శాతం. పోటాపోటీ పరుగు. తల్లిదండ్రులు కూడా అలాగే వ్యవహరిస్తున్నారు. బాగా చదవాలంటూ పిల్లలపై ఒత్తిడి చేస్తున్నారు. పాఠశాలకు వెళ్లి తమ పిల్లాడికి మార్కుల గురించి అడుగుతున్నారే కానీ, ఎలాంటి విద్య బోధిస్తున్నారో, ఏం నేర్పించాలో సూచించడం లేదు. కానీ, తల్లిదండ్రులు పిల్లవాడిని బడికి పంపినప్పుడు ఎలా వ్యవహరించారో హిరణ్యకశిపుడి ద్వారా మనకు తెలియజేశారు పోతన. ప్రహ్లాదుడిని గురువులకు అప్పగిస్తూ హిరణ్యకశిపుడు.. "ఓ గురువులారా! మా పిల్లవాడు ఇప్పటిదాకా జీవితానికి సంబంధించిన జ్ఞానం లేకుండా ఉన్నాడు. నేను మా అబ్బాయి పైకి రావాలని అనుకుంటున్నాను. దయచేసి మా పిల్లవాడికి చదువు చెప్పి గ్రంథాలు చదివించండి. నీతిశాస్త్రం నేర్పించి సంస్కరించి మమ్మల్ని రక్షించండి" అని విన్నవించుకున్నాడు. ఇందులో తన కుమారుడికి నైతిక విలువలున్న విద్య నేర్పించండని కోరడం కనిపిస్తుంది. విద్యకు ముందు కావాల్సింది నైతికత. మన సంప్రదాయం నైతిక విలువలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ తరం తల్లిదండ్రులు తమ బిడ్డలకు ఉన్నత విద్యతో పాటు, ఉన్నత విలువలు రావాలని ఆకాంక్షించాలి. మన విద్యావిధానంలో ప్రతి అంశానికీ నైతిక విలువలు జోడించి చెప్పడం సాధ్యమేనని విద్యావేత్తలు చెబుతున్నారు. ఫలితంగా పిల్లలకు విజ్ఞానంతో పాటు నైతికత అబ్బుతుంది. నీతిగా మెలగాలన్న స్ఫురణ కలుగుతుంది.

### విలువలకు కట్టుబడి

గురువు విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలి. నైతిక విలువలకు కట్టుబడి ఉండాలి. విరాటరాజు కొలువులో బృహన్నలగా ఉన్న అర్జునుడు రాకుమారి ఉత్తరకు నాట్యం నేర్పించేవాడు. ఉత్తర అపురూప సౌందర్యరాశి. అజ్ఞాతవాసం ముగిసిన తర్వాత ఉత్తరను వివాహం చేసుకోవాల్సిందిగా అర్జునుడిని కోరుతాడు విరాటరాజు. అప్పుడు అర్జునుడు 'గురువుగా ధర్మం తప్పడం మంచిది కాదని, ఉత్తరను తన కుమారుడు అభిమన్యుడికిచ్చి వివాహం చేస్తాన'ని విరాటరాజుకు వివరించి చెబుతాడు.

## విద్యార్థుల ప్రవర్తన

పాఠశాల ఒక సామాజిక దేవాలయం. అక్కడ అందరూ సమానం. పేద, ధనిక భేదాలు ఉండకూడదు. పురాణాల కాలం నుంచి మన విద్యావ్యవస్థలో ఇది కనిపిస్తుంది. దశరథ మహారాజు కుమారులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు వసిష్ఠుడి దగ్గర, బలరామకృష్ణులు సాందీపని ముని దగ్గర ధనవంతుల పిల్లల్లా విద్యనభ్యసించలేదు. నిరాడంబరంగా, సామాన్యుల్లాగే చదువుకున్నారు. సామాజిక, రాజనీతి విషయాలలో శ్రీరామచంద్రుడు ఈనాటికీ ఆదర్శమూర్తిగా భావించడానికి కారణం గురువు దగ్గర వినయంగా విద్యనభ్యసించడమే. శ్రీకృష్ణుడు నిరుపేద అయిన కుచేలుడితో స్నేహం చేశాడు. వారి మైత్రి గురుకులం వరకే పరిమితం కాలేదు. కృష్ణుడు ఎంతో ఉన్నతస్థాయికి ఎదిగాక కూడా కుచేలుడిని ఆదరించాడు. తన సరసన కూర్చోబెట్టుకొని, గౌరవించేంతటి సంస్కారం ఆనాటి విద్యావిధానం నేర్పినదే.

## ఏదైనా.. విజ్ఞాన గని

ప్రతి మనిషి చదువుకోవాలి. చదువుకుంటేనే మంచి మనుగడ. పరిణామ క్రమంలో విద్యావ్యవస్థలో ఎన్నో మార్పులు వచ్చాయి. పురాణకాలంలో గురుకులాల్లో చదువుకునేవారు. బౌద్ధమత రోజుల్లో అది ఆరామాలకు చేరుకుంది. తర్వాత అనేక సంస్కరణలకు నోచుకుంది, అనేక విధానాలు అలవర్చుకుంది. ఒకనాడు గురుకులం.. ఇంకోనాడు ఆరామం.. ఇప్పుడు పాఠశాల.. ఏదైనా విజ్ఞానాన్ని ప్రసాదించే ఆలయమే. అక్కడ గురువే దైవం. అక్కడికి వచ్చే శిష్యుడు పరమభక్తుడు. ఆ భక్తుడిని పరిపూర్ణంగా అనుగ్రహించాల్సింది గురుదేవుడే. ఒత్తిడి లేని చదువును అనుగ్రహించి.. విజ్ఞానాన్ని కటాక్షించి.. వారి జీవిత మార్గానికి వెలుగు ప్రసాదించాలి.

# సత్కార్యాలతోనే సాఫల్యం!

అందమైన ఇల్లు, అనుకూలవతి అయిన భార్య, రత్నాల్లాంటి బిడ్డలు, కావాల్సినంత సంపద, విలాసవంతమైన జీవితం ఇన్ని ఉన్నా.. చాలా మందికి సంతృప్తి ఉండదు. సంపద అనేది పాక్షికమైన ఆనందాన్ని ఇస్తుందే కానీ, పరిపూర్ణమైన సంతోషానికి సోపానం కాదని గుర్తించాలి. మరి మంచి జీవితం, శాంతి, సంతోషం, సంతృప్తి ఇవన్నీ ఎలా లభిస్తాయి? ఇదే ప్రశ్నను ఒక శిష్యుడు ప్రవక్త (స)ను అడిగాడు. అప్పుడాయన 'అల్లాహ్‌ను బాగా స్మరించు, అనాథలను ఆదరించు, పేదలకు శక్తిమేర సాయం చెయ్యి'



అని ఉపదేశించారు. కానీ, నాలుగురాళ్ల సమకూరగానే మనుషుల్లో అహం పెరిగిపోతోంది. దైవాన్ని స్మరించడం మరచిపోతున్నాడు. పేదలను ఈసడించుకుంటున్నాడు. ఇలాంటి భావనలు ఉన్నంత కాలం సంతోషం దరి చేరదు. ప్రవక్త(స) చెప్పినట్లు.. సత్కార్యాల్లోనే సంతృప్తి ఉంది. ధర్మ బద్ధమైన సంపాదన, ధర్మ సమ్మతమైన ఖర్చు, మంచి పనుల కోసం వెచ్చించే సమయం.. ఇవన్నీ సంతోషానికి హేతువులు అవుతాయి. మనసుకు శాంతిని చేకూరుస్తాయి. ఇహపర సాఫల్యాన్ని అందిస్తాయి.

# మనసు జయించిన మహావీరుడు

జిన అనే పదం నుంచి ఆవిర్భవించింది జైనం. ఆ పదానికి జయించినవాడు అని అర్థం. బంధనాలు, కోరికలు, మానసిక వికారాలను జయించి (జినులై) ఉంటే కైవల్యం సాధ్యమనేది జైన మత నినాదం. దీనికోసం జనులు నిర్గ్రంథులు కావాలని వీరి ప్రధాన బోధ. అంటే భవబంధాల నుంచి విముక్తి పొందిన వారని అర్థం.

**స్థాపన:** జైన మత స్థాపకుడు వృషభనాథుడు. ఇతడు మొదటి తీర్థంకరుడు. జీవ ప్రవాహాన్ని దాటడానికి వారధి నిర్మించిన వారిని తీర్థంకరులు అంటారు. వీరు మొత్తం 24 మంది. వీరిలో చివరి ముగ్గురూ ఈ సిద్ధాంతం అభివృద్ధికి కృషి చేశారు. వారు నేమి, పార్శ్వనాథుడు, వర్ధమాన మహావీరుడు. ప్రాచీన జైన సిద్ధాంతాన్ని పూర్తి స్థాయిలో మతంగా రూపుదిద్ది ప్రచారం చేసిన వాడు వర్ధమాన మహావీరుడు. అందుకే ఆ మతం ఆయన పేరుతోనే ప్రచారం లోకి వచ్చింది.



ఇతని అసలు పేరు వర్ధమానుడు. తండ్రి సిద్ధార్థుడు. తల్లి త్రిశల. వైశాలీ నగరం దగ్గరలోని కుంద అనే గ్రామంలో జన్మించాడు. భార్య యశోద. నలందని దర్శించినప్పుడు గోశాల ముష్కర పుత్రుడు అనే సన్యాసితో పరిచయమైంది. ఆయన బోధనల ప్రభావంతో 30వ ఏట సన్యాసాన్ని స్వీకరించాడు. కొన్నాళ్లకు వస్త్రాలను కూడా విడిచి దిగంబరుడై ఆ స్థితిలోనే జృంభక పర్వత సానువుల్లో రుజుపాలిక నదీ తీరంలో మద్ది వృక్షం కింద తపస్సు ప్రారంభించాడు. అంచెలంచెలుగా తపస్సును కఠినతరం చేస్తూ 43వ ఏట జ్ఞానోదయం పొందాడు. అన్నిటినీ జయించినవాడు కాబట్టి జినుడు అని, కోరికలతో పోరాడి గెలిచినవాడు కాబట్టి మహావీరుడు అని పిలుస్తారు. ఇంకా వీర, వీరప్రభు, అతివీర, సన్మతి, జ్ఞానపుత్ర అనే పేర్లున్నాయి.

జైనానికి ఆయువు పట్టు: జైన మతానికి త్రిరత్నాలు ఆధార భూతమైన సూత్రాలు. అవి సమ్యక్ దర్శనం, సమ్యక్ జ్ఞానం, సమ్యక్ జీవనం. మరో అయిదు మార్గదర్శక సూత్రాలున్నాయి. అవి... సత్యం, అహింస, అపరిగ్రహం (ఇతర వస్తువుల కోసం ఆశ పడకపోవడం), అస్తేయం (దొంగతనం చేయకపోవడం), బ్రహ్మచర్యం. వీటన్నిటినీ బోధిస్తూ మహావీరుడు దేశాటనం చేశారు.

**పెద్దపీట:** అహింసా మార్గాన పయనిస్తే సంసారిగా ఉంటూనే కైవల్యం పొందవచ్చనేది వీరి ప్రధాన నినాదం. అందుకే వీరు అహింసకు చాలా ప్రాధాన్యతనిస్తారు. ఎంతగా అంటే... వ్యవసాయం వల్ల భూమిలోని జీవులు హింసకు గురవుతాయని వ్యవసాయం చేయకపోవడం వీరి మార్గగమనానికి పరాకాష్ఠ.

**శాఖలు:** జైనంలో దిగంబర, శ్వేతాంబర అనేవి రెండు ప్రధాన శాఖలు. కొన్ని విషయాల్లో బేధాలున్నా వీరి మౌలిక సూత్రాలు ఒకటే. వీరు నిరీశ్వర వాదులు. వీరి దృష్టిలో సృష్టికర్త లేడు. వేద ప్రామాణ్యాన్ని అంగీకరించరు. ఆత్మ అంటే జీవమని నమ్ముతారు. పర్వతాలు, లోహాల వంటివాటినీ సావర్త జీవులు అంటారు.

**నిర్యాణం:** నేటి పాట్నాను ఆ రోజుల్లో పాటలీపుత్రం అని పిలిచేవారు. అక్కడికి సమీపంలో ఉన్న ఒక గ్రామంలో హస్తిపాలుడు అనే శిష్యుడి ఇంట్లో 73వ ఏట అనారోగ్యంతో మరణించాడు.

# సత్యంతోనే విమోచన

ఒక కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు ఉండేవారు. ఒకాయన ఉన్నతోద్యోగి. మంచి జీతం, మంచి హోదా. మరొకతను చిరుద్యోగి. తక్కువ జీతం. అతనిది పెద్ద కుటుంబం. పైగా ఆర్థిక సమస్యలు. ఇన్ని ఇబ్బందులున్నా.. ఇవేవీ అతని ముఖంలో కనిపించేవి కావు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండేవాడు. ఉన్నతోద్యోగికి ఏ సమస్యలూ లేకపోయినా.. అతని ముఖంలో ఎప్పుడూ బాధ, అభద్రత కనిపించేవి. ఆ చిరుద్యోగి ప్రశాంతంగా ఉండటానికి, ఈ పెద్ద ఉద్యోగి ఆలోచనలతో సతమతమవ్వడానికి కారణం రెండు అక్షరాలు. అదే సత్యం.

చిరుద్యోగి ఏనాడూ అబద్ధమాడేవాడు కాదు. నిజం దాచేవాడు కాదు. అందుకే నిరంతరం ఆత్మవిశ్వాసంతో ఆనందంగా ఉండేవాడు. ఉన్నతోద్యోగి ఇంటాబయటా అబద్ధాలు చెప్పేవాడు! అందుకే ఎప్పుడూ అపరాధ భావంతో ఆంతర్మథనం చెందుతూ ఉండేవాడు. ఈ సందర్భంగా క్రీస్తు చెప్పిన ఒక అద్భుతమైన వాక్యాన్ని గుర్తు చేసుకోవచ్చు.

"మీరు సత్యాన్ని గ్రహిస్తారు. ఆ సత్యం మిమ్మల్ని స్వతంత్రులుగా చేస్తుంది" అంటారు ప్రభువు. సత్యంగా బతికేవారు ఎవరికీ భయపడాల్సిన పనిలేదు. వారికి ఏ ఆందోళనా ఉండదు. వారిలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతుంటుంది. అలాంటి వారు ఏ హోదాలో ఉన్నా.. ఏ సంపదలూ లేకపోయినా.. లోకం వారికి దాసోహం అవుతుంది. అందుకే 'సత్యమే జయం' అన్నారు



పెద్దలు. అబద్ధం అనేది బతుకును బంధీలను చేస్తే.. సత్యవంతమైన జీవితం మనిషికి స్వేచ్ఛ కలిగిస్తుంది.



## కన్నప్పలో గంభీరంగా
# మహాదేవ శాస్త్రి

విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా భారీ ఎత్తున రూపొందుతోంది కన్నప్ప మూవీ. అవా ఎంటర్‌టైన్మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. భారీ బడ్జెట్ కేటాయించి డా.మోహన్ బాబు నిర్మిస్తున్న ఈ మూవీకి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అన్ని అప్ డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొల్పాయి. ఈ క్రమంలోనే టాలీవుడ్ దిగ్గజం మోహన్ బాబు 50 ఏళ్ల నట ప్రస్థానంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా కన్నప్ప నుంచి మంచు మోహన్ బాబు లుక్ రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ ద్వారా కన్నప్ప సినిమాలో మహాదేవ శాస్త్రిగా మోహన్ బాబు కనిపించనున్నారని స్పష్టం చేశారు. తాజాగా వదిలిన పోస్టర్ లో.. మహాదేవ శాస్త్రిగా మోహన్ బాబు గంభీరమైన లుక్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వదిలిన పోస్టర్స్, టీజర్ మూవీపై అంచనాలు పెంచగా, తాజాగా వదిలిన మోహన్ బాబు పోస్టర్ బజ్ క్రియేట్ చేసింది. సినిమాలో ఈ క్యారెక్టర్ ఏ రేంజ్ లో ఉండనుందా? అనే క్యూరియాసిటీ నెలకొల్పింది.

కన్నప్ప ఏ తరానికి అయినా కొత్తగానే ఉంటుందని, భక్తి భావం, ధూర్జటి మహాకవి ఎలా రాశారు? శ్రీకాళహస్తి మహత్యం ఏంటి? అన్నది ఈ చిత్రంలో చూపించబోతున్నామని ఇప్పటికే మోహన్ బాబు చెప్పడం..

అందుకు తగ్గట్టుగా కొత్త పోస్టర్స్ వదులుతుండటం కన్నప్పపై ఓ రేంజ్ అంచనాలు క్రియేట్ చేస్తోంది.

## 55వ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియాలో
# రానా దగ్గుబాటి



ది రానా దగ్గుబాటి షో యొక్క మొదటి ఎపిసోడ్‌ను ప్రీమియర్ చేయడంతో పాటు క్రియేటర్, హోస్ట్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటితో ఎంటర్ టైనింగ్ ఇంటరాక్షన్, ప్రైమ్ వీడియో అన్ స్క్రిప్ట్ తెలుగు ఒరిజినల్ సిరీస్ ప్రతిష్టాత్మక ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రేక్షకుల నుండి అద్భుతమైన స్పందనను అందుకుంది. ప్రైమ్ వీడియోలో ప్రతి శనివారం కొత్త ఎపిసోడ్‌లతో రానా దగ్గుబాటి షో నవంబర్ 23న భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలు స్ట్రీం కానుంది."రానా దగ్గుబాటి షో 55వ ఎడిషన్‌లో ప్రతిష్టాత్మక ఐఎఫ్ఎఫ్ఐలో ప్రేక్షకుల ముందు ప్రదర్శించబడుతుందని ఎప్పుడూ ఊహించలేదు. మేము సెలబ్రిటీలు, అభిమానుల మధ్య స్క్రీన్‌ను తీసివేసి టాక్ షో ఫార్మాట్‌ని మార్చాము. ప్రైమ్ వీడియోకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను, నవంబర్ 23న షో ప్రారంభించినప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల కోసం ఎదురుచూస్తున్నాను" అని రానా అన్నారు షో హోస్ట్, క్రియేటర్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రానా దగ్గుబాటి.



## డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్
# "కిల్లర్" పూర్వాజ్

"శుక్ర", "మాటరాని మౌనమిది", "ఏ మాస్టర్ పీస్" వంటి డిఫరెంట్ సినిమాలతో మూవీ లవర్స్ దృష్టిని ఆకట్టుకుంటున్న దర్శకుడు పూర్వాజ్ "కిల్లర్" అనే సెన్సేషనల్ యాక్షన్ థ్రిల్లర్ మూవీని రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన కీలక పాత్రలో నటిస్తుండటం విశేషం. ఏయు అండ్ఐ మరియు మెర్జ్ ఎక్స్ ఆర్ సంస్థతో కలిసి థింక్ సినిమా బ్యానర్ పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు పూర్వాజ్ ప్రజయ్ కామత్, ఎ. పద్మనాభరెడ్డి ఈ కొలాబ్రేషన్ లో నిర్మాణమవుతున్న రెండవ చిత్రమిది. "కిల్లర్" పార్ట్ 1 డ్రీమ్ గర్ల్ మూవీ నుంచి పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ రిలీజ్ చేశారు. "కిల్లర్" మూవీలో పూర్వాజ్ క్యారెక్టర్ ఫస్ట్ లుక్ కొత్తగా ఉండి ఆకట్టుకుంటోంది. చేతిలో రివాల్వర్ తో పూర్వాజ్ కనిపిస్తున్నారు. రిలీజ్ చేస్తున్న ప్రతి పోస్టర్ తో "కిల్లర్" మూవీ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది.



# దిశా మళ్ళీ మోసపోయిందా?

బాలీవుడ్‌లో అతితక్కువ కాలంలో భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న భామ దిశాపటానీ. భారీ పాన్ ఇండియా చిత్రాలలో నటిస్తున్న సంగతి తెలిసిందే. కల్కి 2898 ఏడి లాంటి పాన్ ఇండియా బ్లాక్ బస్టర్ లో నటించిన దిశా ఇటీవలే విడుదలైన మరో పాన్ ఇండియన్ మూవీ కంగువలోను కీలక పాత్రను పోషించింది. మునుముందు సౌత్ లో పలు భారీ పాన్ ఇండియా చిత్రాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. అలాగే దిశా పటానీ వ్యక్తిగత జీవితం, డేటింగ్ లైఫ్ గురించి తెలిసిందే. దిశా గతంలో ట్యాలెంటెడ్ హీరో టైగర్ ష్రాఫ్ తో డేటింగ్ చేసింది. అతడితో కొన్నేళ్ల పాటు డేటింగ్ చేశాక, బ్రేకప్ అయిన సంగతి తెలిసిందే. ఆ ఇద్దరూ ఇప్పుడు మంచి స్నేహితులుగా ఉన్నారు. అయితే టైగర్ ష్రాఫ్ కంటే ముందే దిశా వేరొకరి చేతిలో మోసపోయిందని తాజాగా లీకైంది. దిశా పటానీ గతంలో పార్థ్ సమథాన్ అనే టీవీ నటుడితో డేటింగ్ చేసింది. పార్త్ మాజీ బిగ్ బాస్ కంటెస్టెంట్ .. మాస్టర్ మైండ్ వికాస్ గుప్తాకు సన్నిహితుడు. వికాస్ -పార్త్ బహిరంగంగా గొప్ప స్నేహితులు అని అందరికీ తెలుసు. దిశాతో పార్థ్ ఒకానొక సమయంలో నిండా ప్రేమలో మునిగాడు. దిశ గురించి పిచ్చిగా పొసెసివ్‌గా ఉండేవాడు.

కానీ ఆ ఇద్దరికీ ఓ ప్రత్యేక కారణం వల్ల బ్రేకప్ అయింది. దిశా అతడిని విడిచిపెట్టడానికి కారణం.. తన ఫోన్‌ను దిశా నిరంతరం తనిఖీ చేయడమేనని తెలిసింది. దిశా పొసెసివ్‌నెస్‌ని చూసి, ఆమెను విడిచిపెట్టాలని పార్థ్ నిర్ణయించుకున్నాడు. దిశా టైగర్ ష్రాఫ్‌తో డేటింగ్ ప్రారంభించింది, కానీ కొన్ని సంవత్సరాల క్రితం సంబంధం ముగిసింది.

## డిసెంబర్ 13నుంచి
# "హరికథ" స్ట్రీమింగ్

సరికొత్త కంటెంట్ ను ఎప్పటికప్పుడు ఓటీటీ లవర్స్ కు అందిస్తోన్న డిస్నీ ప్లస్ హాట్ స్టార్ "హరికథ" అనే మరో సరికొత్త వెబ్ సిరీస్ ను తీసుకొస్తోంది. హాట్ స్టార్ స్పెషల్స్ గా ఈ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ వెబ్ సిరీస్ ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. మ్యాగీ "హరికథ" సిరీస్ కు దర్శకత్వం వహిస్తున్నారు. దివి, పూజిత పొన్నాడ, రాజేంద్రప్రసాద్, శ్రీరామ్, మౌనిక రెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాధినేని, శ్రియా కొట్టం, ఉషా శ్రీ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. డిసెంబర్ 13 నుంచి "హరికథ" వెబ్ సిరీస్ స్ట్రీమింగ్ కు రాబోతోంది. "హరికథ" సిరీస్ ట్రైలర్ రిలీజ్ చేశారు. ధర్మం నశించి, అధర్మం పెరిగినప్పుడు తాను మళ్లీ పుడతానని, ధర్మాన్ని స్థాపిస్తానని శ్రీకృష్ణుడు భగవద్గీతలో చెప్పినట్లు..పరశురాముడు, నరసింహుడు, వామనమూర్తి..ఇలా శ్రీవిష్ణు అవతారాల రూపంలో ఊరిలో నేరస్తులను శిక్షిస్తుంటాడో అపరిచిత వ్యక్తి.





# 'బచ్చలమల్లి' మెస్మరైజింగ్ మెలోడీ

అల్లరి నరేష్ హీరోగా నటిస్తున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ బచ్చల మల్లి పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మించిన ఈ చిత్రం హై-ఆక్టేన్ యాక్షన్, ఎంటర్‌టైన్‌మెంట్ గా వుండబోతోంది. బచ్చల మల్లిని డిసెంబర్ 20న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు ఇటీవల ప్రకటించారు. అన్‌స్టాపబుల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ఎస్ థమన్ మూవీ సెకండ్ సింగిల్- అదే నేను అసలు లేను సాంగ్ ని లాంచ్ చేశారు. అద్భుతమైన ట్రాక్స్ ని అందించే స్టార్ కంపోజర్ విశాల్ చంద్రశేఖర్, బచ్చల మల్లిలో అల్లరి నరేష్, అమృత అయ్యర్ మధ్య బాండింగ్ ని అందంగా ప్రజెంట్ చేసే మెలోడీని కంపోజ్ చేశారు. అల్లరి నరేష్, ఒకప్పుడు రగ్గడ్ గా ఉండే వ్యక్తి, అమృత అయ్యర్ తో సోల్ ఫుల్ జర్నీ తో తన క్యారెక్టర్ లో వచ్చే మార్పును సాంగ్ చాలా బ్యూటీఫుల్‌గా ప్రజెంట్ చేస్తోంది.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at **SRI SHANTHI PUBLICCATIONS** H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. **EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609.** Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com